Anveshi
RESEARCH CENTRE FOR WOMEN'S STUDIES

సమకాలీన రాజకీయాలపై
బ్రాడ్‌షీట్

# సెజ్ పాలసీ: రాజకీయ, ఆర్థిక అంశాలు

*సంచిక : 3(త్రైమాసికం)* *తెలుగు & ఇంగ్లీష్* *జనవరి 2012* *విరాళం : 15 రూ.*




**విషయసూచిక**


- సంపాదకీయం
- ఆంధ్రప్రదేశ్‌లో భూముల గొడవ: పరిశ్రమలకు భూపందేరం *కె.బాలగోపాల్*
- ప్రజల కొరకు, ప్రజల చేత, ప్రజలదైన పారిశ్రామీకరణ *అమిత్ బాధురి, మేధాపాట్కర్*
- ప్రత్యేక ఆర్థిక మండళ్ళు : విధాన చర్చపై పున:సమీక్ష *ఆరాధన అగర్వాల్*
- సెజ్‌లకు భూసేకరణకు సంబంధం లేదు *కమల్ నాథ్, కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రి ఇంటర్వ్యూ*
- ఊరుమ్మడి భూముల్ని కాపాడుకుందాం *మానవ హక్కుల వేదిక*
- కాకినాడలో కడలినెట్ వర్క్ స్థాపించి సెజ్‌లకు వ్యతిరేకంగా పోరాడుతున్న రాజేంద్రతో ఇంటర్వ్యూ *కె.శ్రీనివాసులు, ఆర్.శ్రీవత్సన్, ఎ.సునీత, జి.శ్యామల*
- తడ, నెల్లూరు అపాచి సెజ్‌తో మేలు జరుగుతుందని ఆశించిన కార్మికుల నిరాశ *ఉషా సీతాలక్ష్మి*
- చట్టం, భూసేకరణ, ప్రజాప్రయోజనాలు *వసుధ నాగరాజ్*
- ఎమినెంట్ డొమైన్ : ఒక నేపథ్యం *ఆర్.శ్రీవత్సన్*
- 30 ఏళ్ళ చైనా ప్రత్యేక ఆర్థిక మండళ్ళు *మేన్ యంగ్, జో యన్నా లీ మరియు గోర్డాన్ కి*

**నిజాం బ్రాడ్ షీట్‌పై చర్చ**

- లెటర్ టు ద ఎడిటర్ *టి.హనుమాన్ చౌదరి*
- హైదరాబాద్ 1948 సెప్టెంబరు 17 ముందు తరువాత *కేశవరావ్ జాదవ్*


*ప్రత్యేక సంపాదకులు : ప్రొ॥కె.శ్రీనివాసులు, ఎన్.వసుధ*

***సంపాదకులు:*** *ఎ. సునీత, ఆర్. శ్రీవత్సన్, ఎమ్.ఎ.మోయిద్*

***అడ్వయిజరీ బోర్డ్:*** *షీలా ప్రసాద్, అయేషా ఫరూకీ, రమా మెల్కోటే, కె.సజయ, పి.మాధవి, బి.శ్యామసుందరి, సూజీ థారు, వీణా శత్రుఘ్న, డి.వసంత, కె.లలిత, ఎన్.వసుధ, గోగు శ్యామల, ఉమ భృగుబండ, వి.ఉష.*

***ప్రొడక్షన్:*** *ఏశాల శ్రీనివాస్, తాడేపల్లి శ్రీలక్ష్మి*

***ప్రచురణ సంస్థ : అన్వేషి రిసెర్చ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్,*** 2-2-18/49, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ, అంబర్‌పేట్, హైదరాబాదు-13.

వ్యాసాలలోని సమాచారం, దృక్పథాలు, అభిప్రాయాలు, వ్యాసకర్తలవి, ప్రత్యేక సంపాదకులవి

# సంపాదకీయం

2005లో భారత పార్లమెంటు పెద్దగా చర్చించకుండానే ఆమోదించిన సెజ్ చట్టం 2006 నుండి అమలులోకొచ్చింది. అప్పటి నుండి సెజ్ ప్రతిపాదనలు మునుపెన్నడూ లేనంత వేగంగా స్వీకరింపబడి, అనుమతులు పొందుతున్నాయి. 2008 నాటికి 740 సెజ్ ప్రతిపాదనలు వివిధ స్థాయిల్లో అనుమతులు పొందాయి. వాటిలో 172 సెజ్‌లు నోటిఫై చేయబడ్డాయి; 404 అధికారికంగా ఆమోదం పొందాయి; 165 సూత్రప్రాయంగా ఆమోదముద్ర పొందాయి. (కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఇచ్చిన సమాచారం సెమినార్ పత్రిక ఫిబ్రవరి 2008 సంచిక ప్రకారం).

సెజ్‌లపై చర్చ వేరే ఏ విధానాలపై లేనంత గాఢ రాజకీయ విభేధాలతో కూడుకుని, తీవ్రస్థాయిలో, ఏకోన్ముఖంగా సాగుతోంది. సెజ్ అనుకూల వాదమంతా వాటి వల్ల పెట్టుబడులొస్తాయని, సహజ వనరులు సక్రమంగా వినియోగింపబడతాయని, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, వీటివల్ల ప్రాంతం మొత్తం అభివృద్ధి చెందుతుందనే వాదనలపై కేంద్రీకృతమయింది. సెజ్ వ్యతిరేకులు ఈ వాదనలన్నింటినీ విమర్శనాత్మక, నిశిత పరిశీలనకు గురిచేస్తున్నారు. వారు దృష్టి పెట్టిన వివాదాస్పదమైన అంశాలు: సేకరిస్తున్న భూమి పరిమాణం, అనుసరించే పద్ధతులు, ఆ భూమిని వాడుతున్న విధానం, స్థానిక ప్రజలు నిర్వాసితులవటం, స్థానిక ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం, బయటి నుండి స్థానికంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలకు పెరుగుతున్న వలసలు, సామాజిక, సాంస్కృతిక జీవనంపై ఆ వలసల ప్రభావం. దేశంలో ప్రతిపాదింపబడిన సెజ్‌లకు అవసరమయే మొత్తం భూమి దాదాపు 1,26,077 హెక్టార్లు (బెనర్జీ–గుహ 2008) దీనిలో అధిక శాతం బహుళ పంటలు పండే భూమి. మౌలిక సదుపాయాల పరంగా ఇప్పటికే అభివృద్ధి చెందిన ప్రాంతాలలో వుంది. (దీనివల్ల సెజ్ డెవలపర్లకు అయ్యే ఖర్చు తగ్గుతుందన్న మాట) ఈ సెజ్‌ల కారణంగా వ్యవసాయంపై ఆధారపడిన దాదాపు 12 లక్షల మంది ప్రజల జీవితాలు ప్రతికూలంగా ప్రభావితమవుతాయి.

గ్రామీణ వ్యవసాయం దిగజారి దానిపై ఆధారపడే చేతి వృత్తి పనుల సమూహాలు, సేవావృత్తుల కులాలు కూడా దెబ్బతింటాయి. ఇంత పెద్ద ఎత్తున వ్యవసాయ భూమిని పారిశ్రామిక భూమిగా మార్చినపుడు భవిష్యత్తులో దేశ ఆహార భద్రత దెబ్బతినే ప్రమాదం వుంది. అందువల్ల ఈ సెజ్ ఆధారిత అభివృద్ధి నమూనాను, పర్యావరణంపై దాని ప్రభావాన్ని మొత్తంగా ప్రశ్నించాలి; కార్పొరేట్ లాభాల స్థానంలో ప్రజల అవసరాలకు ప్రాధాన్యతనిచ్చే ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను ప్రతిపాదించాలి. ఈ సంచికలో మేధాపాట్కర్, అమిత్‌భాధురిల సంక్షిప్త వ్యాసం ఈ విషయాలపై దృష్టి కేంద్రీకరిస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వాలన్నీ సెజ్ ప్రతిపాదనలకు అత్యుత్సాహంతో స్పందిస్తున్నాయి. ప్రజా వ్యతిరేకత – జనసమీకరణ, విస్తృతి, తీవ్రతలో తేడాలున్నా – కూడా బలంగానే వుంది. హింసతో కూడుకుని వున్న పశ్చిమ బెంగాల్ సెజ్ వ్యతిరేక పోరాటం, అహింసా మార్గంలో సాగిన గోవా సెజ్ జనసమీకరణలు సెజ్ అభివృద్ధి నమూనాకు వ్యతిరేకంగా వచ్చిన పోరాటాల్లో ప్రత్యేకంగా చెప్పుకోదగ్గవి.

సెజ్‌ల నేపథ్యాన్ని అర్థం చేసుకోవటానికి, మన దేశంలో గ్రామీణ రాజకీయార్థిక వ్యవస్థ దిగజారిన పరిస్థితులను కొంతమేరకైనా పరిశీలించటమవసరం. హరిత విప్లవం తరువాత గ్రామీణ వ్యవస్థ విచ్ఛిత్తి వేగవంతంగా జరగసాగింది. దీనితో వ్యవసాయదారులకూ, చేతివృత్తి వారికీ, గ్రామీణ సేవా కులాల వారికుండే పరస్పరాధారిత సంబంధాలు తెగిపోయాయి. అయితే ఇటువంటి సంబంధాల నుండి బయటపడిన వారికి స్వేచ్ఛ, ఉపాధి, శాంతియుత సంబంధాలేమీ ప్రపంచంలో దొరకటంలేదు. తాము కోల్పోయిన ప్రపంచం తాలూకు స్మృతులు మాత్రం మిగిలిపోతున్నాయి.

హరిత విప్లవం తరువాత వ్యవసాయ రంగంలో వచ్చిన సంక్షోభంతో ఆధిపత్యకులాల వ్యవసాయదారులు, వారి కుటుంబాలూ, వారి సంపదా – పట్టణాల్లోని ఫుడ్ ప్రాసెసింగ్, సేవారంగం, రియల్ ఎస్టేట్ వంటి వ్యాపారాలకి తరలిపోయాయి. ఆర్థిక సరళీకరణతో పెరిగిపోయిన ఖర్చులవల్ల చిన్నకమతాల వ్యవసాయదారులు చాలామంది వ్యవసాయాన్ని వదిలేసారు. వ్యవసాయానికీ, చేతివృత్తులకూ (ముఖ్యంగా, వ్యవసాయం తరువాత అత్యధిక ఉపాధి కల్పించే చేనేత రంగానికి) ప్రభుత్వ సహకారం తగ్గి, ఈ రంగాలలో సంక్షోభం ఇంకా పెరిగింది. ఇది మనకు రైతుల, చేనేత కార్మికుల ఆత్మహత్యల రూపంలో స్పష్టంగా కన్పిస్తుంది. 'పల్లె కన్నీరు పెడుతోంది' పాటలో వాగ్గేయ కారుడు గోరేటి ఎంకన్న గ్రామీణ ప్రాంతాల్లో ఈ దుర్భర పరిస్థితులను కళ్ళక్కట్టినట్లు వర్ణిస్తారు.

సరళీకరణ తరువాతి రాజ్య స్వభావాన్ని అర్థం చేసుకోవటానికి చేసిన విశ్లేషణలు భారత రాజ్యాన్ని ఒక నయా ఉదారవాద నమూనాతో చూస్తున్నాయి. అయితే భారత రాజ్యాన్ని ఒక సంపూర్ణ పరిణితి చెందిన నయా ఉదారవాద రాజ్యంగా చూడలేము. ఇంకా పరిణామం చెందుతున్న రాజ్యమిది. ఇక్కడ రూపుదిద్దుకుంటున్న రాజ్య పరిణామక్రమాన్ని నిర్దేశించే ప్రక్రియలు చాలా ఉన్నాయి : పట్టణాలకూ, పల్లెలకూ మధ్య, వ్యవసాయానికీ, పరిశ్రమలకూ మధ్య పెరుగుతున్న సంబంధాలు, వైరుధ్యాలు; క్షీణిస్తున్న వ్యవసాయం వల్ల గ్రామీణ ప్రాంతాలలో ఉద్భవిస్తున్న దుర్భర పరిస్థితుల నుండి, తరతరాలుగా కొనసాగుతున్న వర్గ/కుల సంబంధాల నుండీ బయటపడదామనే ఆకాంక్షలు; గ్రామం వెలుపల కొత్త స్వేచ్ఛా, అస్తిత్వాల భవిష్యత్తు ఆశలతో పూరిస్తున్న ఊహలు – వీటిలో కొన్ని.

సరళీకరణ చెందుతున్న రాజ్యం, తన అభివృద్ధి పథం నుండి ఉద్భవిస్తున్న ప్రజాగ్రహం, వత్తిడులు, ఆశలు, ఊహలూ అన్నింటినీ తన నయా ఉదారవాద ఎజెండాని ముందుకు తీసుకుపోవటానికి వాడుకుంటోంది. ఈ వాతావరణంలోనే సెజ్ విధానం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. పెట్టుబడులు, టెక్నాలజీ, మౌలిక సదుపాయాలు, ఎగుమతులకు ప్రోత్సాహకాలు, ఉపాధి కల్పన వాగ్దానాలూ (నయా ఉదారవాద వాతావరణంలో ప్రజలేవైతే ఆశిస్తున్నారో వాటన్నిటితో) ముందుకు తేబడుతోంది.

సెజ్ విధానాలకు వ్యతిరేకంగా వస్తున్న పోరాటాలు, సంఘర్షణల నేపథ్యంలో స్పష్టమయేదేమిటంటే రాజ్యం పాత్ర ఏ మాత్రం తగ్గటం లేదని; దాని తీరు మారి కార్పొరేట్ వర్గానికి పూర్తిగా అనుకూలంగా మారిందని. సరళీకృతమవుతున్న రాజ్యం ఈ ప్రక్రియను ముందుండి నడిపిస్తుండటంతో గ్రామీణ ప్రాంతాలలో కొత్త రకమైన అలజడి, సంఘర్షణలు తలెత్తుతున్నాయి.

సెజ్ విధానంలో అత్యంత వివాదాస్పదమైన విషయం భూసేకరణ. భూమితో పాటే దానికి ముడిపడివున్న ప్రజల జీవనోపాధి, వనరుల అందుబాటు, పర్యావరణం, జీవావరణం వంటి విషయాలన్నీ చర్చలో కొస్తున్నాయి.

సంఘర్షణ కేవలం భూయాజమాన్య వర్గానికే పరిమితం కాకుండా మొత్తం గ్రామీణ ప్రజానీకానికి సంబంధించిందిగా తయారైంది. వ్యవసాయ కూలీలు, చేతివృత్తి సమూహాలు, బెస్తవారూ, సేవావృత్తి కులాలూ అందరినీ ఈ సమస్య కదిలిస్తోంది.

1894 నాటి భూసేకరణ చట్టం ఎమినెంట్ డొమైన్ మరియు ప్రజా ప్రయోజనమనే రెండు ముఖ్యమైన సైద్ధాంతిక భావనలను వాడి భూసేకరణలో రాజ్యాధికారాన్ని సమర్థిస్తుంది. (ఈ సంచికలో శ్రీవత్సన్, వసుధల వ్యాసాలని చూడండి) రాజ్యం తన సర్వాధికారాన్నుపయోగించి వ్యక్తుల స్వంత ఆస్తులను ప్రజాప్రయోజనం కోసం స్వాధీనం చేసుకోవటాన్ని ఎమినెంట్ డొమైన్ (అత్యున్నత నిర్ణయాధికారం) అంటారు. ఈ చట్టం ప్రజాప్రయోజనమంటే నేరుగా, పారదర్శకంగా అర్థమయే సామాజిక అవసరాలు – ప్రజలకుపయోగపడే రోడ్లు, రైల్వేలైన్లు, స్కూళ్ళు, హాస్పిటల్సు, ఆనకట్టలు వంటివిగా అర్థం చేయిస్తుంది.

దీనివల్ల రాజ్యానికి ఎమినెంట్ డొమైన్ సూత్రం ద్వారా లభించిన అధికారాన్ని భూస్వామ్యవర్గాలు వ్యతిరేకించినా, దానికున్న చట్టబద్ధత (legitimacy) దెబ్బతినలేదు. 1894 చట్టం రెండు విషయాలపై మాత్రమే వ్యక్తులు కేసులు వేయటానికి అనుమతిస్తుంది: చట్టబద్ధమైన ప్రక్రియను భూసేకరణలో అనుసరించనప్పుడు లేదా సేకరించిన భూమికి న్యాయమైన పరిహారం లభించనప్పుడు.

2006లో చేసిన సెజ్ చట్టంలో ప్రజలకి రాజ్య చట్ట భద్ధతపై నమ్మకం కలిగించనివి చాలా వున్నాయి: మొదటిది ఏ ప్రయోజనాల కోసమైతే భూమిని సేకరిస్తున్నారో అది ఏ రకంగా ప్రజావసరం అవుతుందో స్పష్టంగా నిర్వచించలేదు. ఈ భూసేకరణ కేవలం సెజ్ డెవలపర్లు, అక్కడ లాభార్జన కోసం పరిశ్రమలు పెట్టిన పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే అనేది అత్యంత స్పష్టంగా తెలుస్తుంది. రెండవది, చాలా సందర్భాల్లో భూసేకరణలో పాల్గొనే డెవలపర్లు, ప్రభుత్వ విభాగాలు ఇటువంటి చట్ట ప్రక్రియలను అనవసరమైన అడ్డంకులుగా భావిస్తారు. అధికారాల్లేని భూయజమానుల విషయంలో వారి చట్టపరమైన హక్కులపట్ల, ఆయా చట్టాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారు. వసుధ వాదించినట్లు చట్టబద్ధ ప్రక్రియలో భూసేకరణ మొత్తం పారదర్శకంగా వుండాలి. ఇటువంటి పారదర్శక చట్టబద్ధ ప్రక్రియ ప్రకారం: ఏ ప్రజల వద్ద నుండి భూమిని సేకరించదలచుకున్నారో ఆయా ప్రజలకు ముందు నోటీసులు జారీ చెయ్యాలి; తరువాత అందరికీ తెలిపి పబ్లిక్ హియరింగ్ జరపాలి; ప్రజల నుండి అభ్యంతరాలను స్వీకరించాలి; ప్రజల జీవనోపాధి, పర్యావరణం పై ప్రభావాన్ని స్టడీ చేసి ఇవ్వబోయే పరిహారాన్ని నిర్ణయించాలి. అయితే ఇదంతా చేస్తే చాలా సమయం పడుతుంది, కాబట్టి ప్రభుత్వ విభాగాలు అడ్డదారులు తొక్కుతున్నాయి. చాలా

వరకు, స్థానిక అధికారులు, పోలీసులు కలిసి భూయజమానులను నయానో భయానో 'దారి'కి తెచ్చి భూస్వాధీనానికి ఒప్పిస్తున్నారు.

సేకరించిన భూములు ఎందుకూ పనికిరానివని, తక్కువ రకం మెట్టభూములనీ, ఈ విధంగా పరిశ్రమలకూ, ప్రాజెక్టులకి ఇస్తే  కొంతైనా ఉపయోగపడుతుందని చెప్తూ భూసేకరణను సమర్థించుకుంటున్నారు. దళితులు, కింది కులాలకిచ్చిన భూములను ప్రభుత్వం తనఅవసరాల కోసం తిరిగి తీసుకునే హక్కుందని చెప్పుకుంటున్నారు. ఈ రకంగా 'పనికిరాని భూమి' అనే భావన రావటానికి తప్పుడు అవగాహనే కాక కొండంత అజ్ఞానం కూడా కారణమని బాలగోపాల్ (ఈ సంచికలో) విశదీకరిస్తారు. తగ్గిపోతున్న వూరుమ్మడి భూములు (పోరంబోకు, బంచరాయి, కరిజ్ కథ భూములు) దాని వల్ల ప్రజల జీవనోపాధి, సామూహిక జీవితాలపై పడుతున్న ప్రభావాన్ని కనుమరుగు చెయ్యాలని ప్రయత్నిస్తున్న ప్రభుత్వ కపటత్వం కూడా ఈ 'పనికిరాని భూమి' భావనలో దాగి వుంది. గోవాలో ప్రభుత్వం పెద్ద పెద్ద 'కమ్యూనిడాడ్' భూములను పారిశ్రామిక భూములుగా మార్చటానికి ఇదే వాదనను వాడుకొంది. ప్రభుత్వ రికార్డులలో 'మెట్టభూములు'గా చెప్పబడుతున్న భూముల విషయం కూడా చాలా భయంకరమైనదే. కాకినాడ అనుభవంలో అర్థమయ్యేదేమిటంటే రికార్డులలో మెట్టభూములుగా చెప్పబడినవి తరువాతి కాలంలో చాలా బాగుపడ్డాయి. వాటిలో జీడి, సరుగుడు, మామిడి, కొబ్బరి పంటలు పండిస్తున్న రైతులకు మంచి ఆదాయాన్నిస్తున్నాయవి. 'పనికిరాని భూమి' అనే భావన మనకి భూమిని గురించి అర్థం చేయించేది తక్కువ, కనుమరుగు చేసేది ఎక్కువ. ఈ ప్రక్రియలో – రైతులు, వ్యవసాయకూలీలు, వృత్తి పనులు వారు బెస్తవారు మొదలగు వారి జీవితాలు, జీవనోపాధి, జీవివారణం అన్నీ కూడా ప్రశ్నార్థకంగా మారాయి.

ప్రభుత్వ విభాగాలు, సెజ్ డెవలపర్లు రైతుల నుండి భూమిని సేకరించటానికి వుపయోగించే పద్ధతులలో ఒక క్రమముంది. పైకి చట్టంలో చెప్పిన పద్ధతులన్నీ అనుసరించినట్లు అన్పించినా, మనకు భూసేకరణ అసలు స్వరూపం కింది స్థాయి ప్రభుత్వోద్యోగులు, ప్రభుత్వ విభాగాలు వుపయోగించే 'ఇన్‌ఫార్మల్' పద్ధతులలో కన్పిస్తుంది. అత్యంత చురుకుగా వారు భూసేకరణలో పాల్గొనటం కూడా కన్పిస్తుంది. భూమితో పెద్ద సంబంధాలు లేకుండా, పట్టణ ప్రాంతాలలో వుండే పలుకుబడున్న పెద్ద భూస్వాములను ముందుగా గుర్తించటం జరుగుతుంది. సెజ్ డెవలపర్లు, ప్రభుత్వం వీళ్ళతో నష్టపరిహారానికి సంబంధించి ఒక ఒప్పందం చేసుకుంటారు, (కంసెంట్ అవార్డ్ ద్వారా). గ్రామాల నుండి తరలిపోయిన భూస్వాములతో ఇలా ఒప్పందం కుదుర్చుకుని, తమవైపు మలుపు కోవటం ద్వారా చిన్న కమతాలున్న వ్యవసాయదారులను వత్తిడి చేయటం తేలికవుతుంది. ఈ రకంగా రైతులు నుండి వ్యతిరేకత లేకుండా, వారిని వత్తిడిచేసి సెజ్‌లకు ఒప్పించటంలో స్థానిక రెవెన్యూ అధికారవర్గం ప్రధాన పాత్ర పోషిస్తారు. స్థానిక పైరవీకార్లు, పంచాయితీ అధికార్లతో తమకున్న లోపాయికారీ సంబంధాలనుపయోగించి ఈ చిన్నస్థాయి రెవెన్యూ అధికారులు గ్రామాలలో 'ప్రభుత్వానికి ఏ భూమినైనా ఎప్పుడైనా, ఎక్కడైనా తీసుకునే అధికారం' వుందని చెపుతూ. భూసేకరణను వ్యతిరేకించటం వల్ల ఏ ప్రయోజనమూ వుండదనే సందేశాన్ని ప్రచారం చేస్తుంటారు. ఒకవేళ రైతులు వ్యతిరేకిస్తే వాళ్ళు ఇంకా మంచి నష్టపరిహారం అడగ్గలిగే అవకాశం కోల్పోతారని చెప్తారు. స్థానిక ఎమ్.ఎమ్.ఎ.లు కూడా తమ 'మనుష్యుల' ద్వారా ఈ సెజ్ వ్యవహారాల్లో తలదూర్చటం మనకన్పిస్తోంది. (శ్రీనివాసులు, తరువాత ప్రచురింపబోయే వ్యాసం).

సెజ్ అనుకూలురు / వ్యతిరేకులు కూడా సిద్ధాంతపరంగా కొన్ని సులభమైన సూత్రీకరణలతో వాదిస్తున్నారు : 1) రాజ్యం, దాని సంస్థాగత నిర్మాణాలు రెండూ కూడా సెజ్‌లకు పూర్తిగా అనుకూలంగా వున్నాయి. 2) ప్రజలందరూ వీటిని వ్యతిరేకిస్తున్నారు. అయితే వాస్తవ పరిస్థితులు దీనికి భిన్నంగా సంక్లిష్టత, వైరుధ్యాలతో కూడి వున్నాయి. ఈ రెండు సులభమైన సూత్రీకరణలలో అవి ఇమడట్లేదు. ప్రభుత్వం వైపు నుండి సంక్లిష్టతా కారకాలు ఈ కింది విధంగా వున్నాయి. ఎ) సెజ్‌లపై న్యాయవ్యవస్థ, శాసనవ్యవస్థ, పరిపాలనా వ్యవస్థల మధ్య విభేదాలు, సంఘర్షలు ఇదివరకటికంటే స్పష్టంగా కన్పిస్తున్నాయి. శాసన వ్యవస్థకు, పరిపాలనా వ్యవస్థకు ఘర్షణ ఎక్కువవుతోంది. న్యాయవ్యవస్థేమో విధాన నిర్ణయాలు, వాటి అమలు, పర్యవేక్షణ గురించి తనంతట తానే చొరవ తీసుకుని, తన పరిధిని విస్తృతం చేసుకుంటోంది. ఉన్నత స్థాయి న్యాయస్థానాలు ఆర్థిక విధానాలలో పెద్దగా చొరబడలేదు గానీ, నయాఉదారవాద విధానాల నుండి ఉద్భవిస్తున్న అవినీతిని కట్టడి చేయటంలో చాలా చొరవ తీసుకుని ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి.

ప్రభుత్వ విభాగాల మధ్య కూడా సెజ్‌ల విషయంలో ఘర్షణలు తలెత్తుతున్నాయి. మంత్రిత్వశాఖలూ, విధాన నిర్ణయ విభాగాలన్నీ కలిసికట్టుగా దీనిని అమలు పరుస్తున్నాయనే సూత్రీకరణ తప్పని వీటి మధ్య తలెత్తుతున్న అభిప్రాయ బేధాలు, దృష్టికోణ బేధాలు మనకి తెలియచేస్తున్నాయి. సంకీర్ణ ప్రభుత్వాలలో వుండే రాజకీయ బహుళత్వాన్ని ఈ విభేదాలు ప్రతిబింబిస్తున్నాయి. అంతేకాదు విధాన నిర్ణాయక కేంద్రాలు కూడా కీలక ప్రభుత్వ విభాగాల నిర్ణయాలతో విభేదిస్తున్నాయి. కేంద్ర ప్రణాళికా సంఘం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖతో సెజ్‌ల గురించి విభేదించి వాటిని రియల్ ఎస్టేట్ వెంచర్లుగా పరిగణించాలని చెప్పటం దీనికొక మంచి ఉదాహరణ. ఈ సంచికలో కేంద్ర వాణిజ్యశాఖ మంత్రితో ఇంటర్వ్యూ, ఆర్‌బిఐ గవర్నర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, ప్రభావశాలియైన ఒక నయా ఉదారవాద ఆర్థికవేత్త సెజ్‌ల గురించి చేసిన వ్యాఖ్యానాల నుండి కొన్నిఎంపిక చేసి ఈ విబేధాలను ఎత్తి చూపటానికి ప్రయత్నించాము. సెజ్‌ల గురించి సంస్థాగతంగా, విధానపరంగా, పాలనపరంగా వున్న విబేధాలు, తేడాలు, సంఘర్షణలు దృష్టిలో పెట్టుకుని సెజ్‌ల విధానం, అమలుకు సంబంధించిన చర్చను జాగ్రత్తగా, సునిశితంగా విమర్శించే ప్రయత్నం చెయ్యాలి. రాజ్య విభాగాల మధ్యలో వుండే ఈ సంఘర్షణలు, విభేదాలే సబాల్టర్న్ సమూహాలకు చొరబడే అవకాశాలను కల్పించగలవు.

సెజ్‌లకు వస్తున్న వ్యతిరేకత కూడా కొంతమంది చెప్పినట్లు ఒకే విధంగా లేదు. సందిగ్ధత, అంతర్గత తేడాలు, డోలాయమానత ఇక్కడా వున్నాయి. ప్రజాస్పందన, పోరాటాలలో వాటికి లభిస్తున్న సామాజిక ఆదరణలో తేడాలను మనం హరిత విప్లవం తరువాత రాష్ట్రాల, ప్రాంతాల వారీగా పట్టణాల గ్రామాల మధ్య మార్పుల నేపథ్యంలోనే అర్థం చేసుకోగలం.

చాలా వరకు కార్పొరేట్ పెట్టుబడిదారీ అభివృద్ధి బాధితులు తమ పోరాటాలన్నీ స్థానిక వనరులపై ఆధారపడి చేస్తున్నారు. కొంతమేరకు పౌరసమాజ సంస్థలు వీటికి సహాయాన్నందిస్తున్నాయి. అయితే స్వచ్ఛంద సంస్థలు, పౌర హక్కుల సంఘాలూ రాజకీయపరమైన కుతంత్రాలకి బలైపోవటమే కాక, రాజ్యం ఉపయోగించే అణచివేత విధానాలకి కూడా గురవుతున్నాయి. ఈ సంచికలో రాజేంద్ర చెప్పినట్లు రాజ్యాన్ని, కార్పొరేట్ పెట్టుబడినీ తట్టుకుని సాధించిన విజయాలు చాలా చిన్నవి, అయితే పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్‌లో, గోవాలో రాష్ట్ర ప్రభుత్వాలు సెజ్‌లను రద్దు చేయాల్సి రావటం ప్రజాఉద్యమాల బలాన్ని తెలిపి ప్రభుత్వాలూ, విధాన నిర్ణాయకులు ప్రజావ్యతిరేకతను పరిగణనలోనికి తీసుకోవాల్సిన అవసరాన్ని కల్పించాయి. ప్రభుత్వాలు ప్రజలను పదే పదే తమ విధానాల ద్వారా నిర్వాసితులను చేసినా కూడా విధానపరమైన చర్చనుండి "ప్రజలు" తొలగిపోకుండా వున్నారంటే ఈ పోరాటాల ఫలితమే అని చెప్పుకోక తప్పదు. ఈ చిన్న విజయాలే దేశం మొత్తం మీద సెజ్ వ్యతిరేక పోరాటాలకి స్ఫూర్తిగా నిలుస్తున్నాయి.

ఈ పోరాటాల వెలుగులోకి తెస్తున్న విషయాలు ఎంతో ప్రాముఖ్యత కలిగున్నా స్థానిక ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలో వీటిని గురించిన వార్తలు చాలా అసంతృప్తికరంగా వున్నాయి. ఇది చాలా విచారకరం. వార్తలన్నీ కొన్ని సంఘటనలు, ఉదంతాల చుట్టూ తిరుగుతున్నాయి. విశ్లేషణా చట్రాలు, నేపథ్యం, నిర్మాణ సంబంధాల సంక్లిష్టత గురించి అవగాహన లోపించటం వల్ల సమస్య లోతును వార్తలు ప్రతిబింబిచటం లేదు. సెజ్‌ల రాజకీయాలు, విధానాలు, ఆర్థిక స్థితి గురించిన కొన్ని అంశాలను ఈ బ్రాడ్‌షీట్‌లో చర్చించటం జరిగింది. పౌర సమాజ సంస్థలకు, జర్నలిస్టులకు, ఎన్.జి.ఒలకు, కార్యకర్తలకు, సామాజిక శాస్త్ర విద్యార్థులకు, సెజ్ విధానాల గురించి, సెజ్ వ్యతిరేక పోరాటాల గురించి తెలుసుకోవాలనుకునే వారందరికీ ఇది ఉపయోగపడుతుందని మా ఆశ.

**కె. శ్రీనివాసులు**
**ప్రత్యేక సంపాదక బృందం తరపున**
**అనువాదం : ఎ.సునీత**

*పాఠకుల నుండి విమర్శలని, సూచనలని ఆహ్వానిస్తున్నాం.*
*మీ ఉత్తరాలు రాయాల్సిన అడ్రస్: సంపాదకులు, సమకాలీన రాజకీయలపై బ్రాడ్‌షీట్, అన్వేషి రిసెర్చ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్*
*2-2-18/49, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ, అంబర్‌పేట్, హైదరాబాద్ – 500013. ఇ-మెయిల్ broadsheet@anveshi.org కి పంపించాలి.*
*వ్యక్తిగత ఆరోపణలు లేని, సద్విమర్శ కలిగిన ఉత్తరాలను స్పందనలను తరువాతి బ్రాడ్‌షీట్ సంచికలో ప్రచురిస్తాం.*

# ఆంధ్రప్రదేశ్‌లో భూముల గొడవ పరిశ్రమలకు భూపందేరం-II

■ కె.బాలగోపాల్

సారవంతమైన పంటలు పండే సాగుభూముల్ని ప్రభుత్వం రైతుల దగ్గర్నుంచి బలవంతంగా లాక్కొని పరిశ్రమలకు కేటాయించడం ఎంత తగని విషయమో సింగూర్ మరియు నందిగ్రామ్ సంఘటనల ద్వారా తెలిసొచ్చింది. అయితే సాగులో లేని "వృధా" భూముల్ని పరిశ్రమలకివ్వడం వల్ల ఏ సమస్యా లేదనీ, పైగా ఇది రైతులకు, వారి వ్యవసాయానికీ రక్షణ కల్పిస్తుందనీ ఒక వాదన వినిపిస్తోంది.

సాగుభూముల్ని పరిశ్రమలకు కేటాయించడం చాలా తీవ్రమయిన విషయం అనీ, ఇది రైతులకు ఆగ్రహాన్ని తెప్పిస్తుందనీ అందరికీ తెలుసు. అయితే సాగులో లేని భూముల్ని లేదా బంజరు భూముల్ని పరిశ్రమలకు కేటాయిస్తే మంచిదేగదా అనడం అనేక తప్పుడు అవగాహనల వల్ల చేసే వాదనే. కొన్ని భూములు వృధాగా వున్నాయనడం ఈ తప్పుడు అవగాహనల్లో మొదటిది. భారతదేశంలో రెవెన్యూరికార్డుల్లో తప్ప వృధా భూములెక్కడా లేవు. ఇదేదో పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకొని, భూమంతా పర్యావరణలో భాగం కాబట్టి, అందులో ఏ చిన్న భాగం దెబ్బతిన్నా మొత్తం పర్యావరణానికే దెబ్బ అని చెప్తున్న విషయం కాదు. ఇది అంతకంటే తీవ్రమయిన సమస్య. భారతదేశంలో వున్న భూమి మొత్తాన్ని ప్రజలు వినియోగించుకొంటున్నారు. కొంత భూమిని వృధాగా వదిలెయ్యడానికి మనది సంపన్న దేశంకాదు. అందుకనే ప్రభుత్వం బంజరు భూముల్ని పరిశ్రమలకు కట్టబెట్టిన ప్రతిసారీ కొన్నివేల మంది కాకపోయినా కొన్ని వందలమంది ప్రయోజనాలను దెబ్బతీయడం తప్పకుండా జరుగుతూ వుంది. అట్లని గత్యంతరం లేకనో, కటిక పేదరికం వల్లనో ఈ భూములపైన వాళ్ళు ఆధారపడి బ్రతుకుతున్నారనడం కూడా సరైంది కాదు. తీర ప్రాంత భూముల్ని (ఇవి తీరప్రాంత చట్టాల పరిధిలోని "వృధా"గా వున్న ప్రభుత్వ భూములు) జాలర్లు వాళ్ల పడవలను ఉంచుకోడానికి, వలలను ఆరబెట్టుకోడానికి, చేపలను అమ్ముకోడానికి, సామానులను మరమ్మత్తు చేసుకోడానికి ఉపయోగించు కొంటున్నారు. అలాగే దక్కనులోని రాళ్ళు రప్పలున్న వృధా భూమిలో రాళ్ళను పగులగొట్టి, కంకర అమ్ముకొని మరి కొంతమంది పేద ప్రజలు జీవిస్తున్నారు. వాళ్ళు దాన్ని కుల వృత్తిగా కూడా పరిగణిస్తారు. ఇలా యింకా చాలామంది గురించి చెప్పుకోవచ్చు.

రెండో తప్పుడు అవగాహనేంటంటే ప్రభుత్వం తమ సాగుభూముల్ని లాగేసుకోవడానికి వ్యతిరేకంగా రైతులు చేస్తున్న ఆందోళనను మరియు వ్యవసాయ ఆర్థిక నిపుణులు వ్యవసాయ ఉత్పత్తులు తగ్గిపోతున్నాయని చేసే గోలనూ ఒకేగాటన కట్టేయడం. ప్రతిఏటా రెండు మూడు పంటలు పండే భూమిని పరిశ్రమలకివ్వరాదని ఆర్థిక నిపుణుల సూచన. కానీ తన ఏకైక జీవనాధారమైన భూమిని పోగొట్టుకొంటున్నప్పుడు ఆ భూమిలో ఒకే పంట పండుతుందా లేదా రెండు మూడు పంటలు పండుతాయా, లేదా అది పేరుకు మాత్రమే పంటలు పండే భూమా అనేది రైతుకు ముఖ్యంగాదు.

రెండు మూడు పంటలు పండే భూముల్ని మాత్రమే మినహాయించాలని సోనియా గాంధీ దగ్గర నుంచి ఎమ్.ఎస్.స్వామినాథన్ దాకా చాలా మంది అంటున్నారు. అయితే రైతుల కోణంలోంచి చూస్తే ఇది పూర్తిగా అర్థంలేని సిద్ధాంతం. సాగుభూముల్ని పోగొట్టుకుంటున్న రైతుకు నష్టపరిహారమైనా దక్కుతుంది. దాన్ని ఉపయోగించుకొని వేరే జీవనాధారాన్ని వెతుక్కొనే అవకాశం ఉంది. కానీ సాగులోలేని భూములకిచ్చే నష్టపరిహారం ఎందుకూ పనికిరాదు. ఇదే విషయం గురించి ఈ రైతులేమంటున్నారంటే, రెండు మూడు పంటలు పండే భూముల మార్కెట్ విలువ ఎక్కువ కాబట్టి ఇచ్చే నష్టపరిహారం కూడా ఎక్కువే వుంటుంది. ఆ డబ్బుతో వాళ్ళు ఏదో ఒకటి చేసుకొని బతకవచ్చు. మా భూములకొచ్చేది చాలా తక్కువ. కాబట్టి వాటిని వదిలేయండని వాళ్ళు వాదిస్తున్నారు. ఈ వాదన చాలా మందికి కోపాన్ని తెప్పిస్తుంది. భారతదేశం పారిశ్రామికంగా ఎదగాల్సిన అవసరం లేదంటారా అని వాళ్ళు ప్రశ్నిస్తారు. పెట్టుబడులను ఏ విధంగానైనా ఆకర్షించి తీరాలనే తపనతో వున్న ముఖ్యమంత్రులు కూడా ఇలాగే మాట్లాడుతున్న విషయం మనకు తెలుసు. ఆ విషయాన్ని యిప్పుడు పక్కనబెట్టి యింకొక్క విషయం చెప్పుకొందాం. జీవన భృతి (లైవ్‌లీ హుడ్స్)ని పరిగణనలోకి తీసుకొని జాగ్రత్తగా ఆలోచిస్తే, భూములను పరిశ్రమలకు యివ్వడం అనేది చాలా తీవ్రమయిన విషయమని మనకు అర్థమవుతుంది. ఇది పంట దిగుబడుల గురించి లేదా పరిశ్రమల అభివృద్ధికి సంబంధించి కొంత మంది చేస్తున్న చర్చలాంటిది కాదు.

ఇంక మూడవ తప్పుడు అవగాహనేంటంటే ఇప్పుడు పరిశ్రమలడుగుతున్న భూములన్నిటినీ కేవలం బంజరు భూములు లేదా సాగులోలేని వృధా భూముల ద్వారానే సేకరించగలం అనుకోవడం.

స్పెషల్ ఎకానిమిక్ జోన్స్ (సెజ్) యాక్ట్ క్రింద వున్న కేంద్ర నిబంధనల్లోని 5(2) ప్రకారం, ఏదైనా సెజ్‌కు కేటాయించిన భూమంతా ఒకే చోట వుండాలి. అభివృద్ధి చేస్తాం అంటూ భూముల కోసం దరఖాస్తులు పెట్టుకొనే డబ్బున్న పెట్టుబడుదారులు వెయ్యి ఎకరాలకు తక్కువ అడగడం లేదు. నిబంధనల ప్రకారం యింత భూమిని యివ్వడానికి వీలు లేదు. కానీ వాళ్ళ దగ్గర చాలా సంపదవుంది కదా. దాన్ని పెట్టుబడిగా పెట్టి యింకా సంపాదించాలనేది వారి ఆశ.

పూర్వం ఒక పరిశ్రమను స్థాపించాలంటే ప్రభుత్వంచుట్టూ తిరిగి ఆ పరిశ్రమను నిర్మించుకోడానికి అవసరమయ్యే భూమిని ఎలాగో సంపాదించుకొని తృప్తిపడేవాళ్ళు యజమానులు. ఇప్పుడు ఆ పరిస్థితి పోయింది. ప్రభుత్వమే పెట్టుబడిదారుల వెంబడిపడి పెట్టుబడులు పెట్టండని బతిమాలుకుంటున్న రోజులొచ్చాయి. అందువల్ల పెట్టుబడి పెట్టే వాళ్ళకు గొంతెమ్మ కోర్కెలు ఎక్కువయ్యాయి. వాళ్ళ పరిశ్రమలను నిర్మించుకోవడంతోపాటు, వాళ్ళ ఉద్యోగులకు కావలసిన ఇళ్ళు కట్టుకోడానికి, పై స్థాయి ఉద్యోగుల వినోదాలకు కావలసిన క్లబ్బులకు, పార్కులకు, ఏకంగా పెద్ద పెద్ద టౌన్‌షిప్పులకు సరిపడే భూమి కావాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సాగులో లేకుండా వుండే యింత భూమి భారతదేశంలో ఒక్క థార్ ఎడారిలో తప్ప యింకెక్కడ దొరుకుతుంది? ఒకవేళ వున్నా అది ఎక్కడో మారుమూల అటవీ ప్రాంతంలో వుండవచ్చు. కానీ మన ఆధునిక వ్యాపారస్తులు అలాంటి వెనుకబడిన ప్రదేశాలకు వెళ్ళడానికి సిద్ధంగా లేరు. వాళ్ళకు పెద్ద పెద్ద నాలుగులైన్ల హైవేలు, ఎలక్ట్రికల్ రైల్వే లైన్లు, ఓడరేవులు, ఎయిర్‌పోర్టులు, వీలైతే ఒక పెద్ద అత్యాధునికమైన నగరానికి సమీపంలో ఈ భూమి కావాలి. అలాగైతేనే వాళ్ళు సాయంత్రం జల్సాలు చేసుకోవడానికి వీలవుతుంది. ప్రస్తుతం మన దేశంలో ఈ భూముల గురించిన చర్చంతా సాగు భూములను పరిశ్రమలకు ఇవ్వకూడదనే అంశం పైనే నడుస్తూ వుంది. ఇదే అదనుగా ప్రభుత్వాలు వేల ఎకరాల భూములను "ఎందుకూ పనికి రాని, ఎవరికీ తెలియని భూమిగా" రికార్డుల్లో మార్చేసి పరిశ్రమలకు ఉదారంగా ధారాదత్తం చేస్తున్నాయి. వాళ్ళు చెప్తున్న 'నిజాల్లో' అసత్యాలెక్కువ. సొంత భూములద్వారా రైతులు బాగానే సంపాదించుకోగలుగుతున్నారు. కాబట్టి ప్రభుత్వాలు చెప్తున్నదానికీ, వాస్తవ పరిస్థితులకు చాలా తేడా వుంది.

ఈ విషయం ఈ మధ్య బాగా ప్రాచుర్యం పొందిన ఒక సంఘటన ద్వారా మనకు అర్థమవుతుంది. ఒరిస్సాలోని జగత్సింగ్‌పూర్ తాలూకాలోని భూమిని అక్కడి ప్రభుత్వం పోహంగ్ ఇనుము మరియు ఉక్కు పరిశ్రమకు (పోస్కో) కట్టబెట్టాలనుకొన్నది. ఈ కంపెనీకి యివ్వాలనుకొన్న మొత్తం 4004 ఎకరాల్లో (ఇది మొత్తం యివ్వదలచుకొన్న భూమా లేక కేవలం మొదటి దఫాలో యివ్వదలచుకొన్నదా అనే విషయాన్ని కావాలనే దాచారు) 3,566 ఎకరాలు ప్రభుత్వభూమి అని ప్రకటించారు. దీనర్థం ఈ భూమి సాగులో లేదనీ, అది ఎవరి సొంత ఆస్తి కాదనీ. ఈ భూమి మొత్తం అటవీశాఖ కింద కొంత, రెవెన్యూ శాఖ కింద కొంత వుంది. కానీ అక్కడి పరిస్థితులు ప్రభుత్వ ప్రకటనకు పూర్తి వ్యతిరేకంగా వున్నాయి. ఈ భూమి మొత్తంలో గడకుజంగ్, ధింకి యా, నువాగావ్ అనే మూడు పంచాయితీల్లోని భూమిలేని కుటుంబాలు ఎన్నో ఏళ్ళుగా తమలపాకు, జీడిమామిడి తోటలను పెంచుకొని బతుకుతున్నారు. ఒరిస్సా ప్రివెన్షన్ ఆఫ్ లాండ్ ఎన్‌క్రోచ్‌మెంట్ యాక్ట్ 1972 ప్రకారం వారికి ఆ భూమి మీద హక్కు వుంది. భూమిలేని పేదలకు రెవెన్యూ భూమిని, కుటుంబానికి ఒక ఎకరం చొప్పున

యివ్వవచ్చుని ఈ చట్టం చెబుతుంది. ఈ మధ్యనే వచ్చిన షెడ్యూల్డ్ ట్రైబ్స్ అండ్ అదర్ ట్రెడిషనల్ ఫారెస్ట్ డ్వెల్లర్స్ (రికగ్నిషన్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్) యాక్ట్ 2006, ప్రకారం ఎవరైనా డిసెంబరు 13, 2005 కన్నా ముందు అటవీ ప్రాంతంలో (రిజర్వుడ్ ఫారెస్టు కూడా) భూమిని సాగుచేసుకోవడానికి మరియు ఆ భూమి ద్వారా వచ్చే ఫలాన్ననుభవించడానికి హక్కులు (యూజ ఫ్రక్టరి రైట్స్) కలిగి వున్నట్లయితే వారందరికీ ఆ భూమిని ఖచ్చితంగా రెగ్యులరైజ్ చెయ్యాలని చెబుతుంది. మూడు తరాలుగా అక్కడే నివాసముంటున్నట్లయితే, షెడ్యూల్డ్ ట్రైబ్స్ కాకపోయినా, మిగిలిన వారిక్కూడా ఈ చట్టం వర్తిస్తుంది. ఈ చట్టం ప్రకారం పైన చెప్పిన యీ మూడు పంచాయితీల్లోని భూమి అక్కడి ప్రజలకే చెందాలి. కానీ ఆ భూమిపై వారికి హక్కులున్నట్లు ఒరిస్సా ప్రభుత్వం వారికి తెలియనివ్వదు. అంతే కాకుండా ఎంతోకాలంగా ఈ ప్రజల ఆధీనంలో ఉన్న వారి భూమిని తన భూమిగా, సాగులోలేని భూమిగా, ఎందుకూ పనికిరానిదిగా ప్రకటించి తన యిష్టానుసారంగా పరిశ్రమలపాలు చేయడానికి ప్రయత్నిస్తోంది. ఈ దోపిడీని యిక్కడి ప్రజలు తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారు. ఆ వూర్లకు చేరుకోవడానికి వున్న తొమ్మిది రోడ్లను మూసివేసి పోరాటం చేయడానికి తయారవుతున్నారు. కేవలం చట్టానికున్న పరిమిత దృష్టితో చూసినా కూడా వాళ్ళు 'అభివృద్ధిని' అడ్డుకొంటున్న కబ్జాదారులు కాదు. ఆ భూమిని ఎప్పట్నుంచో సాగు చేసుకొంటున్నందువల్ల ఆ భూమిపైన రెగ్యులరైజేషన్ హక్కు వారికే వుంటుంది. అలాగే ఆ తర్వాత వచ్చే ఫలితాలు కూడా వారికే చెందుతాయి.

ఒరిస్సా లాంటి సమస్య ఆంధ్రప్రదేశ్‌లో కూడా వుంది. రాయలసీమలో వున్న కడపజిల్లా లోని జమ్మలమడుగులో ఉక్కు పరిశ్రమను పెట్టుకోవడానికని కర్ణాటకలోని బళ్ళారి ప్రాంతానికి చెందిన జనార్ధనరెడ్డి అనే ఒక బిజెపి ఎమ్మెల్సీకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేల ఎకరాలను (మొదటి విడతలో 10,760 ఎకరాలు, రెండో విడతలో 4,000 ఎకరాలు) ఉదారంగా యిచ్చింది. ఈ మధ్య దీనికి మీడియాలో బాగా ప్రచారం లభించింది కూడా. తెలుగు దేశం వాళ్ళు తమ పార్టీ మనుషులకు యిలాంటి ఛాన్సు దొరకలేదనే అక్కసుతో ఈ విషయాన్ని బాగా ప్రచారం చేశారు. అయితే యిప్పుడు మనం ఆ విషయాల్లోకి వెళ్లట్లేదు. మన కథంతా కడప జిల్లాలో రాబోయే బ్రాహ్మిణి స్టీల్స్ అనే కంపెనీకి యిచ్చేసిన భూమి గురించే. ఇదంతా తనకు చెందిన వృధా భూమి అని ప్రభుత్వం బుకాయిస్తూ వుంది. కాబట్టే యిక్కడ ఎవరినీ బలవంతంగా ఖాళీ చేయించడం అనే సమస్య కూడా తల ఎత్తదని చెబుతూంది. ఇక్కడ మనం వేసుకోవలసిన మొదటి ప్రశ్న యింత భూమితో అవసరమేంటనేది. పత్రికల్లో వచ్చిన సమాచారం మేరకు, మొదట్లో 10,000 ఎకరాలు ప్లాంటు కోసం యిచ్చారు. తరువాత కంపెనీ యిక్కడ తన సొంత విమానాశ్రయం నిర్మించుకోవాలందని మరో 4,000 ఎకరాలు యిచ్చారు. ఈ ప్రైవేటు విమానాశ్రయానికి అంత భూమిని కేటాయించడం ఎంతైనా గర్హనీయం. అయితే ఈ దాతృత్వం ఒక్క బ్రాహ్మిణీ స్టీల్స్ విషయానికే పరిమితం కాలేదు. ఇలాంటి భూపందేరాలు, ఈ రోజు దేశమంతా జరుగుతున్నాయి. ఇప్పుడున్న 'రెండంకెల అభివృద్ధి' నేపథ్యంలో ఈ పరిశ్రమలకు, ఇండ్లకు ఇంతింత భూమినెందుకివ్వాలని అడిగిన వాళ్ళే లేరు. ప్రస్తుతం ఈ భూములకు విలువ లేకపోవచ్చు. లేదా అవి ప్రభుత్వ భూములయితే, వాటికి నామమాత్రపు విలువ వుండవచ్చు. అలాంటప్పుడు ఎందుకీ రాద్ధాంతం అని అడగవచ్చు. ఇక్కడ పరిశ్రమలను నెలకొల్పిన తరువాత ఈ పరిస్థితులన్నీ మారిపోతాయని మనం గమనించాలి. చుట్టు పక్కల భూములవిలువ విపరీతంగా పెరుగుతుంది. అప్పుడు పరిశ్రమలకని యిచ్చిన ఈ భూమి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి కేంద్రబిందువుగా మారిపోతుంది. ఈ భూమి పెద్ద నగరాలకు దగ్గర్లో వున్నట్లయితే ఈ భూమిని ప్రభుత్వం దగ్గర్నుంచి తీసుకోవడం వెనక వున్న ప్రధాన కారణం కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారమే అయ్యే అవకాశాలు మెండుగా వున్నాయి.

"వృథా" భూములని పిలవబడుతున్న భూములు ఏ విధంగా చూసినా వృధా కావు. బ్రాహ్మణీ స్టీల్స్ కిచ్చిన భూముల్లో 'చితిమితి చింతల' అనే ఒక వూరు వుంది. ఆ వూర్లో రెండు వందల సుగాలీ (వారిని తెలంగాణాలో లంబాడీలని, మధ్య భారత్‌లో బంజారాలనీ అంటారు) కుటుంబాలు నివశిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో వీళ్ళని షెడ్యూల్డ్ ట్రైబ్స్‌గా గుర్తించారు. ఇప్పుడు బ్రాహ్మణీ స్టీల్స్ కిచ్చిన భూమిలో 450 ఎకరాలను వీరు సాగుచేసుకుంటున్నారు. ఈ భూమిలో కొంత భాగం మునుపెప్పుడో బ్రాహ్మణులకు దానమిచ్చిన (శ్రోత్రీయం) భూమిగా తెలుస్తూంది. కానీ స్వాతంత్ర్యం తరువాత యిలాంటి ప్రత్యేకమైన అధికారాలన్నీ రద్దు చేయబడ్డాయి. ఆ భూముల్ని అప్పటి వరకు సాగుచేసుకొంటున్నట్లు ఆధారాలు చూపించిన వాళ్ళకు, లేదా యజమానుల అనుమతితో ఆ భూమిని తమ ఆధీనంలో ఉంచుకొన్న వాళ్ళకు వాటిని యిచ్చెయ్యడం జరిగింది. ఆ క్రమంలో సుగాలీలు కూడా పట్టాలు పొంది వుండవలసింది. కానీ వారికి ఆ హక్కుల గురించి తెలియక పోవడం వల్ల వాళ్ళెప్పుడూ ప్రభుత్వాన్ని పట్టాలివ్వమని కోరలేదు. ప్రభుత్వమూ పట్టించుకోలేదు. కాబట్టి ఇది ప్రభుత్వ భూమిగా మిగిలిపోయింది. సుగాలీలు కబ్జాదారులయ్యారు. అయినా అది నిజంగా ప్రభుత్వ భూమైనా, సుగాలీలు కబ్జాదారులైనా, ఆ భూమిని వాళ్ళు చాలా ఏండ్లుగా కబ్జా చేసి సాగు చేసుకొంటున్నారు కాబట్టి బోర్డ్ ఆఫ్ రెవెన్యూ ఆర్డర్స్ (ఇది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి పాత మద్రాస్ స్టేట్ నుంచి సంక్రమించింది) ప్రకారం ఈ భూమి రెగ్యులరైజేషన్ హక్కు వారికే వుంటుంది. కానీ ప్రభుత్వం ఆ పని చెయ్యలేదు కాబట్టి వీళ్ళు కబ్జాదారులుగా మిగిలారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి తమ భూమిని రాయలసీమకు బహుమతిగా ఇచ్చివేయడాన్ని వీళ్ళు ప్రశ్నిస్తున్నారు.

**Excerpted from EPW, September 29-2007.**
**pp 3906-3911**

**అనువాదం : ఎన్.మనోహర్**



# ప్రజల కొరకు, ప్రజల చేత, ప్రజలదైన పారిశ్రామీకరణ

■ మేధాపాట్కర్, అమిత్ బాధురి

ప్రస్తుతం అమలులో ఉన్న అధిక వృద్ధి రేటు అభివృద్ధి నమూనాను వ్యతిరేకించే వారిని, అభివృద్ధి వ్యతిరేకులుగా చూడటం జరుగుతోంది. ఈ వ్యాసంలో, అటువంటి ఇద్దరు ప్రఖ్యాతులైన వ్యక్తులు తాము ఎందుకు ప్రస్తుత పారిశ్రామీకరణ నమూనాను వ్యతిరేకిస్తున్నామో చెప్తూ, ప్రత్యామ్నాయ పంథాను, ఆచరణయోగ్యమైన సూచనలతో ప్రారంభిస్తూ చర్చిస్తారు.

అమలులో ఉన్న 'వృద్ధిరేటు ఆధారిత ఎదుగుదల నమూనాను' వ్యతిరేకించే మా లాంటి వారిని, అభివృద్ధి వ్యతిరేకులుగా పరిగణించటం జరుగుతోంది. అందువలన, ప్రస్తుత పారిశ్రామీకరణ విధానాన్ని మేమెందుకు వ్యతిరేకిస్తున్నామో చెప్తూ, ప్రత్యామ్నాయ మార్గాలు ఏ విధంగా రచించవచ్చో వివరిస్తూ, ఆచరించదగిన కొన్ని ప్రాథమిక సూచనలను చేయటం అవసరమని భావిస్తున్నాము.

**1. ప్రజాస్వామ్యాన్ని, ప్రజల హక్కులను పటిష్టం చేయటం :** రాజకీయవేత్తలు, ఆర్థిక శాస్త్రవేత్తలు, ప్రసార మాధ్యమాలలో(మీడియాలు) పాల్గొనే వివిధ రకాల విశ్లేషకుల దృష్టిలో, సాధారణ ప్రజల జీవన ప్రమాణాల స్థాయి పెరగాలంటే, ఆధునికమైన పెద్ద పరిశ్రమల స్థాపన తప్పనిసరి. ఈ భావన పాశ్చాత్య దేశాల చారిత్రక అనుభవాన్ని మన దేశానికి వర్తింపచేసే ప్రయత్నం. ఇంగ్లండు దేశం పారిశ్రామీకరణ చెందటానికి సుమారు 100 సంవత్సరాలు (1770–1880 వరకు); మిగిలిన పాశ్చాత్య దేశాలు కూడా సుమారు అంతే సమయం తీసుకున్నాయని వీళ్ళు మరచిపోతున్నారు. ఆ కాలంలో, ఆయా దేశాలలో ప్రజలకు సార్వత్రిక వయోజన ఓటు హక్కుపైన ఆధారపడి సాధించుకోదగిన ప్రజాస్వామిక హక్కులేవీ లేవు. తరువాతి కాలంలో పారిశ్రామీకరణ త్వరితగతిని చేయటానికి ప్రయత్నం చేసిన, చైనా, దక్షిణ కొరియా దేశాలదీ ఇదే అనుభవం. దీనికి భిన్నంగా, ప్రజాస్వామిక హక్కులున్న పేద దేశం భారతదేశం. ఈ హక్కులను సాధించుకోటానికి వున్న సంస్థలు సమర్థవంతంగా పనిచేయక పోయినప్పటికీ ఈ హక్కులను పేద ప్రజల కోసం బలోపేతం చేయటం, విస్తృతపరచటం, అత్యవసరం. నిరంతరం వీటి ఉల్లంఘన జరుగుతూనే ఉంది. చాలా స్పష్టంగా మనకు కనిపిస్తున్న ఉల్లంఘన, ప్రభుత్వాలు ప్రజల అనుమతి లేకుండా భూసేకరణ చేయటం ఈ క్రమంలో గ్రామసభల పాత్రను గుర్తించటం గానీ, చట్టరీత్యా అవసరమైన ప్రక్రియను పాటించడం గానీ జరగటం లేదు. భూమి ఒక్కటే కాదు. ప్రజల నివాస స్థలాలను, తరతరాలుగా వస్తున్న నీటి వనరులు, చెట్లు, అడవులు వంటి సామూహిక సంపదను, ప్రజల నుంచి లాక్కోవటం ద్వారా, పేద ప్రజలకు జీవనోపాధిని (బతుకు తెరువు) చిన్నాభిన్నం చేయటమే కాకుండా, వాళ్ళను వారి సామాజిక, సాంస్కృతిక వాతావరణం నుండి దూరం చేస్తున్నారు. ప్రజలు పోగొట్టుకున్న వాటికి తగిన నష్టపరిహారం, ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు, కొన్ని దశాబ్దాలే కాదు, కొన్ని తరాల వరకు కూడా వారికి అందటం లేదు. ఈ విధ్వంసానికి వ్యతిరేకంగా, రాజ్యాంగబద్ధంగా లభించిన జీవించే హక్కు, ఉపాధి హక్కుల కోసం, ప్రజలు పోరాడుతూనే ఉన్నారు.

ప్రజల అనుమతి లేకుండా చేసే భూసేకరణకు వ్యతిరేకంగా వచ్చే పోరాటాలను మేము సమర్థిస్తాము. నష్టపోయే ప్రజలలో ప్రజాభిప్రాయ సేకరణ జరగాలని, భూసేకరణ తప్పనిసరైతే సరైన పునరావాసం, దానిపై చర్చ అవసరమని మేము భావిస్తాము. భూసేకరణ చేసేటప్పుడు ప్రభావిత ప్రజల అభిప్రాయం తీసుకోవటం అక్కడ జరిగే పారిశ్రామీకరణ స్వభావాన్ని, తీరును ప్రభావితం చేయటానికి ఉపయోగపడుతుంది. విస్థాపన లేని భూసేకరణ చేయటానికి దానిని కనీస స్థాయిలో నిలబెట్టటానికి; స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలుండే విధంగా అక్కడ భూమిలో ఇతర సహజ వనరులలో స్థానికులే పెట్టుబడి పెట్టటానికి దోహదం చేస్తుంది. ఇతరులు ఉత్పాదకత లేని ద్రవ్య వనరులు పెట్టుబడి పెట్టడాన్ని నివారించటానికీ ఉపయోగపడుతుంది. అంతే కాకుండా దీని ద్వారా ప్రజల ప్రజాస్వామిక హక్కులను, అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయడంలో, సామాజిక నిర్వహణలో ప్రజల భాగస్వామ్యాన్నీ కూడా బలోపేతం చేయవచ్చు.

**2. వెంటనే లబ్ధి పొందేవారు, శాశ్వతంగా పోగొట్టుకునే వారు:** పెద్ద తరహా పరిశ్రమలలో యాంత్రీకరణ, వ్యవస్థీకరణ వలన ఉపాధి అవకాశాలు చాలా తక్కువగా లభ్యమవుతాయి. దీని ద్వారా జరిగే పారిశ్రామీకరణ వలన వచ్చే ప్రయోజనాలు పేదలకు చాలా ఆలస్యంగా అందుతాయి. శ్రామిక జనం వ్యవసాయరంగం నుంచి పారిశ్రామిక రంగానికి బదిలీ కావటం త్వరితగతిన జరిగే ప్రక్రియ కాదు. భారతదేశంలో స్థూల జాతీయ ఆదాయంలో వ్యవసాయ రంగ ఆదాయం తీవ్ర స్థాయిలో తగ్గిపోతూ వస్తోంది. అయితే, వ్యవసాయంపైన ఆధారపడే జనాభా నిష్పత్తి, చాలా నెమ్మదిగా తగ్గుతోంది. ప్రభుత్వ విధానాలు వ్యవసాయ రంగాన్ని, అసంఘటిత సేవా రంగంలో ఎక్కువ భాగాన్ని నిరుపయోగమైనవిగా మార్చాయి. వీటిలో పనిచేసే వారు అమానుషమైన పేదరికంలో బందీలై, దీని నుండి సంఘటిత రంగానికి గానీ, పారిశ్రామిక రంగానికి గానీ వెళ్ళే మార్గం లేని స్థితిలో ఉన్నారు. రెండు అంకెల వృద్ధి రేటును గురించి ఎన్నో ప్రగల్భాలు చెప్తున్నప్పటికీ, ఎకనామిక్ సర్వేలో ప్రభుత్వం స్వయంగా చేసిన ప్రకటన ప్రకారమే సంఘటిత రంగంలో క్రమబద్ధమైన ఉద్యోగావకాశాలలో పెరుగుదల 1.1కి మాత్రమే పరిమితమై ఉంది. ప్రైవేటు, పబ్లిక్ రంగాలలో ఉద్యోగావకాశాలలో జరిగిన వృద్ధి, పబ్లిక్ రంగంలో పోగొట్టుకున్న ఉద్యోగాలవలన జరిగిన నష్టాన్ని ఇప్పటి వరకూ కూడా భర్తీ చేయలేదు. పెద్ద స్థాయిలో ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులుండి పారిశ్రామికంగా క్రియాశీలకమైన రాష్ట్రాలుగా పేరు సంపాదించిన గుజరాత్, మహారాష్ట్రాలలో, కూడా, ఉద్యోగావకాశాలు అతి నెమ్మదిగానే పెరుగుతున్నాయి. (ఎన్.ఎస్.ఎస్ 61 రౌండ్, టైమ్స్ ఆఫ్ ఇండియా, 7 జులై 2008, ఆధారంగా).

అయితే, కథ ఇంతటితో ముగిసి పోలేదు. సంఘటిత రంగంలో భాగమైన కార్పొరేట్ రంగం జనాభాలోని శ్రామిక శక్తిలో 1/10వ వంతుకు మాత్రమే ఉద్యోగావకాశాలు కల్పించగలదు. మిగిలిన ఉపాధి అంతా అసంఘటిత రంగంలోనిదే. అసంఘటిత రంగంలో అతి పెద్దదైన వ్యవసాయ రంగంలో పని గంటల పెంపుదల ద్వారా ఉపాధి పెరగటం జరుగుతోంది. ఈ రంగానికి చెప్పుకోదగ్గ స్థాయిలో కార్మిక చట్టాలు వర్తించవు. శ్రామికులకు రక్షణ కల్పించే సామాజిక భద్రత లభించదు. అసంఘటిత రంగానికి ఉప కాంట్రాక్టింగ్ పద్ధతి ద్వారా కార్యకలాపాలను బదిలీ చేయటం, పెద్ద స్థాయిలో పనులను తాత్కాలికీకరణ చేయటం ద్వారా కూలీ (వేతనం) పెంచనవసరం లేకుండానే పని సమయం పెంచే అవకాశం కలుగుతోంది. ఆర్థికంగా దేశం వృద్ధి రేటు ఎక్కువగా ఉన్న సంవత్సరాలలో స్వయం ఉపాధి శ్రామిక వర్గం 260 మిలియన్లకు చేరుకుంది. అదృశ్యంగా ఉంటూనే వీరు ఉత్పత్తి పెరగటానికి దోహదం చేస్తారు. వీళ్ళలో చాలా మంది, మనుగడ కోసం గత్యంతరం లేక, ఆదాయం కొద్దిగా మాత్రమే పెరిగినా రోజులో ఎక్కువ గంటలు పనిచేసి, తమ శ్రమను తామే దోపిడీ చేసుకుంటూ ఒక వైపు కార్పొరేట్ రంగం లాభాలకు, మరొక వైపు తమ దుస్థితి పెరుగుదలకు కారకులవుతున్నారు.

**ప్రభుత్వ విధానాలు :** విత్త బాధ్యత మరియు బడ్జెట్ నిర్వహణ చట్టం (ఎఫ్ఆర్‌బిఎమ్), 2003లో ప్రవేశపెట్టిన మిత వ్యయ విధానాలను, భారత ప్రభుత్వం స్టాక్ మార్కెట్, విదేశీ పెట్టుబడిదార్లను, అంతర్జాతీయ ద్రవ్య సంస్థ, ప్రపంచ బ్యాంకులను సంతోష పెట్టడం కోసం ప్రవేశ పెట్టింది. ప్రజల ఆరోగ్యం, విద్యలపై చేసే వ్యయాన్ని పెంచటానికి బదులుగా, స్తబ్ధతకు గురిచేసి అసంఘటిత రంగంలో ఉన్న పేద వారికి కనీస స్థాయి సామాజిక భద్రతను కూడా లేకుండా నిరాకరిస్తోంది. మనదేశంలో ఇతర రంగాల నుండి పరిశ్రమలలో ఉద్యోగం సంపాదించడం ద్వారా పారిశ్రామీకరణ ప్రయోజనాలను అనుభవించగలగటం అనేది చాలా దీర్ఘకాలిక వ్యవహారం.

ఈ క్రమంలో ఎన్నో తరాలు తమ భూమిని, ఉపాధిని, ఇళ్ళను పోగొట్టుకున్నారు. వీళ్ళు ఎలా బతుకుతారు? పారిశ్రామీకరణ, ప్రపంచీకరణ అతి వేగంగా జరుగుతున్న ఈ ప్రపంచాన్ని, చదువు, ఆరోగ్యం, సామాజిక విలువలు నేర్పే సామాజిక జీవనం కూడా లేని వీళ్ళ పిల్లలు ఎలా ఎదుర్కొంటారు? సమాజంలో తరతరాలపాటు బలహీన వర్గాలను, అభివృద్ధి పేరిట త్యాగం చేయటం ఆమోదయోగ్యం కాదు. ఇది ప్రజాస్వామిక విలువలకు, న్యాయాత్మకమైన ఆర్థిక ధ్యేయాలకు విరుద్ధం.

సమర్థవంతమైన విత్త విధానాలు అవసరం. దేశం యొక్క బాహ్య, అంతర్గత రక్షణకు చేసే ఖర్చు కోసం వనరులను మళ్ళించటం మానుకోవాలి. ప్రభుత్వం ఆడంబరాలపై ఖర్చు తగ్గించు కోవటం అవసరం. మతం, కులం, ప్రాంతీయత వంటి అంశాలపైన ప్రజలను విభజించి పాలించే విధానాలకు స్వస్తి చెప్పాలి. పేద ప్రజల పక్షాన పరిపాలించాలి. వివిధ మత సమూహాల న్యాయాత్మక ఆకాంక్షలను చర్చల ద్వారా అర్థం చేసుకోవటం ద్వారా

సాధించాలి గానీ అన్ని రకాల ఉగ్రవాదాన్నీ గుడ్డి సైనిక బలంతో అణచివేయటం ద్వారా కాదు. భారత దేశంలో ఉండే సమాఖ్య స్వరూపం, ప్రజల కోరిక మేరకు వివిధ ప్రాంతాలకు ఆర్థిక రాజకీయ స్వేచ్ఛను ఇవ్వటానికి అవసరమైన సరళత కలిగి ఉండాలి.

**3. కార్పొరేట్ రంగం Vs ప్రజలు:** ఇటీవలి ఆర్థిక సంక్షోభం సంభవించే వరకు, తరచు చెప్పబడే నానుడి ఏమిటంటే పెట్టుబడిదారీ మార్కెట్ ఆర్థిక వ్యవస్థకు సంపదను సృష్టించటంలో వున్న సామర్థ్యం దానిని పంచి పెట్టటంలో ఉండదని; సామ్యవాద ఆర్థిక వ్యవస్థ, దీనికి విరుద్ధంగా ఉంటుందని. ఈ ధోరణి అసలు సమస్యను ఎదుర్కోకుండా వుండటానికి ఉపయోగపడుతుంది. సంపద ఏ విధంగా సృష్టించబడుతుందో అనే అంశం సంపద పంపిణీని నిర్ధారిస్తుందని మరచి పోకూడదు. కార్పొరేట్ రంగాన్ని ప్రోత్సహించటం ద్వారా సంపదను సృష్టించి, ఆ తరువాత ఎక్కువ స్థాయిలో పన్నులు విధించటం ద్వారా దానిని పంపిణీ చేయవచ్చు అనుకోవటం భ్రమ మాత్రమే కాదు, వాస్తవం నుంచి తప్పించుకోవటమే. ప్రభుత్వం గనుక కార్పొరేట్ రంగం సంపదను సృష్టించాలి అని కోరుకుంటే ఆ సంపదపైన నియంత్రణ హక్కునూ, దానిని అనుభవించే హక్కునూ వాళ్ళకివ్వాల్సి ఉంటుంది. కార్పొరేట్ రంగం ఎప్పుడో తప్ప పంపిణీ చేసే నిమిత్తం సంపదను సృష్టించటానికి ఒప్పుకోదు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే సాధనంగా " కార్పొరేట్ రంగ పారిశ్రామీకరణ"ను మనం వ్యతిరేకించాలి. దీనికి బదులుగా ప్రజలకు అనుకూలంగా పంపిణీ చేయటానికి అనువైన పద్ధతిలో, వాళ్ళ భాగస్వామ్యంతో సంపద సృష్టించబడే, ప్రభుత్వ యంత్రాంగంపైన వారు ఆధారపడాల్సిన అవసరం లేని ప్రత్యామ్నాయ మార్గాన్ని వెతకటం అవసరం.

ఈ ప్రత్యామ్నాయం ద్వారా జరిగే పారిశ్రామీకరణలో, అక్షరాస్యత లేదా విద్య లేని పేద ప్రజలు సంపదను సృష్టించటంలో, దానిని పంచి పెట్టటంలో, భాగస్వామ్యులై ముందుకు నడిపే శక్తి అవుతారు. ఇందులో భాగంగా (ఎ) అతి తక్కువ కాలంలో ఉత్పాదకతతో కూడిన సంపూర్ణ ఉద్యోగిత వైపు కొనసాగడం (బి) ప్రజల సమ్మతి లేకుండా ఇప్పుడున్న వారి బతుకు తెరువును నాశనం చేయకుండా ప్రత్యామ్నాయ ఉపాధిని చూపించగలగటం అవసరమవుతాయి. అంటే పారిశ్రామిక సంస్థలు సాగుకు వీలుకాని నిరుపయోగమైన భూములను సంపాదించాలి. ఈ వ్యూహం ఫలితంగా ఆర్థికాభివృద్ధి దానంతట అదే జరుగుతుంది, ఆర్థికాభివృద్ధి ముందు జరిగి తరువాత దాని ఫలితాలు కింది స్థాయికి చేరుతాయి అనే ఇప్పటి ఆలోచనకు భిన్నంగా, (భారతదేశంలో అధికారిక ఆర్థిక విధానాలకు మూలమైన దృక్పథానికి), మా దృక్పథం. మౌలికంగా ప్రతిపాదించేది ఇదే.

**4. ప్రత్యామ్నాయం:** మేము ప్రతిపాదిస్తున్న ప్రత్యామ్నాయంలో అభివృద్ధిని ప్రస్తుత (సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ) విధానంలో ఆర్థికంగా బలహీనులై, పేదవారై, నిపుణతలు లేక, ఆర్థికాభివృద్ధి సాధించటానికి తగని వారుగా గుర్తించబడిన ప్రజలతో మొదలుపెట్టటం జరుగుతుంది. మన గ్రామీణ ప్రాంతాలలో నివసించే వారిలో ఎక్కువ మందికి సరైన బతుకు తెరువు లేదు.

వీళ్ళు ఉత్పత్తి ద్వారా ఒక పక్క సామాజిక సంపదను పెంపొందిస్తూ మరొక పక్క ఆదాయం సంపాదించు కోగలుగుతారు. వీళ్ళతో మనం పనులు ప్రారంభిస్తూ, గ్రామీణ ప్రాంతాలలో, పట్టణ ప్రాంతాలలో కూడా సంవత్సరానికి 300 రోజులకు తగ్గకుండా ఉపాధి హామీ పథకం అమలు చేయాలి. దీనిని ముఖ్యంగా ఉపద్రవాలు వచ్చిన తీర ప్రాంతాలలో, అత్యంత పేదరికంతో మగ్గిపోయే ఒరిస్సా రాష్ట్రంలోని కంధమాల్ వంటి ప్రాంతాలలో ప్రారంభించాల్సి ఉంటుంది. గ్రామీణ పట్టణ ప్రాంతాల మధ్య చెప్పుకోదగ్గ వేతన వ్యత్యాసాలు లేకుండా చూడకపోతే వలసల వలన, గ్రామీణ ప్రాంతాలు ఇంకా పేదరికంలో మునిగిపోతాయి. డిమాండ్‌ను అనుసరించి ఉద్యోగాలు దొరకాలి. పని అవసరమైన వాళ్ళు తమంతట తాము ఎంపిక చేసుకునే అవకాశం ఉంటూ, పాలనా యంత్రాంగం వల్ల కాలయాపన లేకుండా చూడాలి. ఈ పద్ధతిని నిజాయితీతో అమలు చేస్తే, ఏ ఇతర ఆదాయ వనరు లేని పేద వారు మాత్రమే వీటిని ఎంపిక చేసుకుంటారు. వీటిలో కాలానుగుణంగా మార్పులకు అవకాశం ఉండాలి.

ఈ పద్ధతికి రెండు రకాల అవరోధాలు ఉన్నాయి. మొదటిది ఇప్పుడున్న పాలనా యంత్రాంగం ఈ (అర్హులైన పేదవారు ప్రయోజనాన్ని స్వీకరించే విధంగా, ఉత్పాదక సామర్థ్యం పెంచి గ్రామీణ ప్రాంతాలలో వీరి జీవన పరిస్థితులు మెరుగుపడే విధంగా) విధానాలు అమలు చేయటానికి ఏ మాత్రం తగినది కాదు. దీనికి కావలసింది ఉత్తి రాజకీయ ప్రకటనలు కాదు. అతి కింది స్థాయిలో ఉండే స్థానిక ప్రజల చేత ఎన్నుకోబడే పంచాయతీ రాజ్ వ్యవస్థ వరకూ అధికార వికేంద్రీకరణ జరగటం. కేంద్ర ప్రభుత్వానికి గానీ, రాష్ట్ర ప్రభుత్వానికీ నిర్ణయాధికారంలో ముఖ్యంగా విత్త సంబంధమైన నిర్ణయాధికారంలో స్వేచ్ఛ నివ్వటం ఇష్టం లేదు. ఉత్సాహం లేదు. ఈ చర్యలు తీసుకోకుండా, స్థానిక ప్రజలకు వారంతట వారు ఉత్పాదకత ఉన్న ఉపాధిని ఏర్పాటు చేసుకోవటం సాధ్యపడదు. అయితే అధికార వికేంద్రీకరణ అవసరమే కాని, అదే సరిపోదు. ప్రజా ఉద్యమాలన్నీ, వివిధ రకాల స్వార్థ ప్రయోజనాలున్న ఉన్నత స్థాయి రాజకీయ నాయకులతో (ఎమ్ఎల్ఎ, ఎంపీలు) ఉన్నత స్థాయి పరిపాలనా యంత్రాంగం (ఐఎఎస్, రాష్ట్రస్థాయి అధికారులు)తో మాత్రమే తలపడితే సరిపోదు. అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకు , ఆసియా అభివృద్ధి బాంకు వంటి సంస్థలలో అభివృద్ధి నిపుణులుగా చెప్పబడి ప్రభుత్వంతో ఏకమై వ్యవహరించే తీరుని, దీనిపట్ల వ్యతిరేకత ఉన్న మీడియా ప్రతిఘటనకు తట్టుకుంటూ, ఈ ప్రత్యామ్నాయానికి మద్దతుగా పని చేయాల్సి ఉంటుంది. దీన్ని నడిపించే సాధారణ సూత్రమేమిటంటే స్థానికంగా నిర్మించబడే ప్రాజెక్టుల వలన లబ్ధి పొందే వాళ్ళు ఆ నిర్ణయాలకు బాధ్యత వహించాలి అని. ఈ కార్యకలాపాలకయ్యే ఖర్చులో, ఆర్థికంగా ఎదిగే కొద్దీ వీళ్ళు క్రమంగా ఎక్కువ భాగాన్ని భరించాల్సి ఉంటుంది.

**Excerpted from EPW, January 3-2009. PP 10-13**

అనువాదం : పి. మాధవి



# ప్రత్యేక ఆర్థిక మండళ్ళు : విధాన చర్చపై పునఃసమీక్ష

■ **ఆరాధన అగర్వాల్**

ప్రపంచ వ్యాప్తంగా, వాణిజ్య లావాదేవీల వాటా పెంచటంలోనూ, అధిక సంఖ్యలో కార్మికులకు ఉపాధి కల్పించటంలోనూ తోడ్పడుతున్న అంతర్జాతీయ ప్రక్రియ 'ఎగుమతి ప్రక్రియ మండళ్ళ' (ఎక్స్‌పోర్ట్ ప్రాసెసింగ్ జోన్స్ ఇపిజెడ్) ఏర్పాటు. 1986 సంవత్సరంలో, 44 దేశాలలో, 176 మండళ్ళు ఉండగా, 2003 సంవత్సరం నాటికి వీటి సంఖ్య బాగా పెరిగి, 116 దేశాలలో, 300 మండళ్ళకు విస్తరించింది.

గత కొన్ని సంవత్సరాలుగా, భారత ప్రభుత్వం కూడా, విధాన నిర్ణయంగా ఈ ప్రత్యేక మండళ్ళ ఏర్పాటును ప్రోత్సహించింది. 2000 సంవత్సరంలో అప్పటికి అమలులో ఉన్న ఎగుమతి ప్రక్రియ మండళ్ళ (ఇపిజెడ్) స్థానే, పాత పథకంలో లేని అనేక లాభదాయక ప్రయోజనాలతో కూడుకున్న కొత్త ప్రత్యేక ఆర్థిక మండళ్ళు (సెజ్‌లు) పథకం ప్రవేశపెట్టింది.

2005లో 'సెజ్ ఏక్ట్' పేరిట ఒక చట్టం రూపొందించి, ఫిబ్రవరి 2006లో 'సెజ్ రూల్స్'ను కూడా నోటిఫై చేయటం జరిగింది. ఈ చట్టాల వలన సెజ్‌ల్లో పెట్టుబడికి, ఉపాధి కల్పనకు, సెజ్‌ల ద్వారా ఎగుమతులకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం లభిస్తుందని ప్రభుత్వం భావించింది. ఈ సెజ్‌ల ఏర్పాటు ద్వారా డిసెంబరు 2007 నాటికల్లా ఒక లక్ష కోట్ల పెట్టుబడులను ఆకర్షించవచ్చని, అందులో 25 వేల కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఉండగలవని; అంతేకాక, అదనంగా 5 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉంటుందని వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

ప్రభుత్వం సెజ్‌లకు అనుకూలంగా ఇన్ని వాదనలు వినిపించినా ఈ పథకం తీవ్ర విమర్శలను, వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వచ్చింది. సెజ్‌ల వలన ఎగుమతుల పెంపుదలకన్నా భూమి కొనుగోళ్ళ లావాదేవీలు ఎక్కువవుతాయని, దీనివల్ల రియల్ ఎస్టేట్ వ్యాపారులే ఎక్కువగా లాభపడతారన్నది ముఖ్యమైన విమర్శ. అలాగే సెజ్‌ల ఏర్పాటుకై కొనుగోలు చేసే భూమి అధిక శాతం పంట భూమి అవటం వల్ల రైతులు తమ భూమిని ఉపాధిని కోల్పోయే ప్రమాదం ఉందని, అధిక మొత్తంలో సారవంతమైన పంట భూమిని సెజ్‌లకు మార్పిడి చేయటం వలన దేశ ఖజానాకి ఆర్థికంగా తీవ్రనష్టం కలగటమే కాక, అసమతౌల్య అభివృద్ధి వలన ప్రతికూల పరిణామాలు ఎదురవుతాయని కూడా సెజ్ వ్యతిరేకుల వాదన.

సెజ్‌లపై చెలరేగిన ఈ చర్చను, ఈ వ్యాసం ద్వారా మరొక్కసారి పునఃపరిశీలిద్దాం. సెజ్‌ల ఏర్పాటు వెనకున్న ఆర్థిక కారణాలు, వీటి ఏర్పాటులో భారత్‌కు కలిగిన అనుభవాలు సెజ్‌ల ప్రోత్సాహం వెనక నేపథ్యం, సెజ్‌ల ఏర్పాటుకు ప్రతిగా అనుకూలంగా వినపడ్డ వాదనలు, వాటిలో నిజానిజాలు, సెజ్ విధానంలోని లోపాలు ఈ పథకపు సృష్టికర్తల దృష్టి కోణం నుండి పరిశీలించి వాటి నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలు ఏమిటో కూడా తెలుసుకుందాం!

పరిశ్రమలు, ఫ్యాక్టరీల స్థాపనలో సాధారణంగా ఎదురయ్యే అడ్డంకులు సమస్యలు చాలా ఉంటాయి. అవి సంక్లిష్టమైన ప్రభుత్వ విధి విధానాలు కావచ్చు; చాలీచాలని మౌలిక వసతులు, నిర్మాణ వనరులు కావచ్చు లేక ఆర్థిక, వాణిజ్య కార్మిక పన్ను శాఖల నుండి ఉత్పన్నమయ్యే అధికారిక అడ్డంకులు కావచ్చు. వీటన్నింటిని అధిగమించాలనే ప్రయత్నంలో భాగమే ఈ సెజ్‌ల ఏర్పాటు.

పైన పేర్కొన్న అడ్డంకులన్నీ ఉత్పాదన మరియు లావాదేవీల ఖర్చును విపరీతంగా పెంచి పెట్టుబళ్ళకు అనుకూలంగా లేని ఒక వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. అయితే దేశ వ్యాప్తంగా ఈ మౌలిక వసతుల అభివృద్ధి చేపట్టాలన్నా లేదా అన్ని స్థాయిల్లో నిర్మాణాత్మక సంస్కరణలు చేయాలన్నా మన ప్రస్తుత ఆర్థిక సామాజిక పరిస్థితులలో ఇప్పటికే స్థాపించబడి ఉన్న రాజకీయ వ్యవస్థల ద్వారా చేయటం అనేది చాలా కాలయాపనతో కూడుకున్న పని. ఈ కారణంగా సెజ్‌లు, ఇపిజెడ్‌ల రూపంలో పారిశ్రామిక కేంద్రాలు అనేవి దేశ పారిశ్రామీకరణను వేగవంతంగానూ, సమర్ధవంతంగానూ అమలు చేయటానికి తోడ్పడే ఒక ముఖ్య పరికరంగా కనపడ్డాయి.

పెట్టుబడిదారులకు ఈ మండళ్ళ ఏర్పాటు ద్వారా ప్రభుత్వం అందించిన ప్రయోజనాలు చాలా ఉన్నాయి. అవి (1) పన్ను రాయితీలు (2) ఫ్యాక్టరీల స్థాపనకు స్థలం లేక నిర్మాణాలను తక్కువ అద్దెలకు, దీర్ఘకాలిక లీజులకూ కేటాయింపు (3) అన్ని రకాల మౌలిక వసతుల ఏర్పాటు (4) సరళీకృత విధి విధానాలు (5) సింగిల్ విండో క్లియరెన్స్‌లే కాక (6) సాధారణంగా, దేశీయ వర్తకంలో పెట్టుబడులకు వర్తించే చాలా నిబంధనల నుండి మినహాయింపు.

ఈ ప్రయోజనాల కల్పన ద్వారా, ఒక వాణిజ్యానుకూల వాతావరణం సృష్టించి, మామూలు పరిస్థితులలో అంతగా ఆసక్తి చూపని దేశీయ, విదేశీయ పెట్టుబడుదారులను సైతం ఆకర్షించటమే వీటి ముఖ్యోద్దేశం.

ఈ మండళ్ళ ఏర్పాటు వల్ల వచ్చే ప్రయోజనాలను సమూహ దృష్టి కోణం (క్లస్టర్ అప్రోచ్) పరిధిలో కూడా వివరించవచ్చు. ఈ సెజ్ అనేది ఒక రకంగా ఒక 'పరిశ్రమల సమూహం'! దీని వలన పరిశ్రమలకు రవాణా, తదితర రోజువారీ ఖర్చులు తగ్గి మంచి పోటీకి తట్టుకోగల ఉత్పాదక విధానాలు ఏర్పడి, తద్వారా పెట్టుబడులను ముఖ్యంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని ఆకర్షిస్తాయి.

అభివృద్ధి చెందుతున్న దేశాలన్నీ కూడా, తమ తమ దేశాలల్లో పారిశ్రామీకరణ వేగవంతం చేసి, తద్వారా అభివృద్ధిని పెంచే చోదక శక్తిగా ఈ సెజ్‌ల ఏర్పాటును పరిగణించి ప్రోత్సహిస్తున్నాయి.

అయితే నిజానికి ఈ మండళ్ళ ద్వారా దేశాభివృద్ధి జరిగిందనడానికి నిర్ధారిత సాక్ష్యాలేవీ ఇప్పటి వరకు లేవు. ఈ సెజ్‌ల పైన ఇప్పటి దాకా ఉన్న సమాచారాన్ని సమీక్షిస్తే, కొన్ని దేశాలు, ఈ మండళ్ళ ఏర్పాటు ద్వారా, స్థిర మరియు చలనశీల ప్రయోజనాలు సాధించినప్పటికీ చాలా దేశాలకు ఏ ప్రయోజనమూ కలగలేదు. ఈ నేపథ్యంలో, భారతదేశంలో ఈ ఆర్థిక మండళ్ళ ఏర్పాటు వల్ల కలిగిన లాభనష్టాలు సమీక్షించటం చాలా అవసరం.

**భారత దేశ అనుభవాలు**

ఈ మండళ్ళ పై సూక్ష్మస్థాయి విశ్లేషణ చేసినట్లయితే, ఇపిజెడ్‌లు నిజంగానే కొత్త ఉత్పాదక కేంద్రాల స్థాపనకు, కొత్త ఉత్పాదనల ఎగుమతులకు, అంతర్జాతీయ మార్కెట్లలో మన భారతీయ ఉత్పత్తులకు ఒక ప్రత్యేక స్థానం సృష్టించటంలో ఉత్ప్రేరకాలుగా పని చేశాయనటంలో ఎటువంటి సందేహం లేదు.

ఉదాహరణకి భారతదేశంలో ఆధునిక ఆభరణాల పరిశ్రమకు పునాది 1987-88 ప్రాంతంలో ముంబయిలోని ఎస్ఇపిజెడ్ ద్వారా పడింది. ఆభరణాల తయారీలో మైనపు పోత పద్ధతిని మొదటగా ప్రవేశ పెట్టింది ఇక్కడే. దీని వలన ఆభరణాలను ఉత్పత్తి చేసే ప్రక్రియ నాటకీయంగా పరిణామం చెందింది. నిపుణులైన చేతి పని కార్మికుల ప్రాధాన్యత గల కుటీర పరిశ్రమ స్థాయి నుండి నగల పరిశ్రమ పూర్తి స్థాయి యాంత్రికాధారిత ఆధునిక పరిశ్రమగా మారింది. దీని వల్లనే పెద్ద సంఖ్యలో, భారీ స్థాయిలో ఆభరణాల ఉత్పత్తి కూడా సాధ్యమైంది.

2002-03 సంవత్సరంలో మొత్తం భారతీయ ఆభరణాల ఎగుమతిలో 55 శాతం ఎగుమతులు సెజ్‌ల నుండే జరిగాయి. అదే విధంగా, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ పునాది, అభివృద్ధి కూడా ఈ మండళ్ళ ద్వారానే జరిగిందని చెప్పాలి.

1980 దశకం ప్రథమార్థం వరకూ, ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ ఎగుమతులన్నీ కూడా ప్రాథమికంగా ఇపిజెడ్‌ల ద్వారానే జరిగాయి. 2000-02 సంవత్సరంలో కూడా సెజ్‌ల ద్వారా జరిగిన ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ ఎగుమతి వాటా 26 శాతం. నిజానికి, భారతదేశం సాఫ్ట్‌వేర్ రంగంలో ఒక ముఖ్యమైన శక్తిగా ఎదగటానికి పునాది కూడా ముంబయి ద్వారానే జరిగింది (హాక్స్ 1996).

భారత సాఫ్ట్‌వేర్ రంగ ఎగుమతులలో భారీ ప్రగతి దిశగా, మొదటి అడుగు, 1977లో ముంబయి ఎస్ఇపిజెడ్ లో టాటా వారు నెలకొల్పిన ఎగుమతుల యూనిట్ ద్వారా పడింది. 'బరోస్' అనే అమెరికన్ కంపెనీ సహకారంతో నెలకొల్పిన ఈ పరిశ్రమ ద్వారా సాఫ్ట్‌వేర్ మరియు కంప్యూటర్ పక్క భాగాల (పెరిఫెరల్) ఎగుమతి ప్రారంభమయింది.

ఈ దిశగా రెండో అడుగు, 1985లో సిటి బ్యాంకు వారు ఎస్ఇపిజెడ్‌లో నెలకొల్పిన వంద శాతం విదేశీ, ఎగుమతి ప్రాధాన్య ఆఫ్ షోర్ సాఫ్ట్ వేర్ కంపెనీ ద్వారా పడింది. ఈ కంపెనీ ద్వారానే, విదేశీ కంపెనీలకు అవసరమయ్యే సాఫ్ట్ వేర్ని భారత దేశంలో అభివృద్ధి పరచే అవకాశాలు చాలా

మంది దృష్టికి వచ్చాయి. ఆ తర్వాత కొంత కాలానికే అంటే 1986, 1989 ల్లో టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, హ్యూలెట్ పాకర్డ్ వంటి విదేశీ సంస్థలు, తమ అనుబంధ సంస్థలని బెంగుళూరులో ఏర్పరచడం జరిగింది. ఆ తరువాత సాఫ్ట్‌వేర్ రంగంలో భారతదేశం సాధించిన అనూహ్య అభివృద్ధి అందరికీ తెలిసిందే.

అయితే ఈ విజయ గాధలు ఎలా ఉన్నా, సెజ్‌ల ద్వారా భారతదేశ ఆర్థిక ప్రగతికి లభించిన వాటా మాత్రం చాలా సూక్ష్మం. నిజానికి ఆసియా దేశాలలో, స్వేచ్ఛా వాణిజ్య మండళ్ళ విషయంలో చొరవ తీసుకుని మొట్టమొదటి అలాంటి మండలిని 1965 సంవత్సరంలోనే 'కాండ్లా'లో నెలకొల్పిన ఘనత భారతదేశానిది.

కానీ 2004-05 నాటికి కూడా మొత్తం ఎగుమతుల్లో సెజ్‌ల వాటా 5 శాతం మాత్రమే. ఫ్యాక్టరీ రంగంలో, ఉపాధి కల్పనలో వీటి వాటా ఇంకా తక్కువ, అంటే 1 శాతం ఉండగా, ఫ్యాక్టరీ పెట్టుబడులతో 0.32 శాతం మాత్రమే (అగర్వాల్ 2006లో) వీటి నుండి అవి నెలకొన్న ప్రాంతపు ఆర్థిక వ్యవస్థలకూ కూడా పెద్ద ఒరిగిందేమీ లేదు.

ప్రాంతీయంగా సెజ్‌లు ఉపాధి అవకాశాలు కల్పించి తద్వారా ఆర్థిక ప్రగతి, సామాజిక అభివృద్ధిపై కొంత సానుకూల ప్రభావం చూపిన మాట వాస్తవమే. ముఖ్యంగా పెద్దగా చదువుకోని యువత విషయంలో, ఈ ఉపాధి కొంత ఊరట కలిగించింది.

కానీ ఆర్థిక సామాజికాభివృద్ధి సాధించటానికి సెజ్‌ల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోలేదనే చెప్పాలి. ఎందుకంటే సెజ్‌లు ఆశించిన విధంగా భారీ మొత్తంలో పెట్టుబడులను ఆకర్షించడంలో విఫలమయ్యాయి. తద్వారా, ఆయా ప్రాంతాల ఆర్థిక వాణిజ్య కార్యక్రమాల పెంపును కూడా ప్రభావితం చేయలేకపోయాయి.

**భారతదేశంలో సెజ్ యుగం**

1991లో భారత దేశంలో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు, పారిశ్రామిక రంగంలో నిలకడ గల స్థిరమైన అభివృద్ధిని సాధించలేకపోయాయి. పైగా 1990 దశకపు చివరి అంకంలో పారిశ్రామిక రంగ ప్రగతి బాగా తగ్గు ముఖం పట్టింది.

అధికారిక అలసత్వం, క్లిష్టమైన పాలనా పద్ధతులు, కఠినమైన కార్మిక చట్ట నిబంధనలు, వీటన్నిటికీ తోడు ఏ మాత్రం సరిగా లేని మౌలిక వసతులు, ఈ కారణాలన్నీ కూడా ఉత్పత్తి రంగంలో పెట్టుబడులకు ఒక ప్రతికూల వాతావరణం సృష్టించాయి(ఆచార్య 2006) ఈ ఇబ్బందులన్నీ అధిగమించటానికి, ప్రభుత్వం మళ్ళీ ఇపిజెడ్‌లనే ఆశ్రయించింది. ఈ ఇపిజెడ్‌లను గనుక మిగతా ఆర్థిక వ్యవస్థ నుండి సమర్థవంతంగా విడదీయగలిగితే, ఇవి ఉత్పత్తి రంగంలో వృద్ధి సాధించటానికి చోదకశక్తిగా ఉపయోగపడగలవని ఆశించింది.

అయితే అరకొర సంస్కరణలు, వాణిజ్య విధానాలపై తిరోగమనం, సెజ్ భూసేకరణలో లోపాలు, అంతర్జాతీయ స్థాయిలో మౌలిక సదుపాయాలు అందించలేకపోవటం, మండళ్ళపైన సరైన నియంత్రణ లేకపోవటం, పెట్టుబడుదారులను ఆకర్షించలేని బలహీన ప్రేరకాలు, పథకం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవటం, ఇవన్నింటి కారణంగా ఇపిజెడ్ పథకం సరైన పెట్టుబడులను తేలేకపోతోందనే విమర్శలు వచ్చాయి. కానీ చైనా దేశంలో సెజ్‌ల సఫలతను దృష్టిలో ఉంచుకుని ఎగుమతి ఆధారిత అభివృద్ధిని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఇపిజెడ్‌ల స్థానే 2000 సంవత్సరంలో సెజ్ పథకం ప్రారంభించింది.

కానీ పెట్టుబడులపై, ఎగుమతులపై సెజ్‌ల ప్రభావం ఊహించిన స్థాయికి చాలా దిగువలో ఉంది. సెజ్ విధానానికి మరింత పదును తెచ్చేందుకై ప్రభుత్వం 2005 సెజ్ చట్టాన్ని రూపొందించింది. ఫిబ్రవరి 2006లో 'సెజ్ రూల్స్'ను కూడా నోటిపై చేశాక ఈ సెజ్ చట్టం అమలులోకి వచ్చింది. వీటికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర పరిధి, వాణిజ్య విషయాల అమలుకు తమ సొంత సెజ్ చట్టాలను రూపొందించుకున్నాయి.

**సెజ్ చట్టంలోని ముఖ్యాంశాలు**

**a) పరిపాలన :** సెజ్ విధి విధానాల గూర్చి వాటి కార్యపరిధి గూర్చి ఒక పరిపూర్ణమైన విధానం ఈ 'సెజ్ ఏక్ట్'లో పొందుపరచబడ్డాయి. సెజ్‌లో ప్రాధమిక లబ్ధిదారులైన వృద్ధిదారులు (డెవలపరు), నిర్వాహకులు(ఆపరేటర్) లీజుకున్న పారిశ్రామికులు (ఆక్యుపెంట్ ఎంటర్‌ప్రైజర్), పంపకందార్లు (సప్లయరు) మరియు సెజ్ నివాసులైన అందరి అవసరాలకు అనుగుణమైన విషయాలు ఈ చట్టంలో ఉన్నాయి.

అంతకు పూర్వం ఇపిజెడ్/సెజ్‌లు 'విదేశీ వాణిజ్య విధానం' పరిధిలోకి వచ్చేవి. ఈ పథకంలో చెల్లించే రాయితీలు, ఆర్థిక ప్రేరకాలు, ప్రయోజనాలు మాత్రం వివిధ మంత్రిత్వ శాఖల నోటిఫికేషన్లు, సర్కులర్ల ద్వారా, ఆదేశాలు జారీ చేసి అమలుపరిచేవారు. ఈ పద్ధతి, పెట్టుబడుదారులకు భారీ మొత్తాలు పెట్టి పరిశ్రమలు స్థాపించటానికి తగినంత విశ్వాసం కల్పించలేకపోయింది.

కానీ కొత్త సెజ్ చట్టంలో ఇంకో ముఖ్యాంశం సింగిల్ విండో క్లియరెన్స్ పద్ధతి. అనగా వివిధ అనుమతులు, లైసెన్సు ఇతర ప్రక్రియల ముగింపు ఒకే స్థలంలో జరపటం. ఇంతేకాక, సెజ్‌లను ప్రోత్సహించి క్రమపద్ధతిలో అభివృద్ధిపరిచే బాధ్యత ఒక 'బోర్డ్ ఆఫ్ అప్రూవల్'కు అప్పగించింది. ఈ బోర్డును కేంద్రప్రభుత్వమే నియమిస్తుంది. సెజ్‌లను 'సూ మోటో'గా ఏర్పాటు చేసే అధికారం కేంద్రానికి ఉంటుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వాల నుండి, ప్రైవేటు వృద్ధిదారులు నుండి వచ్చే ప్రతిపాదలను కూడా బోర్డు పరిశీలించి అనుమతులు యిస్తుంది.

సెజ్ స్థాయిలో అనుమతి కమిటీలను ఏర్పరచి, సెజ్ యూనిట్ ప్రతిపాదనలను అనుమతించటం లేదా తిరస్కరించటం లేదా మార్పులు చేయటం జరుగుతుంది. ఈ సెజ్‌ల పరిపాలనా నియంత్రణ ఒక అభివృద్ధి కమీషనర్ కార్యాలయం ద్వారా జరుగుతుంది. లేబర్ కమీషనర్‌కు వుండే అధికారాలన్నీ ఈ అభివృద్ధి కమీషనర్‌కి ఉంటాయి.

ఇవన్నీగాక సెజ్ చట్టం క్లాజ్ 23 ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని నిర్దేశిత న్యాయాలయాలు ఏర్పరచి సెజ్‌ల్లో జరిగే నోటిఫైడ్ నేరాలు మరియు సివిల్ దావాలను, ఈ న్యాయాలయాల్లో పరిశీలించి పరిష్కరిస్తారు. ఈ నిర్దేశిత న్యాయాలయాల తీర్పులపై ఆయా కక్షిదారులు, హైకోర్టులో అపీల్ చేసుకోవచ్చు.

**b) ఆర్థిక ప్రేరకాలు :** సెజ్ చట్టం పెట్టుబడిదారులకు చాలా ఆకర్షణీయమైన ఆర్థిక ప్రేరక ప్యాకేజీని రూపొందించింది. (1) వృద్ధిదారులకు పరిశ్రమలకు వివిధ కస్టమ్స్, సెంట్రల్ ఎక్సైజ్ సర్వీస్, కేంద్ర అమ్మకపు పన్ను మరియు షేర్ల లావాదేవీల పన్నుల నుండి మినహాయింపు. (2) పదిహేనేళ్ళ పన్ను శలవు. ప్రస్తుతం ఏడేళ్ళ పన్ను శలవు అమలులో ఉంది. అనగా మొదటి 5 సంవత్సరాలు వంద శాతం మినహాయింపు తర్వాత ఐదేళ్ళకి 50 శాతం మినహాయింపు; ఆ తర్వాత అయిదేళ్ళకు ఎగుమతి లాభాలలో 50 శాతం మినహాయింపు; సెజ్ వృద్ధిదారులకు, పదిహేనేళ్ళ నిర్ధారిత కాలంలో ఐదేళ్ళకు వంద శాతం పన్ను మినహాయింపు.

**c) మౌలిక వసతులు :** ఈ క్రింది వసతులకు 'సెజ్ ఏక్ట్' ద్వారా సదుపాయాలు కల్పించారు. (1) భారీ ఎత్తున ఎగుమతి, దిగుమతులను సానుకూల పరిచి, భారత దేశాన్ని ఒక అంతర్జాతీయ వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దగల ఉన్నతస్థాయి మౌలిక వసతులు కల్పించటం (2) సెజ్‌లలో అంతర్జాతీయ ఆర్థిక సేవా కేంద్రాల ఏర్పాటు, మరియు ఆఫ్‌షోర్ బ్యాంకింగ్ యూనిట్ల ఏర్పాటు (3) మౌలిక వసతుల అభివృద్ధిలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వాముల సహకారం. (4) ప్రతి కేంద్ర ప్రభుత్వ సెజ్‌లో ఒక సెజ్ అధికార సంస్థాన్ని ఏర్పరచి, ప్రస్తుతం ఉన్న మౌలిక వసతుల బలోపేతానికి మరియు కొత్త వసతుల అభివృద్ధికి కృషి.

ఫిబ్రవరి 2006 సెజ్ చట్టం అమలులోకి వచ్చినప్పటి నుండి సెజ్‌ల ఏర్పాటుకి భారీ సంఖ్యలో ప్రతిపాదనలు వచ్చాయి. అక్టోబర్ 27, 2006 నాటికి దేశంలోని 21 రాష్ట్రాలలో 212 సెజ్‌లకు అనుమతి లభించగా, మరో 152 అనుమతికి సిద్ధంగా ఉన్నాయి. వాటిలో ఈ వ్యాసరచన నాటికి, 34 సెజ్‌లకు అనుమతి లభించింది.

**సెజ్‌లపై చర్చ :**

ఈ మధ్య కాలంలో బాగా వేడిగా, వాడిగా చర్చించబడిన అంశాలలో 'సెజ్'లు ఒకటి. సెజ్‌ల వలన భూమిని కోల్పోయేవారు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరిపారు. రాజకీయ నాయకులు, మేధావులు, మీడియా, పౌరసమాజం, ఇలా అందరూ సెజ్‌లకు తీవ్ర వ్యతిరేకత తెలిపారు. ఇవన్నీ ఇలా ఉండగా, ప్రభుత్వంలోనే సెజ్‌ల విషయంలో తీవ్ర విభేదాలు ఉండటం ఆలోచించదగ్గ విషయం. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీయే రైతాంగం పై సెజ్ ప్రభావం గూర్చి అసంతృప్తి ఉన్నట్లు ప్రకటించారు. కేంద్ర రిజర్వు బ్యాంకు కూడా సెజ్‌లకు ఇచ్చిన ఋణాలను మౌలిక వసతుల అభివృద్ధి ఋణాలుగా కాక రియల్ ఎస్టేట్ వ్యాపార ఋణాలుగా పరిగణించమని బ్యాంకులకు సూచించింది.

అయితే ఈ పథక సృష్టికర్తలైన వాణిజ్య మంత్రిత్వ శాఖ మాత్రం, ఈ సెజ్ విధానానికి అనుకూలంగా బలంగా వాదిస్తున్నారు. వారి వాదనలు ఎలా ఉన్నా సెజ్ విధానంతో ముడిపడి ఉన్న అన్ని వాణిజ్య, ఆర్థిక, సామాజిక అంశాలను పూర్తిగా అధ్యయనం చేయకుండానే, సెజ్ చట్టాన్ని ప్రభుత్వం రూపొందించింది అనేది వాస్తవం. ఇంత భారీ ఎత్తున జరిగే భూసేకరణకు కావాల్సిన చట్టపరమైన నియమ నిబంధనలు, నియంత్రణలను ఏర్పరిచే ప్రయత్నాలు జరగలేదు. ఈ పథకం వల్ల భవిష్యత్తులో ఏర్పడే ఆర్థిక, సామాజిక పరిణామాలను ఎదుర్కొనే దీర్ఘకాలిక ప్రతిపాదన లేవీ ప్రభుత్వం దగ్గరలేవు. అన్ని వర్గాల నుండి తీవ్ర విమర్శలు ఎదురైన నేపథ్యంలో కూడా ప్రభుత్వం కీలక అంశాలు అనగా (1) ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థలపై సెజ్ ప్రభావం (2) ఏ మేరకు సారవంతమైన పంట భూమి, సెజ్‌ల ద్వారా

కోల్పోతాం (3) ఎంత మంది రైతులు ఉపాధి కోల్పోతారు (4) సెజ్‌లకు పన్ను మినహాయింపు వల్ల ఆర్థిక, సామాజిక వ్యవస్థలపై ప్రభావం ఏమిటి లాంటి వాటిలో ఏ ఒక్కదానిపై కూడా సంపూర్ణ అధ్యయనం గానీ పరిశోధన గానీ జరుపలేదు.

ప్రభుత్వ వాదనలన్నీ కూడా ఆయా మంత్రులు లేదా అధికారులు భావాలపై ఆధారపడి ఉన్నాయి. కావున సమాజంపై సెజ్‌ల ప్రభావాన్ని సత్వరమే, సంపూర్ణంగా అధ్యయనం చేయించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది.

**జాగ్రత్తవహించాల్సిన విషయం :**

సెజ్‌లను అనుమతులున్న రంగాల వారీగా విభజిస్తే అధిక శాతం అనగా 61 శాతం ఐటి రంగానికి చెందిన సెజ్‌లు ఉన్నాయి. పారిశ్రామిక రంగ సెజ్‌లు మూడింట ఒక్క వంతు మాత్రమే ఉన్నాయి. ఈ పరిణామం కలత పడాల్సినది.

పారిశ్రామిక రంగానికి తగ్గుతున్న ఆదరణ దృష్ట్యా సెజ్ విధానం ద్వారా భారతదేశాన్ని అంతర్జాతీయంగా ఒక ఆకర్షణీయమైన ఉత్పాదక రంగ గమ్యంగా తీర్చి దిద్దడంపై దృష్టి సారించాలి. అయితే మనం సంతోషించదగ్గ విషయం, అనుమతికి సిద్ధంగా ఉన్న సెజ్‌ల్లో 69 శాతం పారిశ్రామిక రంగానికి చెందినది.

సెజ్‌ల్లో ఇంకో ముఖ్యాంశం, స్థిరమైన అభివృద్ధికి కారణమయ్యే కీలకాంశాలు ఏవీ సెజ్‌ల్లో లేవు. మొత్తంగా దేశ ఆర్థికవ్యవస్థలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం నెలకొల్పితే తప్ప దీర్ఘ కాలంలో సెజ్‌లు పోటీకి నిలబడలేవు. ఎందుకంటే సెజ్‌లు అయినా ఇంకే మండళ్ళు అయినా విశాలమైన దేశ సంస్థాగత వాణిజ్య ఆర్థిక అంశాల వల్ల ప్రభావితం కాకుండా ఉండలేవు.

దేశంలో ఒక సఫలమైన పారిశ్రామీకరణ జరగాలంటే, మనకు ప్రస్తుతం ఉన్న వాణిజ్య ఆర్థిక సంస్థల ద్వారానే పరిశ్రమలు సాంకేతిక ఉన్నతి ప్రగతి సాధించేటట్లు చేయాలి. అంతేగానీ దీర్ఘకాలిక పారిశ్రామిక ప్రగతికి ఈ ప్రత్యేక మండళ్ళపై ఆధారపడలేము. వివిధ ప్రేరకాలు మినహాయింపులతో కూడుకున్న ఈ మండళ్ళు కేవలం ఒక తాత్కాలిక ఉపశమనం మాత్రమే. కావున పూర్తి స్థాయి పారిశ్రామిక, సంస్థాగత మౌలిక వసతుల అభివృద్ధికి ఈ ఇపిజెడ్‌లు, సెజ్‌ల ఏర్పాటు ఏ రకంగానూ ప్రత్యామ్నాయం కాబోదు.

**అనువాదం : సింగరాజు రమాదేవి**

**EPW November – 4, 2006, pp 4533 - 4535**

# అనంతపూర్ లేపాక్షి సెజ్ బాధితుల ఇంటర్వ్యూలు

**■ ఏశాల శ్రీనివాస్**

**ఎన్.ఎమ్ సిద్దిక్:-** యన్.టి.ఆర్ గారు సి.ఎమ్ అయినప్పుడు తూముకుంటలో ఇండస్ట్రియల్ ఏరియా చేయాలని శిలాఫలకం వేసినాడు. 1986లో తూముకుంటలోని 21 మంది రైతులందరూ కలిసి 146 ఎకరాలకు సంబంధించి కోర్టుకు వెళ్ళి స్టే తీసుకున్నాము. ఫస్ట్ జోన్ ఇది. ప్రభుత్వం తరపునుంచి 6 షరతులపై అంగీకారం కుదిరింది. ఇందులో 'టోటల్ కాంపెన్‌సేషన్' అనే మాట ఉంది. నాకు తెలుగే రాదు, ఇంగ్లీషు అసలుకే ఎవరికీ రాదు. ఎకరాకు 18 వేలు అనుకున్నాం. కాని మార్కెట్ వ్యాల్యూ 12,000 ఎకరాది 9000 చిల్లర అయింది, 18 వేలు వచ్చి 15వేలు అయింది. ఈ ఆరు షరతుల్లో ఫ్యామిలీలోకి ఒకరి ఉద్యోగం అన్నారు, ప్లాట్లు చేసినప్పుడు ఎనీ ఛాయిస్ అన్నారు. ఇందులో వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ఒక్కటే వర్తించింది. హైకోర్టులో 20 సంవత్సరాల నుంచీ పోరాడుతున్నాం ఇప్పటి వరకు ఉద్యోగం ఇవ్వలేదు, ప్లాట్లు ఇవ్వలేదు. 1989లో క్యాంటీన్ కోసం ఎపిఐఐసిలో అప్లై చేసినాను. ఇప్పుడు అడిగితే రికార్డే లేదు, 'మీ దగ్గర అగ్రిమెంట్ చేసింది ల్యాండ్ అక్విజిషన్



ఆఫీసర్ కలెక్టర్ కాబట్టి మాకు సంబంధం లేదు' అని ఎపిఐఐసి చెప్తున్నారు. రెవెన్యూ వాళ్ళు 'మాకు సంబంధం లేదు భూమి తీసుకునేది మా బాధ్యత, తర్వాత మాకు సంబంధం లేదు' అంటున్నారు. ఎపిఐఐసిని అడిగితే 'మాకు సంబంధం లేదు రెవెన్యూ వాళ్లది అంటరు' 'వీళ్లని అడిగితే వాళ్లది' అంటరు, 'వాళ్లని అడిగితే వీళ్లది' అంటరు. 15 వేలుకు భూమిని తీసుకొని ఎపిఐఐసి వాళ్ళు 25 లక్షలకు ఎకరా భూమి అమ్ముకుంటున్నారు. కనీసం ఉద్యోగం అన్నా ఇస్తే బాగుండేది. నాది 7 ఎకరాలు. పెద్ద బావి ఉండేది. నాది పట్టాలాండ్. 1981 లో ఈ భూమి కొన్నాను. మా దగ్గర తీసుకున్న భూమిలో 40 శాతం భూమిలో మాత్రమే పరిశ్రమలు వచ్చాయి. 60 శాతం భూమి ఖాళీగానే ఉన్నది. ఈ మధ్యనే రహేజాకు 350 ఎకరాలు ఇచ్చారు. వాళ్ళు ఈ భూమిలో ఏమి చేయలేదు. నా కొడుకు ఫ్యాషన్ డిజైనింగ్ చదివినాడు. ఉద్యోగం ఎవరు ఇవ్వాలే? మాకు ఉద్యోగం అన్నా ఇవ్వాల; లేకపోతే ఇన్ని ఏండ్ల నుంచి జరిగిన నష్టానికి నష్టపరిహారం ఇవ్వాలి. మాకు అప్పుడు మార్కెటు వ్యాల్యూ ఇవ్వలేదు కాబట్టి మార్కెటు వ్యాల్యూ కట్టి ఇవ్వాలి. మాకు ఇప్పుడయినా భూమి బదులు భూమి ఇవ్వాలి. నష్టపరిహారం ఇవ్వాలి. ఇప్పటికి 21 మంది కలిసే పోరాడుతున్నాం, దీనిలో దళితులే ఎక్కువ మంది ఉన్నారు.

**గంగాధర్ మాదిగ (ఎమ్ఆర్‌పిఎస్ అనంతపూర్‌జిల్లా అధ్యక్షులు)** మా దగ్గర అసైన్డ్ లాండు ఎ.పి.ఐ.ఐ.సి ద్వార గుంజేసుకున్నారు. ఎ.పి.ఐ.ఐ.సి లేపాక్షి ఫౌండేషన్‌కో, ఇంకో దానికో అమ్ముకుంది కాని మా దగ్గరకి ఏ లేపాక్షి వాళ్లు రాలేదు.అప్పు తీసుకుందామని పోతే భూమి మీపేరు మీద ఉన్నదని కాగితాలు తెమ్మంటుంది. అధికారుల దగ్గరికి వెళ్ళితే అడంగల్ చిట్టాలో కంప్యూటర్‌లో కొడితే లేపాక్షి హబ్ అని చూపిస్తుంది. బ్యాంకుల్లో ఉన్న అప్పులు అన్నీ అట్లనే ఉన్నయి. రెన్యువల్ చేసేకి కూడ లేదు. సర్వే అయినా, నేను పంట పెడుతున్నాను కాని పంటకు రుణం బయటి నుండి తీసుకొచ్చా.అది వడ్డీకి వడ్డీ పెరిగింది. ఇప్పుడు అది తీర్చుకొనే దానికి లేదు. రెన్యువల్ చేసుకోవడానికి సదుపాయం లేదు. బ్యాంకు వాళ్ల దగ్గర అప్పు తీరలేదు. నాకు భూమి డబ్బులు రాలేదు, రిజిస్ట్రేషన్ కాలేదు కాని అధికారుల దగ్గర మాత్రం రిజిస్ట్రేషన్ అయినట్లు చూయిస్తుంది. నాకు ఎకరం భూమి ఉండే, అది పోయింది. ఈ భూమి మా నాయనకు గవర్నమెంట్ ఇచ్చిన భూమి. భూమి కోల్పోయిన తర్వాత రైతులకు ఏ విధమయిన నష్టాలు ఉంటాయెా అవగాహన కల్పించడంలో ప్రభుత్వం, ప్రజాసంఘాలు వైఫల్యం చెందాయి. భూమికి ఉండే విలువ తెలిసి కూడ భూమి పోగొట్టుకున్న పరిస్థితి ఉంది. ఒక రైతుకు అయిదు ఎకరాల భూమి ఉంటే ఆ అయిదు ఎకరాల్లో తను బతుకుతా ఇంకో పది మంది రైతు కూలీలకు ఉపాధి కల్పించే పరిస్థితి ఉండేది. ఈ రోజు భూమి పోగొట్టుకున్న తర్వాత వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ఏదయితే రాయితీలు ఇస్తుందో దాన్ని పోగొట్టుకుంటున్నాం. భూమి డెవలప్‌మెంట్ కోసం వేల కోట్ల గవర్నమెంట్ ఖర్చు బెడుతుంటే ఆయొక్క భూములు మా దగ్గర లేకపోవడం వల్ల ఆడబ్బులు ఉన్నవాళ్లకే ఉపయోగపడుతున్నాయి. అనావృష్టి వచ్చినప్పుడు ప్రభుత్వం ఇచ్చే రాయితీలు భూమి ఉన్నప్పుడు పొందేవాళ్ళు. ఇప్పుడు ఆ అవకాశం కోల్పోయాం. వ్యవసాయ రంగంలో ట్రాక్టర్లు మొదలుకొని ఇతర పరికరాలపైన వచ్చే సబ్సిడీలు పొందే అవకాశం పోయింది. మా దగ్గర అసైన్డ్ భూమి ఇరవై వేలు ఎకరాకు ఉండేది, ఇపుడు అది మూడు లక్షలు, నాలుగు లక్షలు అయింది. వ్యవసాయ భూమిగా ఉన్నపుడు రైతుల మధ్య అమ్మటం కొనటం జరిగేది, ఇపుడు రైతు అనేవాడు జన్మలో ఇంతరేటుతో భూమిని కొనలేడు.

**చంద్రనాయక్: (ఎమ్.పి.టి.సి,గోరంట్ల మండలం, అనంతపూర్, బియాన్ తాండ) :-** అంతకుముందు భూములున్నప్పడే బాగుండే. డబ్బులుంటే ఉంటాయా? డబ్బులన్ని ఖర్చు అయిపోయే. ఇప్పడు భూమి పోయింది! డబ్బు పోయింది! ఇప్పడు కూలినాలి చేసుకొని బతుకుతున్నాం. ఆరునూర్ల ఎకరాలు పోయినయి. సర్వే నంబర్లు సరిగ్గా లేక, కాగితాలు సరిగ్గా లేక, చాలా మందికి డబ్బులు రాలేదు. నాది ఏడు ఎకరాలు పోయింది. దాంట్లోనే వ్యవసాయం చేసుకుంటున్న. నాలుగు ఎకరాలకు డబ్బులు వచ్చినయి. పేర్లు తప్పు బడ్డయని మిగతా డబ్బులు ఇవ్వలేదు. ఇది లేదు. అది లేదు అని వాళ్ళు తిప్పతున్నారు. డబ్బులు ఇచ్చి సరిచేయించుకుంటేనే డబ్బులు వస్తున్నాయి. భూములు పోయినోల్లందరికి ఉద్యోగాలు ఇస్తామని ఎమ్ఆర్ఓ చెప్పినాడు. ఇప్పటికే 3 ఏండ్లు అయింది. మొదట్లో ఫ్యాకట్రీలు కట్టిస్తామంటే నమ్మాం కాని, ఇప్పడు నమ్మకం పోయింది.





**( From Project Report Supported by ACTION AID, A.P. Regional Office )**

# సెజ్‌లకు భూసేకరణకు సంబంధం లేదు

*(కామర్స్, పరిశ్రమల కేంద్ర మంత్రి కమల్ నాథ్ ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు)*

కమల్ నాథ్– ప్రత్యేక ఆర్థిక మండళ్ళలో కొత్త విషయాలు ఏమీ లేవు. ఇలాంటివి చాలా దేశాలలో ఇప్పటికే ఉన్నాయి. ఇండియాలో గతంలో కూడ ఎగుమతి ఆధారిత ప్రాంతాలు ఉండేవి. కారణం చాలా చిన్నది. స్థిరమైన పెట్టుబడికి, ఆప్రాంతాలలో సుస్థిరమైన పరిపాలన సౌలభ్యం ఉండాలి. సెజ్‌లంటే పరిశ్రమల సమూహానికి మౌలిక సదుపాయాలు కల్పించేది మాత్రమే. ఇవి ప్రాధమికంగా ఎగుమతుల కోసం ఏర్పడినవి.

ఇండియాలో ఎలాంటి సెజ్‌లు నడుస్తాయనేది మనం వేసుకోవాల్సిన ప్రశ్న.. చైనాలో అటవీ భూమి, గ్రామ పంచాయితీ, రెవిన్యూ భూమి, ఊరుమ్మడి భూములు లేవు, కావున 150 కిలో మీటర్లకు ఒక సెజ్ చొప్పున ఏర్పాటు చేయవచ్చు. ఇండియాలో భూమికి పరిమితులు ఉన్నాయి. ఇండియాకు ప్రత్యేకమైన విధానం ఉండాలని మొదలు పెట్టగానే అర్థమైంది.

ప్రశ్న : ఇండియాలో సెజ్‌లు ఎంత పరిమాణంలో ఉండాలి?
కమల్ నాథ్ : పారిశ్రామిక ప్రాంతాలు వివిధ సెజ్‌లలో ఉంటాయి, రాష్ట్రాలలో కూడ ఇదే పరిస్థితి. పారిశ్రామిక రంగాన్ని బట్టి ప్రత్యేక సెజ్‌లైనా వుండచ్చు, లేదా ఒకే సెజ్ లో వివిధ రకాల పరిశ్రమలు కూడా ఉంటాయి. ఉదాహరణకు విలువైన రాళ్ళకు, నగల తయారీ సెజ్‌లకు ఎక్కువ స్థలం అవసరం లేదు. ఐటిలో మనం చాలా బలంగా ఉన్నాం. మనకు ఐటి సెజ్‌లున్నాయి. ఈ ఐటి రంగాల పెరుగుదల బహుళ అంతస్తులుగా పెరుగుతుందే కాని దీని కోసం విశాలమైన స్థలం అవసరం లేదు. ఎందుకు నేను ఎగుమతులకు అక్కరకురాని పెద్ద సెజ్‌లు పెట్టాలని వత్తిడి తేవాలి? మనకు ఉపయోగకరమైన రంగాలతోనే పని చేయాలి. పదినెలల వరకు సెజ్ బిల్లును ఇంటర్‌నెట్‌లో పెట్టి, అన్ని వైపుల నుండి వచ్చిన 1400 సలహాలు విని, చర్చను బహిరంగంగా నిర్వహించి, మేము ఇక్కడి ప్రాంతానికి అనుకూలంగా ప్రత్యేక ఆర్థిక మండళ్ళ చట్టాన్ని తీసుకోచ్చాం.

ప్రశ్న : ఈ చట్టం వల్ల ఎలాంటి లాభాలుంటాయి?

కమల్ నాథ్ : ఈ చట్టంతో రెండు లాభాలున్నాయి: ఉపాధి మరియు ఎగుమతులు. ఇండియాలో ఎగుమతులకు ఇప్పటికే రాయితీలిస్తున్నాం. ఎందుకంటే ప్రపంచవ్యాప్తంగా ఉన్న సూత్రం ప్రకారం పన్నులను ఎగుమతి చేయరాదు. ఎగుమతులకు పన్ను రాయితీలతో పాటుగా చెల్లించే సుంకాలు ఎగుమతి దారులు తిరిగి పొందుతారు. సెజ్‌లలో సుంకాలు ఎగుమతి దారులు చెల్లించటమనేదే ఉండదు. సెజ్‌ల వల్ల సుంకాలు నష్టపోతున్నామని ఆర్థికశాఖలో లెక్కలు వేస్తున్నారు కాని ఆ సుంకం తిరిగి చెల్లించబడుతుందని లెక్కలోకి తీసుకోవటం లేదు. ఇక్కడ రెండు పార్టీల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గమనించాలి, మౌలిక సదుపాయాలు కల్పించే వ్యక్తి(డెవలపర్) ఒకరు, ఈ సదుపాయాలను ఉపయోగించి ఎగుమతులు చేసేది వేరొకరు. మౌలిక సదుపాయాలు కల్పించే వ్యక్తికి పన్ను రాయితీలు అవసరం లేని పక్షంలో ఎందుకు పెట్టుబడి పెడతారు? ఎపుడైనా మౌలిక సదుపాయాలకు పన్ను రాయితీలు ఉంటాయి. ఇవేకాకుండా, పనిచేసే వాళ్ళకు ఇండ్లు కట్టకుంటే స్లమ్స్ వస్తాయి. కాని చట్టాలు ఖచ్చితంగా ఉండేలా చేసాం. ఇండ్లు, హాస్పిటల్స్, స్కూల్స్ మొదలైనవి కట్టుకోవచ్చు కాని ముందు మీ ప్రపోజల్‌లో 25శాతం కట్టి వాడుకలోకి వచ్చిన తర్వాత మిగిలిన వాటికి పర్మిషన్ కోసం రావాలి. దీని వల్ల రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అవకాశం లేదు. ఎగుమతులు చేసే వాళ్ళకు దీని బయట రాయితీ అవకాశాలు ఉన్నప్పుడు వీటిలో మాత్రం ఎందుకు ఉండ కూడదు? సెజ్‌ల వల్ల పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి.

ప్రశ్న– సెజ్ డెవలపర్ ముందు చెప్పినంతగా పెరుగుదల సాధించలేనపుడు ఏమవుతుంది? సెజ్ చట్టంలో అలాంటి నిబంధన ఏది లేదు కదా?

కమల్ నాథ్; ఒక వేళ డెవలపర్ సాధించలేదు అంటే అతను మౌలిక సదుపాయాలు నిర్మించలేదు కాబట్టి అతనికి ఎలాంటి లాభాలు కూడా రావు. ఇది అతనికే నష్టం

ప్రశ్న– అయినా, అతనికి ప్రత్యేకమైన ప్రాంతం ఉంది కదా?

కమల్ నాథ్– అది అతని స్వంత భూమి. ఆ భూమి మీద అపార్ట్‌మెంట్ కావాలంటే కట్టుకోవచ్చు. సెజ్‌నే ఏర్పాటు చేయాలంటే చేయవచ్చు, సెజ్‌కు పర్మిషన్ లభించినంత మాత్రానే ఎలాంటి లాభాలుండవు.

ప్రశ్న– చాలా రాష్ట్రాలు ఈ జోన్‌ల కోసం భూమిని సేకరిస్తున్నాయి కదా?

కమల్ నాథ్– భూ సేకరణ అనేది రాష్ట్రాలకు సంబంధించిన విషయం. సెజ్‌లకు భూ సేకరణకు సంబంధం లేదు.

ప్రశ్న– జోన్‌లో పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించిన భూమిలో కాని మౌలిక సదుపాయాల భూమిలోకాని ఎలాంటి కార్యక్రమాలు చేసినా డెవలపర్‌కు వచ్చే లాభానికి పన్ను రాయితీ వస్తుంది కదా?

కమల్ నాథ్– డెవలపర్ బోర్డు అంగీకరించిన కార్యక్రమాలను చేస్తేనే పన్ను రాయితీ లభిస్తుంది. ప్రాసెసింగ్ ఏరియాలో ఎలాంటి కార్యక్రమాలు చేయకుండా నాన్ ప్రాసెసింగ్ ఏరియాలో ఏమీ చేయలేరు. అప్రూవల్ లెటర్ చేతిలో ఉన్నంత మాత్రాన అతనికి ఏమి లాభం లేదు. డెవలపర్ అతనికి ఇష్టం వచ్చినట్లు చేసుకోలేడు. సెజ్‌గా గుర్తింపు పొందిన వెంటనే ప్రాసెసింగ్ ఏరియా మొత్తం కస్టమ్స్ వాళ్ళ నియంత్రణలోకి వెళ్ళిపోతుంది. గుర్తింపు పొందిన కార్యక్రమాలకే పన్ను రాయితీ లభిస్తుంది.ముడి సరుకు కొనడానికి సుంకం నుండి వెసులుబాటు లభించాలన్నా కమిటీ అప్రూవల్ ఉండాలి.

ప్రశ్న– ' అగ్రిమెంట్ ఆన్ సబ్సిడీస్ అండ్ కౌంటర్ వైలింగ్ మెజర్స్' ప్రకారం అంతర్జాతీయ వాణిజ్యం సబ్సిడీస్‌ని నిషేధించింది. ఏ దేశాలు అయితే ఎగుమతికి రాయితీలు ఇస్తాయో, వారికి ప్రత్యామ్నాయంగా పన్ను వేయవచ్చు. ఈ ఒప్పందం ప్రకారం సెజ్‌లకు ఇచ్చే ప్రోత్సాహకాలు( పన్ను రాయితీ, దిగుమతులపై సుంకాలను తగ్గించడం) నిషేధించబడ్డాయి.

కమల్ నాథ్– సెజ్ ఎగుమతుల కోసం నగదు ప్రోత్సాహకాలను ఇవ్వటం లేదు. అందువల్ల సబ్సిడీలు లేవు. పన్నులు ఎగుమతులు చేయకూడదని నొక్కి చెపుతున్నాను. సెజ్‌లు ఒకే దగ్గర సులువైన పద్ధతిలో క్లియరెన్స్ పొందడాన్ని గుర్తుంచుకోండి. కాబట్టి డెవలపర్, ఎగుమతిదారుల నుండి సంకం వసూలు చేసి రిటన్ చేయకుండా ముందే సుంకం నుండి రాయితీ ఇస్తున్నాం.

## సెజ్‌ల అవసరం ఇండియాకు లేదు

### ప్రొఫెసర్ జగదీశ్ భాగవతి

**ప్రముఖ ఆర్థికవేత్త, కొలంబియా యూనివర్సిటీ ఇండియాలో ప్రత్యేక ఆర్థిక మండళ్ళ ఏర్పాటును వ్యతిరేకిస్తున్నాడు.- ముఖ్యాంశాలు**

'సెజ్‌లు అనేవి బిల్డింగ్ నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసే పరంజాలలాంటివి వీటిని ఎక్కడం ద్వారా మరింత ఓపెన్‌లోకి వెళ్లే అవకాశం ఉంది, సెజ్‌ల ద్వారా లాభం ఉండవచ్చు అనిపిస్తుంది. కాని బిల్డింగ్ నిర్మాణం అయిపోయింది. ఇప్పుడు పరంజాల అవసరం ఏముంది? ఇప్పటికే మన పాలసీలలో మార్పులు చాలా వచ్చాయి. అందుకే, ఇది వెనుకకు అడుగు వేయడం అని అనుకుంటున్నాను.'

ఎగుమతి ఆధారిత విధానం కల్పిన చైనాలో తూర్పున ఉన్న నాలుగు ప్రాంతాలలో ఏడువందల మిలియన్ల వర్కర్ల కోసం సెజ్ ప్రయోగంగా ఏర్పడింది. మిగిలిన ప్రాంతంలో ఈ విధానం అమలులో లేదు.

'ఇక్కడ విధానం (ఇండియాలో సెజ్‌లు) ఎలా నడుస్తున్నాయంటే, దీని కోసం భూమి సేకరణ అయితే తప్పదు, మీకు తెలుసు కదా రాజకీయ నాయకుల ప్రమేయం ఉంటుందని. ఎలాంటి అవకతవకలు లేకుండా ప్రజలకు మేలు కలిగేలా ఉంటే తప్పేమి లేదు. దీనిలో రాజకీయనాయకుల ప్రమేయంతో అవకాశవాదం పెరుగుతుంది, స్పష్టంగా వీరి ప్రమేయం గనుక ఉంటే రాజకీయ నాయకులకు, అధికారులకు ఆశ పెరుగుతుంది. ఇలాంటి పరిస్థితి గనుక ఏర్పడితే భూములు కోల్పోయిన ప్రజల నుండి వ్యతిరేకత వస్తుంది.

ఇలాంటి పరిస్థితులే చైనాలోనూ ఏర్పడుతున్నాయి. అక్రమంగా భూమి తీసుకోవడం కూడా జరుగుతోంది. అక్కడ వాళ్లకు చర్చకు ఎలాంటి అవకాశాలు లేవు. అక్కడ స్వచ్ఛంద సంస్థలు లేవు, పత్రికా స్వాతంత్ర్యం లేదు, స్వతంత్రమైన న్యాయవ్యవస్థ లేదు, మరియు ప్రతిపక్ష పార్టీలు లేవు. కాబట్టి వాళ్ళు ఏం చేయగలరు? కనీసం ఇక్కడ చర్చ అయినా జరుగుతోంది ఎందుకంటే ఇక్కడ ప్రజాస్వామ్య వ్యవస్థ ఉంది కాబట్టి. కాని నేను చెప్పేది ఏమంటే, ఇది శుద్ధ దండగ పని. మనకు అవసరం లేదు".

**(Dinesh Narayanan & Anil G Nair)**
**TOI Oct 19, 2006**
**అనువాదం: శ్రీనివాస్ & మొయిద్**

ప్రశ్న– ఉపాధి, ఎగుమతుల, మౌలిక సదుపాయాలు– ఈ మూడు లక్ష్యాలు సెజ్ ద్వారా నెరవేరుతాయని ప్రభుత్వం చెప్పింది. కాని చాలా వరకు సెజ్‌లు పట్టణాలకు దగ్గరగా వస్తున్నాయి, అక్కడ ఇప్పటికే మంచి మౌలిక సదుపాయాలున్నాయి కదా, వీళ్ళని వెనుక బడిన ప్రాంతాలకు, మెట్ట ప్రాంతాలకు ఎందుకు

## సెజ్ చర్చలో సోనియాగాంధీ అభిప్రాయం

కాంగ్రెస్ చీఫ్‌మినిష్టర్ల ఏడవ సమావేశంలో సోనియా గాంధీ (కాంగ్రెస్ ప్రెసిడెంట్) మాట్లాడుతూ, భూసేకరణలో 'భూములు కోల్పోయిన రైతులను ఈ భూములలో జరిగే అభివృద్ధిలో భాగస్వాములను చేయాలని సూచించారు'.

వ్యవసాయేతర అవసరాల కొరకు వ్యవసాయభూమిని సాధారణంగా మళ్ళించరాదు. పారిశ్రామిక అవసరాలకు భూమి అవసరమే అందులో సందేహం లేదు. కాని ఇది మన వ్యవసాయ రంగానికి దెబ్బతలగకుండా ఉండాలి. రైతుల దగ్గర నుండి భూమి కొనుగోలు చేసినవుడు సరియైన నష్టపరిహారం ఇవ్వాలి. భూసేకరణ జరిగిన భూమిలో వచ్చే ప్రాజెక్టులలో ఎందుకు భూమి కోల్పోయిన రైతులను భాగస్వాములను చేయకూడదు? విస్థాపనకు గురి అయిన వాళ్లకు నమ్మకం కుదిరేలా నష్టపరిహారాన్ని, పునరావాసాన్ని సరియైనరీతిలో అమలు జరిగే విధంగా మన విధానాలు ఉండాలని సోనియా అన్నారు.

**(Aarthi Ramachandran) TNN Sep 24, 2006**

తరలించకూడదు?

కమల్ నాథ్– ఇన్వెస్టర్ వచ్చి నేను ఇక్కడ జోన్ ఏర్పాటు చేస్తాను అంటే, నేను అతన్ని అక్కడ ఎక్కడో కట్టుకోమంటే, అతను వదిలి వెళ్లి పోతాడు. అలా నేను చెప్పలేను.

ప్రశ్న– అలాంటి పరిస్థితిలో మౌలిక సదుపాయాల కల్పనకు అతను ఏమి చేయటం లేదు కదా?

కమల్ నాథ్– కాదు, సదుపాయాల కోసం చేస్తున్నాడు. ఇప్పటికే చాలా పెట్టుబడి పెట్టాడు. మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్నాడు. మౌలిక సదుపాయాల కోసం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారు.

ప్రశ్న– వాళ్ల ప్రయోజనాల కోసమే మౌలిక సదుపాయాలపై ఖర్చు చేస్తున్నారు కదా?

కమల్ నాథ్– వాళ్ళు చేసే ఖర్చు జోన్‌లోపలి సదుపాయాల కోసం చేస్తున్నారు.

ప్రశ్న– ప్రత్యేక జోనుల మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేసే డబ్బులు చాలా వరకు(ప్రయివేట్ వాళ్ళు కాకుండా) ప్రభుత్వ కోశాగారం నుండే ఖర్చు చేస్తున్నారు కదా, ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సెజ్‌లలో మౌలిక సదుపాయాల కోసం రాష్ట్ర బడ్జెట్ నుండే 750 కోట్లు శాంక్షన్ చేసింది.

కమల్ నాథ్– రాష్ట్రాలు ఏం చేస్తున్నాయో నాకు తెలవదు, కాని సెజ్‌ల కోసం రోడ్లు నిర్మిస్తే అభ్యంతరం ఎందుకు?

ప్రశ్న–పార్లమెంటరీ స్టాండింగ్ కమిటి కొత్త జోన్ల అనుమతిని నిలిపి వేయాలని రికమెండ్ చేసింది కదా, ప్రభుత్వం ఎందుకు చేయదు?

కమల్ నాథ్– రెండు సంవత్సరాలు ఆగి చూద్దాం అని మేము అన్నాం, ఇవే కాకుండా, ఎవరయతే సెజ్‌లకు అనుమతులు పొందారో వాళ్ళకు పోటీదారులు తమ దగ్గర

## సెజ్‌లకు మరిన్ని రాయితీలు ఇవ్వడానికి అనుకూలంగా లేని మాంటెక్

స్టాక్ ఎక్స్చేంజ్‌లోని ఒక కార్యక్రమం సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, సెజ్‌లకు ఉచిత రాయితీలు, అదనంగా సౌకర్యాలు కల్పించేందుకు తాను అనుకూలం కాదని అన్నారు.ఆర్థిక శాఖ, కామర్స్ మినిస్ట్రీల మధ్య స్పర్థలు వస్తాయి. దీని మూలంగా రెవెన్యూ ఆదాయం గణనీయంగా తగ్గుతుంది. కేవలం టాక్స్ రాయితీలు. పొందేందుకే సెజ్‌లు విచ్చలవిడిగా వస్తున్నాయి. మామూలుగా బయటి ప్రాజెక్టుల విషయంలో జరుగుతున్నట్లుగానే, సెజ్‌లలో కూడా పెద్దఎత్తున రియల్ ఎస్టేట్ కోసం భూసేకరణ జరుగుతోందని అన్నారు.

**PTI Oct 6, 2006**

ప్రాంతంలో రాకుండా చూస్తున్నారు. వాళ్ళకు పోటీదారులు ఉండటం ఇష్టం లేదు.

ప్రశ్న– జోన్‌లు కాలం చెల్లిన విధానం అనే అభిప్రాయం చాలా వరకు ఉంది. ఐ.ఎమ్.ఎఫ్, వరల్డ్ బ్యాంక్, ఏ.డి.బి, ఓ.ఇ.సి.డిలు జోన్ పాలసీలను విమర్శించాయి కదా.

కమల్ నాథ్– నాకు ఐ.ఎమ్.ఎఫ్ గురించి చెప్పకండి, ఇండియాలో ఉన్న సెజ్‌లను ఇంత వరకు చూడకుండా వరల్డ్ బ్యాంక్ వాళ్ళు వాషింగ్‌టన్‌లో కూర్చుంటారు. నేను వరల్డ్ బ్యాంక్ ప్రెసిడెంట్‌ని వచ్చి సెజ్‌లు చూసిన తర్వాత మాట్లాడమన్నాను. వీళ్ళు అభివృద్ధి చెందుతున్న దేశాలకు వ్యతిరేకులు. వాళ్ళ సొంత రికార్డు ఏమన్నా ఉంటే నాకుచెప్పండి, వీళ్ళు ఎక్కడైనా సక్సెస్ అయ్యారా?

## సెజ్ డెవలపర్లకు ఆర్థిక రాయితీలు ఉండవు-వై.వి.రెడ్డి

అన్ని భూములలాగే సెజ్‌లు కూడ రియల్ ఎస్టేట్ వ్యాపారమే అని ఆర్.బి.ఐ గవర్నర్ వై.వి.రెడ్డిసెమినార్‌లో మీడియాతో మాట్లాడుతూ అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ఏవిధంగా అయితే విధివిధానాలు, నిబంధనలు ఉంటాయో అదే విధమైన షరతులు సెజ్‌లకు కూడా వర్తిస్తాయని సెంట్రల్ బ్యాంక్ అన్ని శాఖలకు నిర్దేశించిందని గవర్నర్ తెలిపారు. ఆర్.బి.ఐ నిబంధనల ప్రకారం సెజ్‌లకు ఇచ్చే అప్పుల వడ్డీలు పెరగనున్నాయని అనుకుంటున్నామని అన్నారు. పెద్ద ఎత్తున సెజ్‌లలో పెట్టుబడుల కోసం దరఖాస్తులు చివరి పరిశీలనల దశలో కేంద్ర ప్రభుత్వం వద్ద ఉన్నాయి.

మౌలిక సదుపాయాల కల్పనలో వందశాతం రిస్క్ ఉంటుంది, అదే రియల్ ఎస్టేట్ వ్యాపారంలో 150% రిస్క్ ఉంటుంది. అంటే సెజ్‌లకు పెట్టే పెట్టుబడి వడ్డీ రేటు పెరగటమే కాకుండా, సెజ్ యూనిట్‌లకు, డెవలపర్‌లకు వచ్చే డబ్బులు కూడా తగ్గిపోతాయి. సెజ్‌ల అనుమతుల కోసం కుప్పలుగా వస్తున్న వాటిని చూసి ఆర్థికశాఖ ఏవిధంగా అయితే ఇబ్బంది పడుతోందో అదే విధమైన ఆలోచనలో ఆర్.బి.ఐ కూడా ఉంది. ఇప్పటికే 150 సెజ్‌లకు క్లియరెన్స్ ఇవ్వటం జరిగింది, ఇవికాక రెండు వందలకు పైగా ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయని దీని వలన రెవిన్యూ కోశాగారానికి నష్టం జరుగుతుందని అన్నారు.

**TNN Sep 22, 2006**

చూడండి, జోనులు పని చేస్తున్నాయి, అవి నడుస్తున్నాయి, వాళ్ళు మంచిగా పని చేస్తున్నారు. దేశంలోని రాష్ట్రాల మధ్య పోటీ వలన కోట్ల రూపాయల పెట్టుబడి ముందుకు వస్తుంది. మహీంద్రా, నోకియా ఇంకా కొన్ని మంచిగా నడుస్తున్న సెజ్‌లను పోయి చూడండి.

**Excerpted from Seminar No. 582, February – 2008**

**అనువాదం : శ్రీనివాస్ & శ్రీవత్సన్**






# ఊరుమ్మడి భూముల్ని కాపాడుకుందాం

ఇంగ్లీషులో వాటిని కామన్స్ అంటారు. తెలుగులో ప్రాంతాన్ని బట్టి గ్రామకంఠం, గ్రామనెత్తం లాంటి పలు పేర్లతో పిలుస్తారు. సులభంగా అర్థమవాలంటే ఊరుమ్మడి భూములనో, పంచాయతీ భూములనో చెప్పొచ్చు. ఆ భూముల స్వభావం ఏమిటో దాని పేరులోనే ఉన్నా తెలియనట్టు నటించే గ్రామ పెత్తందార్లు, అధికారులు, రాజకీయ నాయకులు మన దేశంలో కోకొల్లలు.

చెరువులు, శ్మశానాలు, కాలువలు, దొరువులు, మరుగుదొడ్లు, బందిలదొడ్లు, దారులు, వంకలు, పాటిమట్టి దిబ్బలు, పశువుల మేత భూములు, బండ్ల బాటలు వగైరాలన్నీ ఊరుమ్మడి భూములే. అంటే ఊరందరికీ అవసరమైన భూములు. ఊరందరూ వాడుకునే భూములు. అందుకే వీటిని ఏ ఒక్కరికీ ఇవ్వడానికి లేదు. అవి గ్రామ పంచాయతీకి చెందినవైనప్పటికీ వాటిని అన్యాక్రాంతం చేయడానికి వీల్లేదు. సంరక్షించడం మాత్రమే వాటి పని. ఊర్లో ప్రతి ఒక్కళ్లకూ తెలిసిన ఈ విషయాలు ప్రభుత్వ అధికార్లకు ఎలా తెలియవో మనకు అర్థం కాదు. థర్మల్ ప్రాజెక్టుల పేరు మీద, సెజ్‌ల పేరు మీద అటువంటి వేలాది ఎకరాలను కంపెనీలకు కళ్లు మూసుకుని అప్పగించడం చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది. ఇటువంటి అక్రమాలపై కొన్ని నెలల క్రితం సుప్రీంకోర్టు ఒక మంచి తీర్పు చెప్పింది. జగ్పాల్‌సింగ్, ఇతరులు వర్సెస్ పంజాబ్ ప్రభుత్వం, ఇతరులు (సివిల్ అప్పీల్ నెం.1132/2011) అనే కేసులో సుప్రీమ్‌కోర్టు న్యాయమూర్తులు ఇలా అన్నారు.

"దేశంలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి చాలా ప్రాంతాల్లో అంగబలం, ధనబలం, రాజకీయ పలుకుబడిని అడ్డం పెట్టుకుని చిత్తశుద్ధి లేని వ్యక్తులు గ్రామీణ సమిష్టి భూములను కబ్జా చేయడాన్ని మనం కళ్లారా చూస్తూనే వున్నాం. చాలా రాష్ట్రాల్లో గ్రామీణుల ఉమ్మడి అవసరాలకు పనికొచ్చే ఇటువంటి స్థలాలు అంగుళం కూడా మిగలలేదు. అవి కాగితాలకే పరిమితం అయ్యాయి. దేశ వ్యాప్తంగా గ్రామాల్లో పెత్తందార్లు ఈ సమిష్టి భూములను పథకం ప్రకారం కబ్జా చేసుకుని వాటి సహజ స్వభావానికి పూర్తి విరుద్ధమైన అవసరాలకు ఉపయోగపెట్టి గ్రామ ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టి వ్యక్తిగత లాభాలార్జిస్తున్నారు. ఇవన్నీ ప్రభుత్వ అధికారులు, గూండాలు, బలమైన స్థానిక దుష్ట శక్తుల అండదండలతోనే జరుగుతున్నాయి". ఈ మాటలు చదువుతుంటే సోంపేట, కాకరాపల్లి సంఘటనలు, గూండాల చేతుల్లో దెబ్బలు తిన్నవారు, పోలీసు కాల్పుల్లో మరణించిన వారు గుర్తు రావడంలా? కాకినాడ సెజ్ కోసం పచ్చటి భూములను అక్రమంగా ప్రైవేటు కంపెనీలకు అప్పజెప్పడం గుర్తుకు రావడంలా? ఇవి మనకి తెలిసిన ఊళ్లు, ప్రాంతాలు. మనకు తెలిసిన మనుషులు. రాష్ట్రం దాటితే పోస్కో జైతాపూర్, నర్మదా....ఎక్కడ జరగడం లేదు ఈ తంతు?

ఊరుమ్మడి అవసరాల కోసం ఉపయోగించే భూములే కాక బంజరు, పోరంబోకు, శ్రోత్రియం, ఇనాం, దేవాలయ భూములు వంటివి కూడా ఊరంతటికీ చెందే భూములే. స్థానికుల జీవనోపాధి కోసం వాటికి పట్టాలు ఇవ్వవచ్చు కాని అవి ఎప్పటికీ అసైన్‌మెంటు భూములే. అమ్ముకోవడానికి గాని అన్యాక్రాంతం చేయడానికి గాని ఎవరికీ హక్కు ఉండదు. వాటిని సైతం కబ్జాదార్ల రెక్కల నుండి కాపాడటమే ఈ తీర్పు ప్రధాన ఉద్దేశం. అన్ని ఊర్లలో మాదిరిగానే పంజాబ్ రాష్ట్ర పాటియాలా జిల్లా రొహర్ జాగీర్ గ్రామంలో కూడా ఒక చెరువుంది. గ్రామంలోని కాల్వలన్నీ ఈ చెరువులో కలుస్తాయి. గ్రామస్తులు పశువులను కడగడానికి, వాటి దాహం తీర్చడానికి ఉపయోగించే ఈ చెరువుని కొందరు అక్రమంగా ఆక్రమించుకొని మట్టితో పూడ్చేసి గృహ సముదాయం కట్టడం మొదలెట్టారు. ఆక్రమణలను అడ్డుకుని అక్రమ నిర్మాణాలను తొలగించాల్సింది పోయి పాటియాలా జిల్లా కలెక్టరు ఆక్రమణదారులచే నామమాత్రంగా కొంత రుసుము పంచాయితీకి ముట్టచెప్పించి ఆ కట్టడాలను క్రమబద్ధీకరించడానికి పూనుకున్నారు. ఈ కేసు ఆఖరుకి అప్పీల్ రూపంలో ఇద్దరు సభ్యులు గల సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ ముందుకు వచ్చింది. ఇటువంటి అక్రమాలను క్రమబద్ధీకరించకూడదని, అక్రమ నిర్మాణాలను తొలగించాల్సిందేనని, భూమిని తిరిగి గ్రామ పంచాయితీకి అప్పగించాల్సిందేనని, సుప్రీంకోర్టు ఖచ్చితంగా చెప్పింది. కేవలం కేసు వివరాలకే పరిమితమై తీర్పు ఇచ్చుంటే మేము మీ దృష్టికి ఈ తీర్పుని తీసుకుని వచ్చేవారం కాదేమో. ఈ తీర్పులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను ఉద్దేశించి అత్యున్నత న్యాయస్థానం కొన్ని ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది, విలువైన రొప్పి సూత్రీకరణలు చేసింది.

సమిష్టి అవసరాలకు ఉపయోగపడే భూములు ప్రభుత్వ ఆధీనంలో వున్నా ఈ భూములపై ప్రజలకు హక్కుంటుందని కోర్టు తేల్చి చెప్పింది. ఎస్టేట్ నిషేధ చట్టాలు వంటి చట్టాల ద్వారా ప్రభుత్వం ఆయా భూములను వశపర్చుకున్నంత మాత్రాన దానర్థం ప్రజలు వాటిపై తమ సమిష్టి హక్కులు కోల్పోతారని కాదని స్పష్టం చేసింది. గ్రామ పంచాయితీ భూములు, పోరంబోకు భూములు, ఉమ్మడి అవసరాలకు ఉపయోగపడే భూములు దుర్వినియోగం కాకుండా ఉండటానికి నిత్యం ప్రభుత్వంతో తలపడే సామాన్యులకు ఈ తీర్పు ఎంత ఉపయోగపడుతుందో ఆలోచించండి. ప్రభుత్వ ఆధీనంలో వున్న భూమిపై ప్రభుత్వానికే సర్వాధికారాలున్నాయి, ప్రశ్నించడానికి మీరెవరు అని దబాయించి నోళ్లు మూయించే ధోరణిని అరికట్టడానికి ఈ తీర్పు పనికొస్తుంది. ఈ భూములపై ప్రజల, గ్రామ సభల అభిప్రాయాలను, అభ్యంతరాలను, ఆకాంక్షలను విస్మరించడానికి వీలులేదని చెబుతుంది ఈ తీర్పు. ఈ భూములను అంతగా అవసరమైతే ఆయా చట్టాలకు లోబడి నిరుపేదలకు, ఎస్.సి, ఎస్.టి తరగతుల వారి గృహ నిర్మాణాల కోసం, బడి, ఆస్పత్రి మొదలైన ఉమ్మడి ప్రజావసరాల నిమిత్తం ఉపయోగపెట్టుకోవచ్చు కానీ ఈ విధంగా కబ్జాదార్లు చేసే భూ కైంకర్యాలు ఒప్పుకోవడానికి వీల్లేదని అంది.

అంతేకాదు ఈ విధంగా అక్రమంగా అన్యాక్రాంతమైన భూముల నుండి ఆక్రమణదారులను తొలగించి వాటిని తిరిగి గ్రామ సభలకు, పంచాయితీలకు అప్పగించి గ్రామస్తుల ఉమ్మడి అవసరాలకు ఉపయోగపడే విధంగా పథకాలు చేపట్టాలని కూడా కోర్టు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను ఆదేశించింది. అక్రమ ఆక్రమణలు జరిగి చాలా కాలం అయిందనో, ఆ నిర్మాణాలకై భారీ మొత్తం ఖర్చు చేశారనో, వారు రాజకీయ పలుకుబడి గలవారనో కారణం చూపి ఆ చర్యలను మాఫీ చేయడానికి, క్రమబద్ధీకరించడానికి వీలులేదని కూడా తేల్చి చెప్పింది. క్రమబద్ధీకరించాల్సిన సందర్భాలను కూడా పేర్కొంది. భూమి లేని నిరుపేదలకు లేదా ఎస్.సి, ఎస్.టి తరగతుల వారికి కౌలుకి ఇచ్చినపుడో, అప్పటికే ఆ భూమిపై ఒక బడో, ఆస్పత్రో, ఇతర ప్రజావసరాలకు సంబంధించే పని జరుగుతున్నప్పుడో తప్ప ఎట్టి పరిస్థితుల్లోనూ, అక్రమ ఆక్రమణలను క్రమబద్ధీకరించడానికి వీలు లేదని చెప్పింది. ఈ విషయంలో గడువులోపే ప్రభుత్వ కార్యదర్శులు విచారణ జరిపి కోర్టుకి నివేదికలు సమర్పించాలని ఆదేశించింది.

గ్రామాల్లో సమిష్టి భూములు దుర్వినియోగం కాకుండా వాటిని భస్మాసుర హస్తాల నుండి కాపాడుకోవడానికి అనునిత్యం సంఘర్షించే ప్రజలు, ప్రజా సంఘాలు, ప్రజా ఉద్యమాలు తమ హక్కులను కాపాడుకునే యత్నంలో తమ వాదనలు మరింత పదును పెట్టుకోవడానికి ఈ తీర్పు ఉపకరిస్తుందని దీన్ని మీ దృష్టికి తీసుకుని వచ్చాం. భూములు ప్రభుత్వానివైనా వాటిని ఉపయోగించే విషయంలో ప్రజలకు మీరు జవాబుదారులే అనే విషయాన్ని అధికారులకు మరోసారి గుర్తుచేద్దాం.

23-8-2011

**మానవ హక్కుల వేదిక**

**Human Rights Forum (HRF)**


Anveshi
RESEARCH CENTRE FOR WOMEN'S STUDIES

సమకాలీన రాజకీయాలపై బ్రాడ్‌షీట్

## కులం, జనగణన, ప్రజాస్వామ్యం
### భిన్న దృక్పథాలు

సంచిక : 2(త్రైమాసికం) తెలుగు & ఇంగ్లీష్ జూన్ 2011 విరాళం : 10 రూ.



విషయసూచిక
- సంపాదకీయం
- కులం లెక్క తేల్చాల్సిందే
  దుర్గం సుబ్బారావు
- జనగణనలో కులాల్ని లెక్కిస్తే భారత దేశం కుల సమాజంగా మారిపోతుందా ?
  కె.సత్యనారాయణ
- బాక్స్ ఐటమ్‌లలోని సమాచారం వివరణలను అందించినవారు
  కె.వై. రత్నం, తెలుగుఅనువాదం : కె. సజయ
- కుల ప్రాతిపదికపైన జనాభా లెక్కింపు–రాజ్యాంగం రీత్యా అవసరం
  రవివర్మ కుమార్
- కులం, జనగణన: ముందు చూపుతో ఆలోచిద్దాం!
  సొనాల్దే దేశాయి
- జనాభా లెక్కలలో కులగణన ఎందుకుండకూడదు?
  వి.కె.నటరాజ్
- కుల జనగణనను వద్దంటున్న వారి రాజకీయాలు
  సతీష్ దేశ్‌పాండే, మేరీజాన్

ప్రత్యేక సంపాదకులు : ప్రొ॥జి.కృష్ణారెడ్డి, డా॥కె.వై.రత్నం, ప్రొ॥చెన్న బసవయ్య
సంపాదకులు: ఎ. సునీత, ఆర్. శ్రీవత్సన్, ఎమ్.ఎ.మోయిద్
అడ్వయిజరీ బోర్డ్: షీలా ప్రసాద్, అయేషా ఫరూకీ, రమా మేల్కొటే, కె.సజయ, పి.మాధవి, బి.శ్యామసుందరి, సూశీ థారు, వీణా శతృఘ్న, డి.వసంత, కె.లలిత, ఎన్.వసుధ, గోగు శ్యామల, ఉమ భృగుబండ, వి.ఉష.
ప్రొడక్షన్: ఏశాల శ్రీనివాస్, తాడేపల్లి శ్రీలక్ష్మి
ప్రచురణ సంస్థ : అన్వేషి రిసెర్చ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్, 2-2-18/49, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ, అంబర్‌పేట్, హైదరాబాదు -500013.
వ్యాసాలలోని సమాచారం, దృక్పథాలు, అభిప్రాయాలు, వ్యాసకర్తలవి, ప్రత్యేక సంపాదకులవి
ఫోటో : అనుపమ్ నాథ్ / ఎ.పి., గార్డియన్, యు.కె., 11-2010-జూన్, సౌజన్యంతో.

# కాకినాడలో కడలినెట్ వర్క్ స్థాపించి సెజ్‌లకు వ్యతిరేకంగా పోరాడుతున్న రాజేంద్రతో ఇంటర్వ్యూ

**(కె.శ్రీనివాసులు, ఆర్.శ్రీవత్సన్, ఎ.సునీత, జి.శ్యామల)**

ప్రశ్న- కోస్టల్ ఆంధ్రలో సెజ్‌లు ఏస్టేజీలో ఉన్నాయి?

ఆంధ్ర ప్రదేశ్‌లో రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు 119 సెజ్‌లను ఏర్పాటు చేయాలనే ఉద్దేశాన్ని ప్రకటన చేశాడు. అపుడు ప్రతి సెజ్‌కు 5000 హెక్టార్లు లేదా12500 ఎకరాల భూమితో ఏర్పాటు చేయాలని ప్రణాళిక ఉండేది. ఇపుడు 17 సెజ్‌లకు అనుమతి లభించింది, నాలుగు సెజ్‌లు మాత్రం నడుస్తున్నాయి. ఈ 17 సెజ్‌ల కోసం భూసేకరణ జరుగుతోంది. 2005లో వచ్చిన సెజ్ చట్టం రాకముందే పోలీస్, రెవిన్యూ డిపార్ట్‌మెంట్‌లు రెండూ భూసేకరణ కోసం సిద్దపడ్డాయి. భూసేకరణ చేయటం కోసం మధ్యవర్తులుగా రెవిన్యూ సిబ్బంది, గ్రామకార్యదర్శి మరియు మాజీ కరణాలను ఉపయోగించుకున్నారు. ధాన్యం అమ్మేటపుడు ఉండే మధ్య దళారీల్లాగా, భూములకు వీళ్ళు కొనుగోలు ధరలను నిర్ణయించారు, దీనిపై గుత్తాధిపత్యాన్ని కొనసాగిస్తూ ఎవరైనా రైతులు ధర ఎక్కువ అడిగితే వాళ్ళను ఇబ్బందులకు గురి చేశారు. రైతులు తమ భూములు తప్పనిసరిగా అమ్ముకొనేలా చేశారు. ఇప్పుడు ఇక్కడ నాలుగు సెజ్‌లు నడుస్తున్నాయి, అవి అపాచి, బ్రాండిక్స్, అరబిందో, హెటిరో సెజ్‌లు.

ప్రశ్న- సెజ్‌లలో భూసేకరణకు సంబంధించిన పాలసీలు మరియు ఆచరణ వివరాలు చెప్పండి.

18వ శతాబ్దంలో బ్రిటిష్ వాళ్ళు భూమి సర్వే సెటిల్‌మెంట్ చేశారు. బ్రిటిష్ వాళ్ళ రికార్డులలో కోస్టల్ తీర ప్రాంతంలోని మెజారిటీ భూమిని మెట్టభూమి(డ్రైలాండ్)గా నిర్ధారణ చేశారు. ఇప్పటికీ ఈ రికార్డును మార్చలేదు. అయితే, స్వాతంత్ర్యానంతరం కాటన్ బ్యారేజీ, సాగునీటి ప్రాజెక్టులు మరియు చెరువుల ద్వారా ఈ మెట్టభూములలో నీటి సౌకర్యం ఏర్పడింది. ఇపుడు ఈ 'మెట్టభూములలో' నీటి ఆధారిత పంటలు పండుతున్నాయి. అయితే రికార్డులలో ఈ భూమి నిర్ధారణ ఇప్పటికీ మారలేదు. సెజ్ కోసం జరిగే భూసేకరణలో వీటిని మెట్టభూములుగానే గుర్తించి సేకరిస్తున్నారు, నిజానికి ఈ భూములలో నీటి ఆధారిత పంటలు పండుతున్నాయి. సెజ్‌లు రాకముందు మెట్టభూమిగా రికార్డులలో ఉండటం వల్ల రైతులు చెల్లించే భూమి శిస్తు తక్కువగా ఉండేది. ఈ రికార్డుల వల్లే సెజ్‌ల కోసం భూసేకరణ సునాయాసంగా చేయగలుగుతున్నారు. భూమి విలువ కూడ తక్కువగా ఉంది. కోర్టులు వీటినే ప్రామాణికంగా తీసుకోవడంతో ప్రజలు కూడా ఏమీ చేయలేక పోతున్నారు.

సెజ్‌ల డెవలప్‌మెంట్ కోసం కాకినాడలో మెట్టభూములు(డ్రైలాండ్) తీసుకుంటాము అని చెప్పినపుడు, కడలి కలెక్టివ్ ద్వారా సర్వేచేసి నీటి లభ్యత వివరాలు, పంటల వివరాలు, చెట్లు, పండ్లతోటల వివరాలను సేకరించి మ్యాపుల ద్వారా వివరంగా కోర్టుకు సమర్పించాము. అలాగే ఎరువుల కొనుగోలు, పంటల అమ్మకాలకు సంబంధించిన వివరాలను కూడా ఇచ్చాము. ఈ భూములు మెట్టభూములు కాదని మేం అధికారులను ఛాలెంజ్ చేయడంతో జడ్జీలకు కొంత మేరకు అవగాహన వచ్చింది. అయినా తీర్పు మాకు వ్యతిరేకంగా వచ్చింది. ఎన్ని సంస్థలు, సంఘాలు సెజ్‌లకు వ్యతిరేకంగా పోరాడుతున్నాయో తెలియదు కాని, ఈ కారణాల వల్ల నెల్లూరులోని సెజ్‌కు అనుకున్నంత వ్యతిరేకత రావడం లేదు.

ప్రశ్న- సెజ్‌ల కోసం ఎలాంటి కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు?

పారిశ్రామిక అభివృద్ధి కోసం కోస్టల్ కారిడార్‌ను ఏర్పాటు చేస్తున్నారు. సముద్ర తీర ప్రాంతంలో శ్రీకాకుళం నుండి నెల్లూరు వరకు 975కిలో మీటర్ల పొడవున 25కిలో మీటర్ల వెడల్పుతో కోస్టల్ కారిడార్ నిర్మిస్తున్నారు. ఈ కోస్టల్ కారిడార్ పేరుతో ఒక వెయ్యి గ్రామాలు ఖాళీ చేయిస్తున్నారు. ప్రతి జిల్లాలో ఒక ఎయిర్‌పోర్టు, రెండు మూడు థర్మల్ పవర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఇవి మొత్తం 70 థర్మల్ ప్లాంట్‌లు. కాకరాపల్లి, సోంపేట, కొవ్వాడలో ఏర్పడబోయే పవర్ ప్లాంట్‌లన్నీ దీనిలో భాగమే. పోలవరం ప్రాజక్టు ప్లాన్ ప్రకారం ఎడమ కాలువ 25కిలో మీటర్లు , కోస్టల్ కారిడార్‌లో నుండే పోతుంది. పోలవరం ప్రాజెక్టును రైతుల కొరకు కడుతున్నాం అంటున్నారు కానీ అప్లాన్‌ని కోస్టల్ కారిడార్ మాస్టర్ ప్లాన్‌ని పక్కపక్కన పెట్టి చూస్తే పోలవరం ప్రాజెక్టు పారిశ్రామిక అభివృద్ధి కొరకు మాత్రమే అనేది మనకు అర్థమవుతుంది. షాడో ఫీసిబిలిటి రిపోర్టులో ఈ హిడెన్ ఏజెండా మనకు స్పష్టంగా కన్పిస్తుంది.

ప్రశ్న- ఈ ప్రాజెక్టుల వల్ల పర్యావరణం, ఆరోగ్యంపై ప్రభావం ఏమిటి?

పల్లపు ప్రాంతాలలో సాధారణంగా వరి పంట పండిస్తారు. మెట్ట ప్రాంతాలలో రకరకాల పంటలు పండిస్తారు. పండ్ల తోటలు ఉంటాయి. పారిశ్రామీకరణ జరిగితే ఇక్కడి వ్యవసాయం, దట్టమైన అడవులు, చేపల వేట అన్నింటిపైన ప్రభావం పడుతుంది. ఈ పవర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయడం వల్ల పర్యావరణానికి పెద్ద ఎత్తున నష్టం జరుగుతోంది- ప్రజలకు అరోగ్య సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. బొగ్గును పెద్ద ఎత్తున వాడటం వల్ల దానిలో నుండి మెర్క్యూరి పాయిజన్ వెలువడి పిల్లలు పుట్టకుండా చేస్తోంది. గ్యాస్ ఆధారిత ప్లాంట్లలో రోజుకు ఒకటి లేదా రెండు సార్లు గ్యాస్‌ను విడుదల చేస్తారు, దీనివల్ల పక్షులు రాత్రి నిద్రపోవట్లేదు, చేపలు, తాబేళ్ళు, దూర ప్రాంతాల నుండి వలస వచ్చే పక్షులు దూరంగా వెళ్ళి పోతాయి. ఇలాంటి ప్రాంతాలలో గర్భిణీలకు అబార్షన్ అయ్యే కేసులు ఎక్కువగా ఉన్నాయి. రేగడి భూములకు నీటిని పీల్చుకొనే స్వభావం ఎక్కువగా ఉంటుంది-దీని వల్ల గుట్టలున్న ప్రాంతంలో నీటిధారలు ఎక్కువగా ఉంటాయి. ఈ భూమిని గనుక అభివృద్ధికి ఇస్తే నీటి ధారలు మొత్తం నశించిపోతాయి.

సెజ్‌లకు అటవీ, పర్యావరణ, రెవిన్యూల నుండి ఎప్పటికీ అనుమతులు ఉండవు. అయినా అన్నీ వీళ్ళ పూర్తి ఆధీనంలో ఉంటాయి, ఇందులో రిలయన్స్ ముందు భాగంలో ఉంది.

ప్రశ్న- ప్రజల జీవనం పై వీటి ప్రభావం ఎలా ఉంటుంది?

యాభైవేల మంది మత్స్యకారులు తమ జీవనాధారాన్ని కోల్పోతున్నారు. వీరిలో పది శాతం మంది దళితులు. సెజ్‌లకు వ్యతిరేకంగా యువకులు పోరాడుతున్నారు కాని ప్రతిఘటన తీవ్ర స్థాయిలో లేదు. విద్యావంతులు పుస్తకాలు రాస్తున్నారు తప్ప, సముద్రంపై జీవించే వారికి ప్రవేశం లేకపోవడం,భూములు కోల్పోయిన వారికి, వృత్తులు కోల్పోయే వారికి ఎలాంటి ప్రత్యక్ష సహాయం ఏమి అందడం లేదు. మేధావులు సర్కస్‌లో జంతువుల మాదిరిగా వస్తారు-స్టేజీ మీద ప్రదర్శనలాగ ఉంటుంది, వాళ్ళు మాట్లాడతారు, తిరిగి వెనక్కు వెళ్ళిపోతారు కాని ఏమీ చేయరు. అందరూ కాకపోవచ్చు, మెజార్టీ మంది ఇలాగే ఉంటారు. ప్రభుత్వ అభివృద్ధి పేరు మీద గుట్టల్లో, అడవుల్లో ఉండే ట్రైబల్ మైదాన ప్రాంతానికి నెట్టబడతాడు, మైదాన ప్రాంతంలోని వ్యక్తి రోడ్డు మీదికి నెట్టబడతాడు మరియు మత్స్యకారున్ని రోడ్డు మీద పడేస్తారు. మేము అభివృద్ధికి వ్యతిరేకం కాదు. మేము కోరేది ట్రైబల్‌కు మనుగడ ఉండాలి, రైతులకు రైతు కూలీలకు జీవన భద్రత ఉండాలి, మత్స్యకారులకు చేపల వేటకు వెళ్ళేందుకు అవకాశం ఉండాలి.

కాకినాడలో బలవంతగానైనా సరే సెజ్‌లు అమలు పరచే పరిస్థితి ఉంది. 1994లో సీపోర్టును కాకినాడలో ఏర్పాటు చేశారు, తర్వాత కె.వి.రావ్ సీపోర్టును ప్రైవేటైజ్ చేసుకున్నాడు. ఇక్కడ నాలుగు బెర్తులున్నాయి, వీటి నిర్మాణం కోసం ఇక్కడ నివసిస్తున్న ఇరవైవేల కుటుంబాలను రోడ్డున పడేశారు. నెహ్రు, ఇందిరాగాంధీ హయాంలోనే పునరావాసం అవ్వలేదు, ఇప్పుడు ఏం చేస్తారు? 2002లో తీర ప్రాంత సెజ్‌లు ఏర్పాటు కొరకు ప్లాన్ చేశారు. ఒక్కొక్క దానికి 2000 ఎకరాలు ఇవ్వాలనుకున్నారు. దీని తర్వాత ఆధిపత్య కులాల పారిశ్రామిక వేత్తల చేతిలోకి పోయింది. 2003-04లో రెండవ దశలో ఒక్కో సెజ్‌కు ఇచ్చే భూమిని పదివేల ఎకరాలకు పెంచారు. ఈ సెజ్‌లు ముందుగా పెద్దాపురం, సామర్లకోట, న్యూ కొత్తపల్లి, కాకినాడ పట్టణ మరియు గ్రామ ప్రాంతాలలో ఇవ్వాలనుకున్నారు కాని ఈ భూములన్నీ ఆధిపత్య కులాలకు చెందినవి. దీని కొరకు అకడమిక్ స్టడీ జరిగింది, వీళ్లని ఈ ఆధిపత్య కులాల వాళ్లు కొన్నారు, దానితో ఇక్కడి భూమి భవిష్యత్తులో పట్టణాల అభివృద్ధికి అవసరం కాబట్టి ఈ భూమి సెజులకు ఇవ్వటానికి వీలులేదు అని చెప్పారు. దీని తర్వాత వీటిని న్యూకొత్తపల్లి, తొండంగి రూరల్ మండలాల్లో మార్చారు. ఎందుంటే అక్కడ యాదవులు, మత్స్యకారులు, దళితులే నివసిస్తున్నారు కాబట్టి.

ప్రశ్న- ఈరోజుకు సెజ్ వ్యతిరేక ఉద్యమంపై మీ అంచనా ఏమిటి?

నేను దళితున్ని కాబట్టి నన్ను గుర్తించటం లేదు. మిగతా కులాల నుండి వచ్చే వాళ్లను జమ చేద్దామన్నా దానికి వాళ్ళు నాలీడర్‌షిప్‌ని అంగీకరించటం లేదు. టి.వి కెమరాలకు నాముఖాన్ని చూయించడం ఇష్టం లేదు. కాని నేను ఏమి బాధ పడటం లేదు–నా జీవితం పట్ల నాకు సంతోషంగానే ఉంది. సెజ్ యాక్టు పాస్ అయిన వెంటనే ఓఎన్‌జిసి భూ సేకరణ మొదలు పెట్టింది. ప్రభుత్వరంగ సంస్థ కాబట్టి ప్రజలు ఎవ్వరు వ్యతిరేకంగా వెళ్ళలేదు. వెంటనే మా జీవనాధారాన్ని ధ్వంసం చేస్తుందని అర్థమయింది. ఓఎన్‌జిసిని ఆపడం కొరకు మేము చేసిన పోరాటానికి యాక్షన్ ఎయిడ్ సంస్థ సహకారాన్ని అందించింది. సెజ్‌కి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలని నిర్మించే ఆశయంతో కడలినెట్ వర్క్ మొదలు పెట్టాం. మేము ప్రభుత్వ కార్యాలయాలను, ఎమ్.ఆర్.ఒ కార్యాలయాలకు తాళాలు వేయటం మొదలు పెట్టాం. సెజ్‌లు మొదలు కాగానే రాజకీయ నాయకులు, భూమితో సంబంధం లేకుండా దూరంగా ఉన్న వాళ్ళు 'స్వంతం' భూములను ఎలా వీలయితే అలాగ అడ్డగోలుగా అమ్మారు. 4850 ఎకరాల భూమిని అక్రమంగా అమ్ముకొన్నారు ఇందులో పోరంబోకు, డిఫారం పట్టా భూములున్నాయి.

మా భూములను దోచుకున్న వాళ్లు ఇంగ్లీషు మాట్లాడే వాళ్ళు. బాలగోపాల్, బుర్రారాములు లాంటి మానవ హక్కుల వేదిక నాయకులు మాకు సహాయం చేశారు. ఎట్లా పోరాడాలో గ్రామలలో అప్పటి వరకు తెలవదు. పూర్వం ప్రత్యక్షంగా పోరాడుతూ, దోపిడిదారులను చంపే ప్రయత్నం చేసారు. మేము హక్కుల గురించి, చట్టాల గురించి చెపుతూ ఎలా పోరాడాలో నేర్పాం. సెజ్‌లకు వ్యతిరేకంగా పోరాడుతున్న వాళ్ళకు బండారు దత్తాత్రేయ (బి.జె.పి) మద్దతుగా వచ్చారు. ఒక సంఘటన చెప్పాలిక్కడ. మతి స్థిమితం సరిగా లేని ఒక హనుమాన్ భక్తుడు సెజ్ భూసేకరణ కోసం సర్వే చేస్తున్న పట్వారి దగ్గర ఉన్న కాగితాలను చించి వేశాడు. పోలీసులు ఇతన్ని ఈడ్చికెళ్లి కింద పడేసి కొడుతూ ఉంటే మళ్ళీ, మళ్ళీ లేస్తూ నవ్వుతూ ఉన్నాడు. ఎందుకు నీవు ఇలా చేస్తున్నావు అని అడిగినప్పుడు వాళ్ల భూములు తీసుకోవడం, నా ఇల్లు తీసుకోవడం ఒకటే అని అన్నాడు.

భూసేకరణ క్రమంలో పోలీసులు కార్యకర్తల మీద రకరకాల కేసులు పెట్టి హింసించారు. 2008 సంవత్సరంలో ఎపిహెచ్‌ఆర్‌సి క్రిమినల్ కేసులన్ని తొలగించ వలసిందిగా ఆర్డర్ ఇచ్చింది. దీని తర్వాత ఎస్.పి, కలెక్టర్ మరియు అధికార యంత్రాంగం కలిసి కేసులను పకడ్‌బందీగా నడపడం మొదలు పెట్టారు. మమ్మల్ని సోనియా గాంధీ దగ్గరకు తీసుకెల్తామని కాంగ్రెస్ వాళ్లు చెప్పారు– మేము తయారు అయ్యే సరికి ఆమె ఆపరేషన్ కోసం అమెరికా వెళ్లింది. వంద మంది వెళ్లడం కోసం కొనుగోలు చేసిన టికెట్ల డబ్బులు లక్ష రూపాయలు నష్టపోయాం. పార్లమెంట్ స్టాండింగ్ కమిటి ముందుకు సెజ్‌లకు వ్యతిరేకంగా స్టేట్‌మెంట్ ఇవ్వడం కొరకు కడలి నెట్‌వర్క్ వెళ్లింది. 2009 వరకు వివిధ రకాల కులాల గ్రూపులతో కలిసి పోరాడేందుకు అవకాశం ఉండేది. తర్వాత, ఎన్నికలు వచ్చి కుల రాజకీయాలతో ఉద్యమానికి ఉన్న ప్రజాస్వామిక స్వభావం పోయింది.

# దీర్ఘకాలిక చారిత్రక దృక్పథంలో చూసినప్పుడు ప్రస్తుతం అతి పెద్ద భూముల కబ్జాదారు ప్రభుత్వమే

**■ సయ్యద్ అమిన్ జాఫ్రీ**

నవంబర్ 2006లో వచ్చిన సచార్ కమిటి రిపోర్టులో దేశం మొత్తం మీద 4.9 లక్షల రిజిష్టర్ అయిన వక్ఫ్ ఆస్తులు ఆరు లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి. ఈ వక్ఫ్ ఆస్తుల మొత్తం విలువ 6000 కోట్లు కాగా వీటి ద్వారా వచ్చే సంవత్సరాదాయం కేవలం రూ.163 కోట్లు మాత్రమే. 2008 అక్టోబర్‌లో వక్ఫ్ ప్రాపర్టీలపై సంయుక్త పార్లమెంటరీ కమిటి తన తొమ్మిదవ నివేదికను సమర్పించింది. దీనిలో కూడ పై గణాంకాలనే నొక్కి చెప్పింది. అన్ని రాష్ట్రాలలోనూ వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వం, ప్రయివేట్ వ్యక్తులు ఆక్రమించుకోవటంపై సచార్ కమిటి, సంయుక్త పార్లమెంటరీ కమిటి రెండు ఒకే విధంగా విచారాన్ని వ్యక్తం చేసాయి.

అన్ని రాష్ట్రాలలో, ఉత్తర ప్రదేశ్ మరియు పశ్చిమ బెంగాల్‌ల తర్వాత అతి పెద్దమొత్తంలో వక్ఫ్ ఆస్తులు కలిగి ఉన్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. వక్ఫ్ భూముల విషయంలో రాజస్థాన్ తర్వాత రెండవ స్థానంలో ఉంది. దేశంలోనే అతి పెద్ద వక్ఫ్‌బోర్డు అంధ్రప్రదేశ్ వక్ఫ్‌బోర్డు,1.45 లక్షల ఎకరాలతో 37,470 వక్ఫ్ అనుభంద సంస్థలతో, రూ.1,385 కోట్ల రూపాయల విలువ కలిగినది.

వక్ఫ్ బోర్డు సొంత రికార్డు ప్రకారమే, 5,600ల వక్ఫ్ సంస్థల ఆస్థులు, దాదాపు 81,650 ఎకరాల భూమిని ప్రైవేట్ వ్యక్తులు, ప్రభుత్వం, వివిధ రకాల సంస్థలు ఆక్రమించుకున్నాయి.

మొదటి సర్వే ప్రకారం తెలంగాణా రీజియన్‌లో 33,929 వక్ఫ్ సంస్థలు ఉన్నాయి, వాటి ఆస్తులు 77,538 ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి. అయితే, దీనిలో 57,424 ఎకరాలు దాదాపు 74% భూములు ఆక్రమణలకు గురి అయ్యాయి. 27,044 ఎకరాల భూమి, 1,771 వక్ఫ్ సంస్థలు కోస్టల్ ఆంధ్రలో ఉంటే, దీనిలో 16,408 ఎకరాల (61%) భూమి చట్టవ్యతిరేక ఆక్రమణలో ఉన్నాయి. ఆశ్చర్యంగా రాయలసీమలో 40,961 ఎకరాలలో 1,770 వక్ఫ్ ఆస్తులలో కేవలం 19% (7,818 ఎకరాలు) భూమి పరాధీనంలో ఉంది.రెండవ సర్వే ప్రస్తుతం నడుస్తున్నది. దీని ప్రకారం వక్ఫ్ ఆస్తుల అనుబంధాలు 70,784గా, వాటి 1.67 లక్షల ఎకరాల విస్తీర్ణం మన రాష్ట్రంలో ఉంటుంది.

దర్గాలకు సంబంధించిన భూములన్నీ ప్రభుత్వం తన భూములుగా గుర్తించటం మీకు తెలిసే ఉంటుంది. ఉదాహరణకు పహాడీ షరీఫ్‌లోని హజరత్ బాబా షర్ఫుద్దీన్, ఆలూరులోని మక్ధూమ్ బియాబాని, మణికొండలోని హుస్సేని షావలి, విశాఖపట్నంలోని సయ్యద్ అలి ఇశాఖ్ మదాని ఔలియా దర్గాలు ప్రభుత్వ నియంత్రణలో ఉన్నాయి. ఈ భూములు గుర్తింపులోకి తీసుకోవడమే కాకుండా రంగారెడ్డి మరియు ఇతర జిల్లాలోని భూములను ప్రభుత్వం ఎపిఐఐసి, హుడాకు( ఇపుడు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటి) ఇంకా ఇతర డిపార్ట్‌మెంట్‌లకు అప్పగించింది. ఈ డిపార్ట్‌మెంటులు భూములను ఐటి, ఫార్మా కంపెనీలకు, ప్రత్యేక ఆర్థిక మండళ్లకు నామ మాత్రపు ధరకు అమ్ముకున్నాయి.

జాయింట్ పార్లమెంటరీ కమిటి (జెపిసి)అధ్రప్రదేశ్‌లోని వక్ఫ్ భూముల విలువ 35,000వేల కోట్ల నుండి 45,000వేల కోట్లకు పెరుగుతుందనే అంచనాతో, వక్ఫ్ భూములను గుంజుకోవటంపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. వక్ఫ్ భూములను తిరిగి అప్పగించ వలిసిందిగా జెపిసి ప్రభుత్వాన్ని గట్టిగా కోరింది, అయినా ప్రభుత్వానికి ప్రజా ప్రయోజనాల కోసం భూమి కావాలంటే సరి అయిన నష్టపరిహారాన్ని చెల్లించి తీసుకోవచ్చు అని జెపిసి చెప్పింది.

**TOI, Monday, September - 2011, Hyderabad**

అనువాదం : శ్రీనివాస్ & మొయిద్

# తడ, నెల్లూరు అపాచి సెజ్‌తో మేలు జరుగుతుందని ఆశించిన కార్మికుల నిరాశ

■ ఉషా సీతాలక్ష్మి

ముందుగా, అపాచి అనే  అతి పెద్ద  పాద రక్షల సెజ్ ఏర్పడింది, తడలోని మాంబట్టు గ్రామపంచాయితీలో ఆదిదాస్ షూల తయారీ కంపెనీ రావడం వల్ల చుట్టు పక్కల గ్రామాల యువకులకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు వచ్చే కొత్త అవకాశం వచ్చింది, 2006 అగస్టులో సెజ్ నోటిఫై అయిన తర్వాత 5000 మందికి ఉద్యోగాలు లభించాయి, దీనిలో యువకులే ఎక్కువ.

యువకులతో మాట్లాడినపుడు సెజ్‌లో ఉద్యోగాలపై ముందున్న ఉత్సాహం ఎక్కువ కాలం నిలవలేదని తెలిసింది. ఈ యువకులలో చాలా మందికి, ఎలాంటి స్నేహ వాతావరణం లేని పరాయి ప్రాంతంలో పని చేయాల్సి వచ్చింది.ఖచ్చితమైన సమయపాలన, ఉత్పత్తులలో టార్గెట్‌లు పెట్టడం వల్ల కొత్త ఇబ్బందులలోకి వచ్చారు. ముఖ్యంగా మహిళలకు కొత్త డ్రెసు కోడ్‌తో మరింత ఇబ్బంది తోడైంది. అపాచి సెజ్‌లో ఉద్యోగస్థురాలైన హరిత (పేరు మార్చబడింది) 'పని చేసేటప్పుడు ప్యాంట్లు వేసుకోవాలి, ఇది అలవాటు లేక చాలా సార్లు కడుపులో నెప్పి వస్తుంది. గతంలో చదువు కుంటూ కూలి పని చేసుకొనే దాన్ని, ఇపుడు నేను ఎక్కువగా సంపాదిస్తున్నానని మా కుటుంబం సంతోషంగా ఉంది. కాని వాళ్ళు (కంపెనీలో) పని గంటల విషయంలో, టార్గెట్‌ల విషయంలో చాలా ఖచ్చితంగా ఉంటారు. అక్కడ బలమైన వత్తిడి ఉంది. నేను ఎప్పుడు కావాలంటే అప్పుడు సెలవు తీసుకొనే వీలు లేదు. కూలి పనిలో ఉన్న స్వేచ్ఛ ఇప్పుడు లేదు'. తులసి అనే ఇంకో ఉద్యోగస్థురాలు మాట్లాడుతూ ఇక్కడ పని చేయడం కోసం చదువులు వదులుకోవాల్సి వచ్చిందన్నారు.

ఇదే విధంగా, కృష్ణ మాట్లాడుతూ, 'మన టార్గెట్‌ని పూర్తి చేయకపోతే సూపర్‌వైజర్‌ల నుండి భయంకరమైన వేధింపులుంటాయి. ఎలాంటి సెలవులు ఇవ్వరు, టార్గెట్‌ని చేరుకోవడానికి ఎక్కవ గంటలు పని  చేయిస్తారు.. వాళ్ళ భాషలో బూతులు తిడుతారు నీవు ఏమనటానికి వీలు లేదు. ఈ హింస, వత్తిడిని భరించ లేక చాలా మంది పని వదిలి వేశారు. ఎవరైతే ఇవన్నీ భరిస్తారో వాళ్ళే కొంత కాలం ఉన్నారు'.అపాచీలో పని చేసి వదిలి వేసిన వాతామాటి నాగరాజ్ చెపుతూ, ' ముందుగా మేమందమూ సెజ్‌లు మంచివని  అనుకున్నాం. నేను ఆ కంపెనీలో పని చేసి వదిలి వేశాను ఎందుకంటే నేను అక్కడ పని చేయలేను. మా కుటుంబం భూమి  అమ్మకపోయివుంటే మంచిగుండేది అనుకుంటున్నాం. 14లక్షలకు 1.5 ఎకరాల భూమిని అమ్మాను. సెజ్ ప్రపోజల్ ఇక్కడికి రాగానే భూమి ధర చాలా పెరిగింది. చెన్నై నుంచి రియల్ ఎస్టేట్ ఏజెంట్లు వచ్చి భూమి అమ్మమని వత్తిడి తెచ్చారు. వాళ్ళు 14 లక్షలు ఆఫర్ చేశారు, ఇది చూడటానికి చాలా ఎక్కువే కాని అదే భూమిని వాళ్ళు 20 లక్షలకు అమ్ముకున్నారు. ఇప్పుడు ఒక ఎకరం భూమి ఉంది దీనిని నేను అమ్మను. మా బ్రతుకు తెరువు కోసం తిండి గింజలు పండించుకుంటాం'.

ఇలాంటి సంఘటనలనే చాలా మంది యువకులు చెప్పారు. కంపెనీ ఎంత మంది ఉద్యోగులనైతే  తీసుకుంటుందో అంతే స్థాయిలో వారు విడిచి వెళ్ళిపోతుంటారు.చాలా సార్లు, ఇచ్చిన టార్గెట్‌ని చేయలేక పోతే తిట్లు పడవలిసి వస్తుంది మానసికంగా వేధిస్తారు. ఉద్యోగం లోంచి తీసివేస్తారు. ఒక వేళ పనిసరిగా చేయకపోయినా,  అణిగి ఉండకపోయినా వేరే డిపార్ట్‌మెంట్‌లకు మారుస్తారు. ఉదాహరణలకు చాలా ఎక్కువ ఊష్ణోగ్రత ఉండే  రబ్బర్ ప్లాంట్‌లలో పని చేయాల్సి వస్తుంది. ఆరోగ్యభీమా, సెలవులు, ఓవర్ టైం పనికి వేతనం, పనికి సమాన వేతనం లాంటి సమస్యల పట్ల సెజ్‌లో పని చేస్తున్న యువకులు  దృష్టి సారిస్తున్నారు.

**అనువాదం : శ్రీనివాస్ & శ్రీవత్సన్**

**Excerpted from, .S. Seethalakshmi, Special Economic Zones in Andhra Pradesh Policy Claims and People's Experiences . Study supported by Society for National Integration Through Rural Development (SNIRD), Ongole and ACTIONAID, AP Regional Office. Pp 93-94.**










# సెజ్‌లు, అభివృద్ధి ప్రాంతాలుగా మారుతున్న వ్యవసాయ భూములు; భూముల మారకంపై మారుతున్న విలువలు

**వంజిపురం రెడ్డన్న**

దళిత బహుజన ఫ్రంట్ కార్యకర్త (డి.బి.ఎఫ్) భూమి మరియు దళితుల సమస్యలపై పనిచేస్తుంది

నా వరకు, భూ సేకరణలో కీలకమైన అంశం భూమి విలువలో మార్పే అనిపిస్తుంది. పేద రైతుల దగ్గర భూములు ఉన్నంత వరకు, దాన్ని ఎలాంటి విలువ లేని నిరుపయోగమైన బంజరనీ, ఎలాంటి పంట పండనిదనీ అంటారు. పేద రైతులు వ్యవసాయాన్ని కొనసాగించడానికి మద్దతుగా  ప్రభుత్వం దగ్గర ఎలాంటి పెట్టుబడులు, సబ్సిడీలు లేవు. రైతులకు అప్పులు ఇవ్వటానికి ఎలాంటి ప్రభుత్వ సంస్థలు, బ్యాంకులు లేవు. వ్యవసాయానికి అనుకూలంగా పాలసీలు లేకపోగా, వ్యవసాయం చేయటాన్ని ప్రోత్సహించే విధంగా మన విద్యా విధానంలో ఎలాంటి అనుకూలమైన విలువలు లేవు. ఏ భూమి అయితే వ్యవసాయం ద్వారా జీవనాధారానికి, విద్యకు మద్దతుగా ఉందో అదే భూమిపై భవిష్యత్తు తరాలు నిరాసక్తంగా ఉన్నాయి.  మన సమాజంలో వ్యవసాయం పూర్తిగా విలువలేనిదిగా తయారైంది. కాని, ఈ భూమిని ప్రజా అవసరాల పేరు మీద ప్రభుత్వ సంస్థలైన ఎ.పి.ఐ.ఐ.సిల వంటివి  తీసుకొని ప్రయివేట్ పార్టీలకు అప్పగించిన వెంటనే ఈ భూమికి కొత్త విలువ చేకూరుతుంది. ఇది ఎలా సాధ్యమైతుంది? ఈ సెజ్‌లకు అప్పులు ఇవ్వడం కోసం బ్యాంకులు, ప్రైవేట్ సంస్థలు పోటీ పడుతున్నాయి. సంవత్సరాల తరబడి కూడా ఈ భూములలో ఎలాంటి అభివృద్ధి చేయకపోయినా, ఆ భూమిని ప్రైవేట్ వ్యక్తుల దగ్గరే ఉంచేందుకు ప్రభుత్వం ఉత్సాహం చూపుతుంది– ఈ భూములపై ఆధారపడ్డ లక్షలాది మంది తిండికి లేక చచ్చిపోవచ్చు – కాక. మన వ్యవస్థలో మారుతున్న ఈ విలువలను ప్రశ్నించాల్సిన అవసరం ఉంది.

**ఉషా సీతా లక్ష్మి**

**అనువాదం: శీనివాస్ & శ్రీవత్సన్**

**Special Economic Zones in Andhra Pradesh Policy Claims and People's Experiences Pp 76-77.**

# చట్టం, భూసేకరణ, ప్రజాప్రయోజనం

■ వసుధ నాగరాజ్

మెట్రోరైలు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, విద్యుత్ కర్మాగారాలు వంటి బృహత్ ప్రణాళికల అమలులో భూ సేకరణ వివాదాస్పద అంశంగా మారుతుండటం నిత్యం గమనిస్తున్నాం. ఈ తరహా ప్రణాళికల అమలుకు భారీ భూసేకరణ ముడిపడి వుండటమే ఇందుకు కారణం. ఇందులో ప్రణాళికా నిర్వహణదారుడు ప్రత్యక్షంగా కానీ లేదా ప్రభుత్వమే నిర్వహణదారుడి తరపున కానీ భూసేకరణ జరపడం జరుగుతుంది. భూసేకరణ తంతు యావత్తులో భూయజమాని నుండి బలవంతంగా లేదా భయపెట్టి భూమిని స్వాధీనం చేసుకోవడం సర్వసాధారణం. బలవంతంగా కాకున్నా భూ యజమానికి భూమిని సమర్పించుకోవడం మినహా మరేదారీ లేని పరిస్థితి కల్పించడం, చాలా సందర్భాలలో ప్రభుత్వం మార్కెట్ విలువ చెల్లించి స్వాధీనం చేసుకుంటున్నా, ఆ ధర అప్పటికి అమలులో వున్న లావాదేవీల ధర కంటే చాలా తక్కువగా వుండటం పరిపాటి. ఒకవేళ న్యాయమైన ధరే చెల్లించటం జరిగినా వ్యవసాయ భూమి పారిశ్రామిక భూమిగా మారే క్రమంలో దాని విలువ ఎన్నో రెట్లు పెరగడం జరుగుతుంది.

1894 నాటి భూ సేకరణ చట్టం భూ వినియోగదారుడికి తగిన విలువ చెల్లించడం ద్వారా ప్రజాప్రయోజనం కోసం ప్రభుత్వం భూసేకరణ చేపట్టవచ్చని చెప్తుంది. గతంలో భారీ ఆనకట్టల నిర్మాణానికి, రైల్వే లైన్లకు, రహదారులకు, విమానాశ్రయాలకు, బలహీన వర్గాల గృహనిర్మాణం కోసం ప్రభుత్వం భూసేకరణ చేపట్టిన సందర్భాలు ఎన్నో వున్నాయి. వీటిలో ప్రజాప్రయోజనం మనం ప్రస్ఫుటంగా చూడవచ్చు. అయితే ఇటీవల కాలంలో ప్రభుత్వం ప్రయివేటు వ్యక్తుల కోసం భూసేకరణ జరపడం క్రమక్రమంగా పెరుగుతోంది. అభివృద్ధి ప్రణాళికలను ప్రభుత్వ సహాయంతో కాని లేదా తామే స్వయంగా నిర్వహిస్తామని ప్రయివేటు వ్యక్తులు ముందుకు వచ్చినప్పుడు అందులోని ప్రజాప్రయోజనం ప్రశ్నార్థకంగానూ మరియు వివాదాస్పదంగానూ మారుతోంది. పలువురు లేవనెత్తుతున్న ప్రశ్న ఏమిటంటే ప్రయివేటు వ్యక్తులు ప్రజాప్రయోజనం పాత్ర పోషిస్తున్నట్లు భావించవచ్చా, వారి చర్య లాభాపేక్షతో కూడినది కాదా? అని. ఇటీవల అమలులోకి వచ్చిన 2011 భూసేకరణ చట్టంలో పలువురు విమర్శిస్తున్న మరియు వ్యతిరేకిస్తున్న అంశం ప్రభుత్వం ప్రయివేటు వ్యక్తుల కోసం భూసేకరణ చేపట్టడం. 1894 నాటి భూసేకరణ చట్టం ప్రజాప్రయోజనం కోసం భూమిని సేకరించడానికి కొన్ని పద్ధతులు సూచించింది. అవి భూ సేకరణ చేపట్టడానికి ముందు ప్రాంతీయ దినపత్రికల్లోను ప్రభుత్వ గెజిట్‌లోను ప్రకటనలివ్వడం, ఆ తర్వాత జిల్లా కలెక్టరుతో విచారణ, చివరిగా ప్రభుత్వ భూమిని చేపట్టి భూ నిర్వాసితులకు తగిన పరిహారం చెల్లించడం. ఎవరయినా తమకు సంతృప్తికరమయిన పరిహారం లభించలేదని భావిస్తే వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చు. కొన్ని అత్యవసర పరిస్థితులలో పై పద్ధతులేవీ పాటించకుండా ముందస్తు సమాచారమేమీ ఇవ్వకుండా భూమిని స్వాధీనం చేసుకోవడానికి అధికారం ప్రభుత్వానికుంది. ప్రయివేటు వ్యక్తుల కోసం భూమిని సేకరిస్తున్నప్పుడు మరో రకమయిన పద్ధతులను కూడా చట్టం సూచించింది. అవి ఇద్దరి మధ్య వివిధ అనుమతుల మీద అంగీకార పత్రం, కాలపరిమితి మరియు ప్రణాళిక ప్రధాన ఉద్దేశ్యాలు. ప్రయివేటు వ్యక్తులకు చెల్లించాల్సిన పరిహారం తదితర అంశాలలో స్పష్టత. ప్రభుత్వమే మొత్తం పరిహారం చెల్లించే బాధ్యత తీసుకున్న దాఖలాలు కూడా వున్నాయి.

భూ స్వాధీనం గురించి దాఖలయ్యే దావాలు వివిధ రూపాలలో కనిపిస్తున్నా స్థూలంగా మాత్రం రెండు రకాలుగా ఉన్నాయి. మొదటిది భూసేకరణ పరిధి, వాణిజ్య విలువ, మదింపు విలువ, భూ యాజమాన్యపు హక్కు, పరిహారం చెల్లింపులో పక్షపాత వైఖరికి సంబంధించినవి. ఉదాహరణకు దళితుల భూములను స్వాధీనం చేసుకుంటూ పలుకుబడి కలిగిన వ్యక్తుల భూములకు మినహాయింపు నివ్వడం. రెండో తరహా వివాదాలు ప్రభుత్వం భూసేకరణలో అనుసరించాల్సిన విధానం మరియు తదనుగుణమైన చట్ట అనుసరణకు సంబంధించినవి. ఉదాహరణకు నోటీసులు పంపడం, ప్రకటనలివ్వడం, స్వాధీనం చేయటానికి తగిన సమయం ఇవ్వడం లాంటివి.

ప్రయివేటు వ్యక్తుల కోసం భూసేకరణ చేపట్టడం ప్రజాప్రయోజనం కిందకు వస్తుందా రాదా అనే వివాదాలు కూడా వున్నాయి. ఈ తరహా కేసుల్లో ముఖ్యంగా ప్రభుత్వం ప్రయివేటు వ్యక్తుల కోసం భూసేకరణ చేస్తున్నప్పుడు, భూ యజమానులు ప్రభుత్వం తమనుంచి భూమిని సేకరించి, విదేశీ కంపెనీలకు మరియు భూవ్యాపారులకు బదలాయిస్తోందని ఆరోపిస్తున్నారు. దానితోపాటు, ప్రభుత్వం చెబుతున్న అభివృద్ధీ, ప్రజాప్రయోజనం ఇవేవీ కావని, ప్రభుత్వమే నిర్లజ్జగా స్వార్థాపేక్షతో, పలుకుబడి కలిగిన వ్యక్తులకు బాహాటంగా మద్దతిస్తోందనే ఆరోపణ కూడా చేస్తున్నారు.

కరపత్రాలు ప్రచురించడం, నిరసనలు వ్యక్తం చేయడమే కాకుండా ఈ మధ్య చాలా కేసులలో ప్రజాప్రయోజన వాస్తవాలని న్యాయస్థానాలలో ప్రశ్నిస్తున్నారు. అయితే స్వాతంత్ర్యం సిద్ధించిన సంవత్సరం నుండి భారత న్యాయస్థానాలు భూసేకరణలో ప్రభుత్వ నిర్ణయాలను గణనీయంగా ప్రశ్నించడాన్ని వ్యతిరేకించాయి. ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకించిన కేసులు కోర్టులలో చాలా తక్కువ శాతం మాత్రమే విజయం సాధించగలిగాయి. అవి కూడా భూ సేకరణలో సాంప్రదాయంగా పాటించాల్సిన పద్ధతులను అనుసరించే విషయంలో మాత్రమే. ఇంత వరకూ, సాధారణ ప్రజానీకం లేవనెత్తుతున్న ప్రజాప్రయోజనం మరియు ప్రాజెక్టుల ఆవశ్యకతను ప్రశ్నించడాన్ని కోర్టులు అనుమతించలేదు.

**ఇప్పటివరకున్న కేస్‌లా ఏం చెపుతోంది?**

ఎ.ఐ.ఆర్ 1952, ఎస్ 252లో అందించిన సమాచారం మేరకు బీహార్ రాష్ట్రంలో వివిస్ కామేశ్వరసింగ్ కేసు విషయంలో ప్రజాప్రయోజనం గురించి ఒక చారిత్రాత్మకమైన తీర్పు వచ్చింది. పదిమంది రాజ్యాంగ న్యాయనిపుణుల బృందం వెలువరించిన ఈ కేసులో జమీందారులు భూ సంస్కరణల పేరుతో తమ భూమిని స్వాధీనం చేసుకోవడాన్ని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు జమీందారుల భూమిని కౌలుదారులకు పంపిణీ చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని సమర్థిస్తూ ఇలా వ్యాఖ్యానించింది.

“సమాజానికి ఏది మంచో నిర్ణయించగల అత్యుత్తమ న్యాయనిర్ణేత శాసనసభ. ఎవరి ఓటు హక్కుతో శాసనసభ జీవిస్తుందో అది జారీ చేసిన శాసనానికి ప్రజాప్రయోజనం ఉద్దేశం లేదని ఖండించే ఆలోచన కోర్టులు చేయలేవు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కమ్యూనిటీ సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలనీ, ఆస్తుల జాతీయాకరణ విధానాన్ని శాసనాల ద్వారా అమలు చేసే పద్ధతులనీ, ప్రజాప్రయోజనాలు లేనివని అనలేము. ప్రజాప్రయోజనాన్ని శాసనం చేయబడిన దేశకాల పరిస్థితుల నేపథ్యంలో అర్థం చేసుకొన్నప్పుడు, జమీందార్ల భూముల స్వాధీనం కోసం చేసిన ఈ శాసనం ప్రజాప్రయోజనం కోసమే చేసారని చెప్పాలి”.

పై తీర్పు భూ సంస్కరణ మరియు పంపిణీలకు సంబంధించి అభినందనీయకరమైంది. అయితే ఈ కేసు స్వరూపం ఎలా వుందంటే వివిధ సందర్భాలలో భిన్న పరిస్థితులలో కూడా దీన్ని ప్రస్తావించారు. సూరారం ప్రతాపరెడ్డి సహా ఇతరులు వర్సెస్ జిల్లా కలెక్టరు (2008) 9ఎస్‌సిసి552 కేసులో సుప్రీంకోర్టు ప్రజాపయోజనానికి సంబంధించిన నిర్ణయంలో జోక్యం చేసుకోనని పునరుద్ఘాటించింది. ఈ కేసులో శేరి లింగంపల్లి (హైదరాబాద్ పరిసర ప్రాంతం) లోని వందెకరాల భూమిని ప్రభుత్వం ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ పార్కు కోసం స్వాధీనంలో పాటించాల్సిన పద్ధతులు పాటించలేదని విదేశీ కంపెనీలకు విక్రయిస్తున్నదని ఆరోపిస్తూ కోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు మాత్రం మారిన ఆర్థిక సరళీకృత విధానంలో ప్రభుత్వ చర్య సమర్థనీయమైనదేనని భూ స్వాధీనాన్ని సమర్థించింది.

“గత కాలంనాటి ఖచ్చితమైన అభిప్రాయమేమిటంటే ప్రజానీకానికి అందుబాటులోకి తెచ్చినప్పుడు దానిని ప్రజా ప్రయోజనార్థం క్రింద పరిగణించేవారు. ఐతే ఆధునిక సరళీకృత విధానాల కాలంనాటి పరిగణనలో గతంలోలాగా దాని ప్రజాప్రయోజనాల కోసం అందుబాటులోకి వచ్చినప్పుడే కాకుండా దానిని ప్రజా ఆస్తిగా తలచడంతోటే దాని ఉద్దేశం

నెరవేరినట్లవుతుంది".

పై కేసులోని తర్కాన్నే ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కూడా వినమ్రంగా అనుసరిస్తూ కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి కోసం ప్రయివేట్ కంపెనీ తరఫున ప్రభుత్వ భూ స్వాధీనాన్ని సమర్థించింది. కోర్టు తన తీర్పులో ప్రత్యేక ఆర్థిక మండలాల ఆవిర్భావం వలన విదేశీ మారక ద్రవ్యంతో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా వున్నాయని తద్వారా ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపింది.

**న్యాయ చికిత్సకు పరిధులు :**

ప్రజాప్రయోజనం ఏమైనా వుందా అనే విషయంలో కోర్టులు అభివృద్ధి జరగడం మూలంగా సాధారణ ప్రజానీకానికి ఉద్యోగ అవకాశాలుంటాయని భావిస్తున్నాయి. ఈ విషయంలో తీవ్రంగా నిరసనలు మరియు కోర్టు నాశ్రయించడాలు పెరుగుతున్నా ప్రభుత్వ నిర్ణయంలోని ప్రజా ప్రయోజనాలను కూలంకషంగా గుర్తించడానికి పనికొచ్చే నిర్దిష్ట పద్ధతుల గురించి కోర్టులు ఒక నిర్ణయానికి రావడం లేదు. ఏ అభివృద్ధి ప్రణాళికా పర్యవసానాల గురించి తగినంత సమాచారం ఏ కేసు విషయంలోనూ లభించడం లేదు. అయినప్పటికీ కోర్టులు మాత్రం క్రమం తప్పకుండా ప్రభుత్వము మరియు భూ వ్యాపారులు చెబుతున్న కాకి లెక్కలను నమ్ముతూ వస్తున్నాయి. అమలుకు నోచుకోని ఎన్నో అభివృద్ధి ప్రణాళికలు, పర్యావరణ కాలుష్యం, మరియు తగినంతగా ఉపాధి కల్పించలేకపోవడం లాంటి విషయాలలో అనంతమైన సమాచారం లభిస్తున్నప్పటికీ కోర్టులు మాత్రం తమ పరిధిని ప్రభుత్వ నిర్ణయాలను పైపైన పరిశీలించడం వరకే పరిమితమవుతున్నాయి.

కోర్టులు ఎప్పుడూ ప్రజాభిప్రాయాన్ని గట్టిగా సమర్థిస్తూ ప్రణాళికలో ప్రభుత్వం చెబుతున్న ప్రజాప్రయోజనాల్ని ప్రశ్నించలేదు. ఇదే అభిప్రాయాన్ని బహుళ ప్రచారం పొందిన గ్రేటర్ నోయిడా పారిశ్రామికాభివృద్ధి కోసం మాయావతి నిర్ణయానికి సంబంధించిన కోసులో కూడా వర్తింపచేసింది. ఇందులో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని మందలిస్తూ భూ స్వాధీనం క్రమ పద్ధతిలో కాకుండా అవకతవకలతో జరిగిందంటూ భూస్వాధీన ప్రకటనను రద్దు చేసింది. కొసమెరుపు ఏమిటంటే స్వాధీన ప్రక్రియను క్రమ పద్ధతిలో పాటిస్తూ ప్రభుత్వం భూ సేకరణను ఇప్పటికీ చేపట్టవచ్చు అంటూ తీర్పు చెప్పింది. అంతేకానీ భూసేకరణను సంపూర్తిగా రద్దు చేయలేదు.

ఇటు ప్రభుత్వ వర్గాలలోను అటు న్యాయస్థానాలలోను ప్రబలంగా వున్న అభిప్రాయం ఏమిటంటే బాధితులు వారికి లభించే పరిహారం గురించి మాత్రమే ఆలోచిస్తారు. కొత్త భూసేకరణ చట్టం ముందు మాటగా ఏం చెబుతుందంటే భూసేకరణ పారదర్శకంగా ఉంటూ తగిన పరిహారం చెల్లిస్తూ సరైన పట్టాదారు కాని వారికి కూడా పరిహారం లభించేలా వుంటే భూసేకరణ విధానం చాలా మందికి అంగీకార యోగ్యంగా వుంటుందని చెబుతుంది. కొత్త చట్టంలోని పునరావాసం నిబంధనలు మారుతున్న ప్రభుత్వ విధానాలకు అద్దం పడుతున్నాయి. బాధితుల వాదనలకు ప్రాధాన్యత నివ్వడం కొన్ని సందర్భాలలో వారిని భాగస్వాములుగా చేయడం ఇందులో ప్రధానాంశం.

బాధితుని నిరసనను తగిన పరిహారం చెల్లించి తనకనువుగా చేసుకోవడం ప్రభుత్వానికి చాలా సులువు. ప్రభుత్వం చేపడుతున్న ప్రణాళిక తమ ప్రాంతానికి అనువుగా లేదనో తీరు బాగాలేదనో పరిహారాలు తగిన న్యాయం చేయలేవనో చాలా చోట్ల ప్రజలు నిరసన వ్యక్తం చేస్తూ పరిహారం తీసుకోకుండా (పెద్ద మొత్తంలో లభించినా) తిరస్కరించిన సందర్భాలు బహుళంగా వున్నాయి. ఈ తరహా నిరసనలు ప్రణాళిక లోని ప్రజాప్రయోజనం పట్ల ప్రజలకున్న అవిశ్వాసాన్ని న్యాయస్థానాల ముందు వ్యక్తపరుస్తున్నాయి.

అనువాదం: : జి.ఎల్.ఎన్.రెడ్డి

# ఆంధ్రప్రదేశ్ మానవ హక్కుల కమీషన్, హైదరాబాద్ వారి సమక్షమునకు హెచ్.ఆర్.సి నంబరు 1260/2007 సంబంధించి

పైన పేర్కొన్న ఫిర్యాదులోని కడలి నెట్‌వర్క్ కన్వీనరుగా నేను కూడా ఒక ఫిర్యాదుదారుణ్ణి

గౌరవనీయులయిన కమీషన్ గారికి ఇప్పటికే ఇది విదితం. ఈ వ్యవహారం కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) కోసం బలవంతంగా, మోసపూరితంగా స్వాధీనం చేసుకొన్న మా భూమి గురించినది. మా ఫిర్యాదులోని ప్రధానాంశాలు ఏమిటంటే (1) ఈ ప్రత్యేక ఆర్థిక మండలిని ప్రథమంగా కాకినాడ నగరానికి చేరువలో నిర్మించదలచారు. అయితే భూ వ్యాపారుల స్వార్థజోక్యంతో ఆ తర్వాత దీనిని యు.కొత్తపల్లి మరియు తొండంగి అనే ప్రస్తుత ప్రాంతానికి మార్చారు. (2) ఎంతో మందికి జీవనోపాధి కలిగిస్తున్న సాగువంతమైన మా భూములను బంజరు భూములంటూ తప్పగా చూపారు. (3) 45 శాతం భూములను మోసపూరితమైన పద్ధతులలో భూ యజమాని నుండి కొనుగోలు చేసారు. (4) ఈ ప్రత్యేక ఆర్థిక మండలి(సెజ్)లోని పెట్రోలియం సంబంధ పరిశ్రమల వలన ఇచ్చట నెలకొని వున్న సముద్ర ప్రాంతం తీవ్రంగా విషపూరితమయ్యే అవకాశముంది. ఇందుకు సంబంధించి ఈ ప్రాంతంలో నివశిస్తున్న మత్స్యకారుల కోసం పునరావాసం ప్రణాళిక చేపట్టలేదు. (5). రాష్ట్ర ప్రభుత్వ ఉపాధి మరియు పునరావాస పథకం (జి.ఓ.ఎమ్.ఎస్.నెం.68) ఇంత వరకు అమలుకు నోచుకోలేదు.

మా ఫిర్యాదు పెండింగు (అనిశ్చితంగా)లో వున్నా పట్టించుకోకుండా అధికారులు మాత్రం భూ యజమానులు రాకుండా కంచె వేయాలన్న ఉద్దేశ్యంతో బలవంతంగా మా భూమిని స్వాధీనపరుచుకొంటున్నారు. శ్రీ చింతా సూర్యనారాయణ మూర్తి, (కన్వీనర్, సెజ్ వ్యతిరేక రైతు పోరాట ఉద్యమం, మూలాపేట వాసి, యు.కొత్తపల్లి మండలం) గారికి శనివారం నాడు అనగా ఆగస్టు 9వ తారీఖునాడు పోలీసులు మా భూమిని బలవంతంగా స్వాధీనపరచుకుంటామని ఓ సందేశం పంపించారు. ప్రజలు దీనిని ఎదుర్కోవడానికి సంసిద్ధంగా వున్నందున తీవ్ర ఘర్షణ జరిగే అవకాశముంది.

గతవారం ఇదే మండలంలోని శ్రీరామపురంలో సెజ్ డెవలపర్ మిస్టర్ కె.వి.రావ్ కొంత మంది కూలీలను తెచ్చి 200 సరివి చెట్లను నరికి వేయించారు. కొనుగోలు మోసపూరితమని ఇప్పటికీ వివాదంలో వుంది. అక్కడి ప్రజలు ఈ నరికివేతను వ్యతిరేకించడం వల్ల అక్కడ తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. జిల్లా కలెక్టరు చొరవతీసుకొని నరికి వేయబడ్డ ప్రతి చెట్టుకు రు.25000/- రైతుకు పరిహారం చెల్లించేలా డెవలపర్‌ను ఒప్పించడంతో సమస్య సానుకూలమైంది. వారు ఆ తర్వాత రు.20,000/- చెల్లించారని తెలిసింది. ఒకవేళ డెవలపర్ కాకుండా ఆయుధాలు ధరించిన పోలీసులు భూమిని స్వాధీనం చేసుకొని వుంటే పరిస్థితి ఇంత ప్రశాంతంగా వుండేది కాదు.

ప్రభుత్వం ఎందుకింత ఆతృతగా వుందో మాకు అర్థం కావడం లేదు. సక్రమ పద్ధతిలో ప్రభుత్వం భూమిని స్వాధీనం చేసుకోలేదని పిటిషన్ వేయడంతో భూసేకరణను రెండు సంవత్సరాలు పెండింగులో పెడుతూ హైకోర్టు స్టే ఇచ్చింది. గౌరవనీయులైన కమీషన్ ఈ వ్యవహారాన్ని పలు కోణాల నుంచి పరిశీలిస్తూ ఇప్పటికే భూమిని బలప్రయోగంతో స్వాధీనం చేసుకోవద్దంటూ అధికారులను ఆదేశించింది. డెవలపర్ ఇప్పటికి కూడా ఇందులో పెట్టుబడి పెట్టే వారెవరో కూడా గుర్తించలేదు. మరోవైపు భూ వినియోగదారుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది. ఈ ప్రతిఘటన ఎంత తీవ్రంగా వుందంటే ప్రభుత్వం ఈ సెజ్ ప్రారంభోత్సవాన్ని పలుమార్లు ప్రకటించి వాయిదా వేసింది. ప్రధాన మంత్రి మరియు ఎఐసిసి ప్రెసిడెంట్ ఈ సెజ్‌ని ప్రారంభించాల్సి వుంది. అయినప్పటికీ వారి కార్యక్రమం పలుమార్లు వాయిదా పడటం జరిగింది. దానికి కారణం ప్రజల్నుంచి ఎదురవుతున్న ప్రతిఘటన.

ఈ పరిస్థితులలో అధికారులు భూమిని బలవంతంగా స్వాధీనం చేసుకోవాలనుకోవడం దురదృష్టకరం. దయచేసి మీరు జోక్యం చేసుకొని జిల్లా కలెక్టరు గారిని ఈ దుస్సాహస చర్యను విరమించవలసినదిగా సలహా ఇవ్వగలరు.

(కె. రాజేంద్ర కుమార్)

అనువాదం : ఎల్.వి. లక్ష్మీ

# ఎమినెంట్ డొమైన్ : ఒక నేపథ్యం

■ ఆర్.శ్రీవత్సన్

**సమకాలీన ప్రాముఖ్యత**

గత దశాబ్దంన్నర కాలంలో 'ఎమినెంట్ డొమైన్' అనే పదం చాలా తరచుగా మీడియాలో వినపడుతోంది. పారిశ్రామీకరణ కోసం లేదా స్పెషల్ ఎకనామిక్ జోన్స్ కొరకు భూమిని సేకరించిన సందర్భాలలో ఈ పదాన్ని వాడుతున్నారు. ఎమినెంట్ డొమైన్ అంటే రాజ్యం తన అధికారాన్నుపయోగించి ఎవరి యాజమాన్యం కింద గల భూమినైనా 'ప్రజాప్రయోజనాల కోసం' స్వాధీనపరచు కోవటమన్నమాట. అయితే అలా భూమిని స్వాధీనపరచు కొన్నప్పుడు రాజ్యం చట్టరీత్యా సరైన పద్ధతులను పయోగించటమే కాక, భూయజమానికి న్యాయమైన పరిహారం చెల్లించాలనే సూత్రాన్ని హ్యూగో గ్రోషియస్ అనే 17వ శతాబ్దపు డచ్ న్యాయకోవిదుడు ప్రతిపాదించారు. అయితే, ఈ పదానికి భారతదేశంలో ప్రత్యేక చరిత్ర, ప్రాముఖ్యత ఉన్నాయి.

మీడియాలో ఈ పదం తరచుగా ఇప్పుడే వినపడటానికి కారణాలేమిటి? చెప్పుకోవాలంటే, స్వతంత్ర్యం వచ్చిన నాటినుండీ కూడా భారత రాజ్యం అభివృద్ధి పథకాల కోసం అంటే ఆనకట్టలు, రోడ్లు, పవర్ ప్రాజెక్టులు, గనులు, పరిశ్రమలు, ఇతర అనేక విషయాల గురించి భూములను స్వాధీనపరుచుకుంటూనే ఉంది. వీటి వల్ల నిర్వాసితులైన ప్రజలు, వారి జీవితాల గురించి ఇప్పటి వరకూ సరైన సమాచారం లేదు. అంతేకాక, 1950ల నుండి జమీందార్ల దగ్గర 'సోషలిజం' పేరుతో చాలా భూమిని స్వాధీనం చేసుకుంటూ కూడా వస్తోంది. సుప్రీంకోర్టు ఇటువంటి చట్టాలని కొట్టివేయకుండా వుండటానికి భారత రాజ్యాంగంలోని 9వ షెడ్యూలు కింద అవి చేయబడ్డాయి, ప్రతీ రాష్ట్రంలో కూడా దీని కొరకు ప్రత్యేక భూసీలింగు చట్టాలు చేయబడ్డాయి. ఒక పక్క ఎమినెంట్ డొమైన్ కోర్టులలో అమలవుతూ వుండగానే, ఇంకో పక్క బయట పబ్లిక్ చర్చల్లో ఈ పద ప్రయోగం ఎక్కువవుతూ వచ్చింది. ఇక్కడ మళ్ళీ మనని మనం వేసుకోవాల్సిన ప్రశ్న : ఈ ప్రయోగం ఎందుకు ఎక్కువయిందీ అని?

ఈ మధ్యనే ఢిల్లీలో ఒక థింక్ టాంక్ భూ స్వాధీనంపై నిర్వహించిన సమావేశంలో పారిశ్రామిక వేత్తలు, అధికారులు, మంత్రులు, ఆక్టివిస్టులు చాలా మంది పాల్గొన్నారు. ఆ సమావేశంలో జరిగిన చర్చలు గమనిస్తే పై ప్రశ్నకి సమాధానం వెతకటానికి కొన్ని సూచికలు లభిస్తాయి.

1) ఇప్పటి వరకూ గ్రామాలలో, ఇతర ప్రాంతాలలో ఎందుకూ పనికిరాని బంజరుగా పడి ఉన్న భూములు ఇప్పుడు పారిశ్రామిక రంగ ఎదుగుదలకు అవసరమవుతున్నాయి. జాతీయ రహదారులు, రైల్వేలు, ఓడరేవులు, ఆనకట్టలు, ఎలక్ట్రిసిటీ ప్రాజెక్టులు, ఫాక్టరీలు, గనులు ఇంకా అధిక దిగుబడి కోసం బలవంతపు ఎదుగుదలకు గురవుతున్న ఆర్థిక జోన్లు – వీటన్నిటికీ భూమి అవసరం పడుతోంది. భారతదేశంలో పెట్టుబడిదారీ విధాన ఎదుగుదలలో ప్రస్తుత భూసేకరణ ఒక ముఖ్యమైన చారిత్రక ఘట్టంగా మనం అర్థం చేసుకోవచ్చు.

2) అయితే ఈ భూసేకరణలో ఎదురవుతున్న కష్టాలను గురించి కూడా ఈ సమావేశం చర్చించింది. ఒక ప్రాజెక్టులో బహుశా అతి తక్కువ ఖర్చు అయే భూమిని సేకరించటం అత్యంత కష్టతరమే కాక, రిస్క్‌తో కూడి అత్యంత జాప్యంతో కూడివున్న పనిగా తయారయింది. సింగూరులో ప్రజా వ్యతిరేకత పెల్లుబికటంతో టాటా కంపెనీ తమ పెట్టుబడులు గుజరాత్‌కు తరలించటం దీనికి మంచి ఉదాహరణ.

3) చర్చకు వచ్చిన మరో అంశం – అసలు భూ యజమానులకు ఇచ్చిన పరిహారం ఆ తరువాత రెక్కలొచ్చే ధరలను పరిగణనలోనికి తీసుకోవట్లేదు. వ్యవసాయ భూమిని పారిశ్రామిక భూమిగా మార్చంగానే దాని మార్కెట్ వాల్యూ విపరీతంగా పెరుగుతోంది. ఈ రకంగా ధర పెరగటం అసలు భూ యజమానులకు 'నష్టంగా' అగుపించటం వల్ల వారు చాలా అసంతృప్తికి లోనవుతున్నారు.

4) భూసేకరణకు అవలంబించాల్సిన ప్రభుత్వ విధి విధానాలు సవ్యంగా, పారదర్శకంగా లేకపోవటంతో దాని విలువ లెక్కగట్టటం కష్టతరమయ్యి, గందరగోళానికి, లంచగొండితనం పెరగటానికి, అనేక కుతంత్రాలకూ దారి తీస్తోంది.

5) భూమి మీద అధికారం లేకపోయినా ఆ భూమి మీద ఆధారపడి జీవించే అనేక మంది ఇటువంటి భూసేకరణ వలన జీవనోపాధిని కోల్పోతున్నారు. న్యాయమైన పరిహారాన్ని పారిశ్రామీకరణ కోణం నుండి చూసినప్పుడు వ్యతిరేకత ఇక్కడి నుండే ఉద్భవిస్తోంది.

6) ఆదివాసీ ప్రాంతాలకు సంబంధించి ప్రత్యేక సమస్యేమిటంటే – గనుల కోసం, ప్రత్యేక ఆర్థిక మండళ్ళ కోసం జరిగిన భూసేకరణ వల్ల ఆదివాసీలు అత్యంత పేదరికంలోనికి నెట్టబడ్డారు. అందుకే ఈ ప్రాంతాలలో మావోయిస్టు పార్టీలకు విపరీతంగా ప్రజాదరణ పెరుగుతోంది.

7) స్థూలంగా చెప్పాలంటే భూసేకరణ అత్యంత భావోద్వేగాలతో కూడిన అంశం. దేశంలో అనేక ప్రాంతాలలో భూసేకరణ వల్ల జరిగిన నిర్వాసిత సమస్య నేపథ్యంలో ఏర్పడిన రాజకీయ అస్థిరతను చూస్తే మనకి విషయం అర్థమవుతుంది. ఇటువంటి అస్థిరత కారణంగా నందిగ్రామ్‌లో వలే మొత్తం ప్రాజెక్టునే ఆపేయాల్సిన పరిస్థితి రావచ్చు.

ఈ సమావేశంలో భూసేకరణ గురించి ఆందోళన చెందాల్సిన అంశాలుగా జరిగిన చర్చలను చూస్తే విధాన నిర్ణయాలు తీసుకోవాల్సిన రాజకీయవేత్తలకూ, పెట్టుబడిదారులకూ కూడా ప్రాజెక్టులు సాఫీగా జరగాలంటే క్లిష్టతరంగా మారిన భూసేకరణకు పరిష్కారం వెతకవల్సిన అవసరం ఏర్పడిందని అర్థమవుతుంది. ఈ సందర్భంలోనే 'ఎమినెంట్ డొమైన్' పదం ప్రస్తుత అభివృద్ధి పథంలో భారతదేశమున్న స్టేజిలో 'ఆర్థిక భద్రత' సమస్యకు సూచికగా వాడటానికి అధికారులకూ, వ్యాపారవేత్తలకూ, ఆక్టివిస్టులకూ కూడా అవసరమనిపిస్తోంది. సాంస్కృతికంగానూ, ఆర్థికంగానూ భూమితో అత్యంత సన్నిహిత సంబంధాలున్న రైతులూ, భూమిపై ఏ అధికారాలు లేకున్నా దానిపై ఆధారపడే వర్గాల నుండి పారిశ్రామిక వర్గానికి, 'మానవీయ'మైన, కట్టుదిట్టమైన, సముచిత మార్గాల ద్వారా భూమిని బదిలీ చేయాల్సిన సందర్భంలో వచ్చిందే ఎమినెంట్ డొమైన్(ఇ.డి) పై చర్చ.

ప్రస్తుత భారతదేశంలో భూమి, సంపదకు సంబంధించిన అనేక కోరికలకు, అవసరాలకు, మూలాలకు కేంద్ర బిందువుగా వుంది. ప్రజలను సంపద నుండి వేరుచేసి, నిర్వాసితులను చేసి, వలసలకు గురిచేస్తున్న ప్రస్తుత ప్రపంచంలో గ్రామీణ పేదలకు భూమి మానసిక శాంతిని, భద్రతను కల్పించే అవసరంగా మారింది. భూస్వాములేమో భూమి నుండి కౌలు వసూలు చేసుకుంటూ మార్కెట్‌లో భూమి విలువను పెంచుకుంటూ అత్యంత ఎక్కువ ధర పొందటం కొరకు భూమిని వదలట్లేదు. ప్రభుత్వమేమో భూమిని స్వాధీనం చేసుకొని పారిశ్రామిక వేత్తలకు మంచి ధరకు అమ్మి లాభాలనార్జించాలని చూస్తోంది. పరిశ్రమలు లాభాలనార్జించటానికి భూమి నాశిస్తున్నాయి. భూమికి సంబంధించిన ప్రతి లావాదేవీనీ అనేక రకాల శక్తులు ప్రభావితం చేయడానికి చూడటం మనకు కన్పిస్తుంది. ప్రభుత్వం, పరిశ్రమలూ కూడా ఇ.డి ద్వారా అందరికీ ఆమోదకరమైన పరిష్కారాన్ని కనుక్కుని ఈ లావాదేవీలు ఏ ఇబ్బందీ లేకుండా జరగాలని చూస్తున్నామని చెప్తున్నాయి. వాస్తవానికి ఇడి ద్వారా భూసేకరణంతా కుట్రలు, కుతంత్రాలూ, అవినీతిలో మునిగిపోయి తద్వారా జనించే అసంతృప్తితో రాజకీయ అస్థిరతను సృష్టిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం, యజమానులందరూ తమంతట తామే ముందుకొచ్చి రాజ్యానికి, పరిశ్రమలకు భూమిని అమ్మే కొత్త సంస్కృతిని ప్రోత్సహించి పారిశ్రామిక విస్తృతికి ప్రజావ్యతిరేకతను తగ్గించాలని చూస్తోంది. ఇ.డి.పై చర్చ పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడిదారీ విధానం దేశంలో ఎదుర్కొంటున్న ఒక కీలక సమస్యకు పరిష్కారం వెతుకుతోంది. జాతీయ భూసేకరణ బిల్లు 2011 దీనిపట్ల చాలా స్పష్టతతో వుంది.

**ఇ.డి: చారిత్రక నేపథ్యం, సిద్ధాంత చట్రం**

*ఎమినెంట్ డొమైన్ : యూరప్‌లో సార్వభౌమత్వం / ప్రభుత్వం:* దేశాన్నేలే రాజుకీ, చర్చికీ ఎప్పుడూ కూడా తనకు కావల్సిన భూమిని తీసుకునే అధికారం వుంటూ వచ్చింది. పాశ్చాత్య దేశాల్లో రాజులకి తమ భూభాగం పై అంతులేని అధికారాలుండేవి. మధ్య యుగాల నుండీ కూడా అది ముఖ్యమైన అధికార సూత్రాలలో ఒకటిగా వుండింది. పద్దెనిమిదో శతాబ్దం తరువాత బూర్జువా ప్రజాస్వామ్యం రాజ్యం పై పెత్తనం సంపాదించటం మొదలయినప్పటి నుండి, రాజులు ప్రజలకు జవాబుదారీగా వుండాలనే భావన బలపడింది. రాజ్యం వ్యక్తిగత ఆస్తిని తీసుకుంటే వ్యక్తులు రాజ్యానికున్న ఆ అధికారాన్ని ప్రశ్నించలేరు గానీ, ఆ తీసుకోవటంలోని ప్రజాప్రయోజనాన్ని, నియంతృత్వ ధోరణినీ ప్రశ్నించటానికి అవకాశం ఏర్పడింది. ప్రశ్నించటం కూడా జరిగింది. భావపరంగా, సిద్ధాంతపరంగా రాజ్యాధికారం అనేది ప్రజాసార్వభౌమత్వం కింద చెలాయింపబడాలి అనే

భావన పూపందుకుంది. అందువల్లనే, అన్ని ఆధునిక ప్రజాస్వామ్యాలలోనూ, ప్రజాప్రయోజనం అంటే జాతీయ ప్రయోజనంగా (= ప్రజలకు ప్రయోజనం) గా చూస్తాము. ఇది వ్యక్తిగత ప్రయోజనాలకు మించిందన్న మాట. ఎమినెంట్ డొమైన్ సూత్రం ఒక పక్క రాజ్య(రాజ) సార్వభౌమత్వాన్ని బలపరుస్తూనే, ప్రజలకు జవాబుదారీగా వుండాలనే సూత్రాన్ని కూడా బలపరుస్తుంది. అసలు సమస్యంతా వచ్చేది : ఈ ప్రజాప్రయోజనాన్ని ఆస్తిపరులైన కులీన వర్గం అంటే పెట్టుబడిదారీ వర్గం నిర్వచించటం నుండే.

*ఎమినెంట్ డొమైన్ సూత్రానికి, స్వంత ఆస్తి భావనకూ రాజ్యాధికార సిద్ధాంతంలో వున్న పరస్పర వ్యతిరేకత:*

'స్వంత ఆస్తి' అనే భావనలో భూమి వంటి స్థిరాస్తులూ, మరియూ కార్లు, బియ్యం బస్తాలూ, పుస్తకాలు వంటి వినిమయ వస్తువులూ రెండూ కూడా భాగమే. అయితే ఎమినెంట్ డొమైన్ సూత్రాన్ని సాధారణంగా 'భూమి' విషయంలోనే వాడతారు. రాజకీయ, ఆర్థిక సిద్ధాంతాలలో స్వంత ఆస్తి భావన పెట్టుబడిదారీ విధానానికీ, స్వేచ్ఛావిపణి విధానానికి భూమిక. మార్కెట్ విధానంలో లావాదేవీలు సరిగా జరగాలంటే ఆస్తి అమ్మాలనుకునే వ్యక్తి ఆ ఆస్తికి యజమాని అయివుండాలి. అమ్మకం అయిపోంగానే ఆ యాజమాన్యం ఆ ఆస్తి కొన్న వ్యక్తికి బదలాయించటం జరుగుతుంది. రాజ్యం అటువంటి యాజమాన్యాన్ని బలప్రయోగంతో అయినా సరే అమలుపరచవలసి వుంటుంది. ఆస్తి యజమాన్య సూత్రం అమలు చేయ్యలేకపోతే స్వేచ్ఛావిపణి విధానం ద్వారా జరిగే వస్తు సేవల పంపిణీకి భంగం కలిగి పెట్టుబడిదారీ విధానమే కుప్పకూలుతుంది.

రాజుకి ఏ ఆస్తినైనా తీసుకునే హక్కుందని ప్రతిపాదించే 'ఎమినెంట్ డొమైన్' సూత్రం స్వంత ఆస్తికి సిద్ధాంతపరంగా వ్యతిరేకం. ఉదారవాద రాజకీయ స్రవంతిలో ఈ రెంటికీ వున్న పరస్పర వైరుధ్య సంబంధాల గురించి రెండు రకాల ఆలోచనా ధోరణులు కన్పిస్తాయి.

మొదటి సిద్ధాంతం ఈ కింది విధంగా సూత్రీకరిస్తుంది: వ్యక్తులు మొదటి నుండీ స్వంత ఆస్తి కలిగున్నారు. వీళ్ళందరూ దోపిడీ నుండి, బలప్రయోగం నుండి తమను తాము రక్షించుకోవడానికి ఒక దగ్గరికొచ్చి 'సామాజిక ఒప్పందం' ద్వారా రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అంటే రాజ్య ఏర్పాటుకు ముందే వ్యక్తిగత ఆస్తి పుట్టింది. దాన్ని రక్షించటమే రాజ్యానికున్న ప్రధాన బాధ్యత. థామస్ హాబ్స్, రూసోలతోపాటు, జాన్ లాక్ ఈ సిద్ధాంతానికి ఆద్యుడని అందరూ భావిస్తారు. ఈ దృక్పథం ప్రకారం రాజ్యం బలప్రయోగం ద్వారా వ్యక్తుల స్వంత ఆస్తిని ఆధీనపరచుకోవటం వారి ప్రాథమిక ఆస్తి హక్కుని ఉల్లంఘించటమే. ఇ.డి ని ఈ రకంగా ఉపయోగించి, స్వంత ఆస్తి హక్కులకు భంగం కలిగించటాన్ని అనేక మంది వ్యక్తులు వ్యతిరేకిస్తూ వచ్చారు. పాశ్చాత్య దేశాల్లో ఈ పోరాటాలకు 200 సంవత్సరాల పైబడిన చరిత్ర వుంది.

డేవిడ్ హ్యూమ్,జెరమీ బెంథామ్ వంటి వారు ప్రతిపాదించిన రెండవ ఆలోచనా ధోరణి పైన చెప్పిన వ్యక్తిగత ఆస్తి సిద్ధాంతాన్ని విమర్శిస్తుంది. దీనిని మనం యుటిలిటేరియన్ వాదన అనవచ్చు. రాజ్యం 'సామాజిక ఒడంబడిక' ద్వారా వ్యక్తిగత ఆస్తిని కాపాడటానికి పుట్టిందనే భావన చారిత్రకంగా నిజం కాదనీ, అలాంటి భావన ప్రజలు తరాల తరబడి రాజ్యానికి లోబడి వుండటాన్ని విశదీకరించలేదనీ వీరు వాదిస్తారు. రాజ్యానికి ప్రజలు లోబడి వుండటానికి రెండు కారణాలు చెప్పుకోవచ్చు. ఎ) అలవాటుకొద్దీ మరియు బి) రాజ్యం తనపని సమర్థవంతంగా చేస్తూ వుండటం వల్ల. అంతేకాక, వ్యక్తిగత ఆస్తి రక్షణ కోసం చేయబడిన చట్టాలు కూడా రాజ్య సంరక్షణ, అది ఏర్పాటు చేసిన బలప్రయోగ వ్యవస్థలైన పోలీసు, జైళ్ళు, సైన్యం వంటివి లేకుండా పని చేయవు. అందువల్ల, వ్యక్తిగత ఆస్తికి, రాజ్యవ్యవస్థ లేకుండా మనుగడలేదు. యుటిలిటేరియన్ను వాదనలో, ఆస్తి చట్టాలతో సహా ఏ చట్టాలైనా  సమాజంలో పనిచేసే కొన్ని వూహా కథనాలు మాత్రమే తప్ప వాటి వెనుక దైవికమైన నిగూఢ రహస్యాలేమీ లేవు. ఈ దృక్పథం ప్రకారం వ్యక్తిగత ఆస్తికి ప్రత్యేకమైన పవిత్రత వుండదు కాబట్టి, రాజ్యం న్యాయమైన పరిహారం ఇచ్చి ప్రజా ప్రయోజనాల కోసం తనకు కావల్సిన ఆస్తిని తీసుకోవచ్చు. అయితే ఈ సూత్రాన్ని అప్పుడప్పుడూ మాత్రమే వాడాలని బెంథామ్ అంటాడు. ఎమినెంట్ డొమైన్ సూత్రాన్ని నియంత్రణ లేకుండా వాడితే సామాజిక జీవనంలో కీలకమైన పాత్ర పోషించే వ్యక్తిగత ఆస్తికున్న భూమిక దెబ్బతింటుందని ఆయన వాదించాడు.

పెట్టుబడిదారి ఆర్థిక వ్యవస్థలలో పనిచేసే అన్ని ప్రభుత్వాలు ఎమినెంట్ డొమైన్ సూత్రాన్ని వాడతాయి.

కమ్యూనిస్టు వ్యవస్థలలో ఇ.డి పని విధానం వేరుగా వుంటుంది. కమ్యూనిస్టు దృక్పథం ప్రకారం వస్తు పంపిణీలో మార్కెట్ వ్యవస్థను పూర్తిగా పక్కన పెట్టి  ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థను రూపొందించుకోవాలి. అటువంటి పంపిణీకి భూమిక మనుషుల అవసరాలు కానీ వాంఛలు కారాదు. మార్కెట్ లేని చోట వ్యక్తిగత ఆస్తి కూడా ప్రాముఖ్యత కోల్పోతుంది. ప్రతి మనిషికీ కావల్సినవన్నీ రాజ్యం తన పంపిణీ వ్యవస్థ ద్వారా సమకూర్చినప్పుడు ఏ ఒక్కవ్యక్తీ మిగిలిన వారికంటే ఎక్కువ సంపాదించటమో, దాని కోసం మిగిలిన వారు నేరాలు చేయటం వంటివో అసాధ్యమవుతాయి. కమ్యూనిస్టు సిద్ధాంతంలో వ్యక్తిగత ఆస్తి అసమానతలకు, పీడనకు మూలం. దాన్ని పెట్టుబడిదారీ విధానంతోపాటు కమ్యూనిజం రాంగానే పక్కన పడెయ్యాలి. అంటే కమ్యూనిస్టు ఆలోచనా విధానంలో ఎమినెంట్ డొమైన్ సూత్రం అన్నిరకాల ఆర్థిక లావాదేవీలను ప్రజా ప్రయోజనాలనే విస్తృత అర్థంలో చూడటానికి ఉపయోగించచ్చు.

**వలసపాలన కింద భారత దేశంలో ఎమినెంట్ డొమైన్ సూత్ర పని విధానం:**

బ్రిటిష్ వారు భారతదేశాన్ని వలస రాజ్యంగా చేసుకున్నప్పుడు, ఇక్కడి భూ యాజమాన్య, రెవన్యూ, శిస్తు విధానాలను చూసి అయోమయానికి గురయ్యారు. మొదట్లో వారికి వ్యవసాయ భూముల నుండి రెవెన్యూ పొందటానికి ఏ మార్గమూ కన్పించలేదు. అందువల్లనే 1750 నుండి 1900 సంవత్సరం వరకూ కూడా బ్రిటిషు వారు భారతదేశంలో 'సరైన' ఆస్తి చట్టాలు  రూపొందించవలసి వచ్చింది. బెంగాల్ ప్రెసిడెన్సీలో మొదట మొఘలుల కాలంనాటి చట్టాలను మార్చి జమీందారి వ్యవస్థ ద్వారా వలసవాదులు కొత్త ఆస్తి చట్టాలను ప్రవేశపెట్టారు. తరువాత దీనికంటే భిన్నమయిన రైత్వారీ చట్టాలను అన్ని ప్రాంతాల్లోనూ ప్రవేశపెట్టారు. అయితే కొన్ని పాత శిస్తు విధానాలు కొనసాగుతూ వచ్చాయి. ఈ రకమైన చట్టాలు, శిస్తు విధానాల ద్వారానే బ్రిటిష్ వారు శిస్తు ఆదాయాన్ని పెంచుకొని, ఇక్కడి వారిపై అధికారాన్ని క్రమంగా పొందుతూ వచ్చారు. ఈ రకమైన చారిత్రక పరిణామం వల్ల బ్రిటిష్ ఇండియాలో, రాజ్యం ఆస్తిపరుల మధ్య 'సామాజిక ఒప్పందం' ద్వారా పుట్టిందనే వాదన మనకెక్కడా కన్పించదు. భారత దేశంలో వున్న 'భూ యాజమాన్యం' అంతా వలసపాలన ద్వారా జాగ్రత్తగా రూపొందించబడిన చట్టపరమైన కథనం. దాని పరిణామాలు మనమిప్పటికీ అనుభవిస్తున్నాం. ఇటువంటి చారిత్రక నేపథ్యంలో చూసినప్పుడు 1894లో వచ్చిన భూ ఆధీన చట్టం వలసపాలకుల ఎమినెంట్ డొమైన్ ప్రకటనగా అర్థం చేసుకోవచ్చు.  దీర్ఘకాలిక చారిత్రక దృక్పథంలో చూసినప్పుడు వలసపాలన కింద రూపొందించబడిన ఆస్తి చట్టాల వారసత్వం మరియు ఒక అభివృద్ధి చెందిన దేశంగా నిలబడాలనే స్వాతంత్ర్యానంతర భారత రాజ్య తపన రెండూ కూడా 21వ శతాబ్దంలో పారిశ్రామీకరణ కోసం జరుగుతున్న భూస్వాధీనంలో ఎదురవుతున్న చిక్కుముడులకు దారితీసాయని చెప్పచ్చు. ఇవి నయా ఉదారవాదం మనదేశ చరిత్ర మీద పెడుతున్న వత్తిడి నుండి పుట్టినవే. మీడియాలో ఎమినెంట్ డొమైన్‌కు పెరుగుతున్న ప్రాచుర్యం కూడా ఇటువంటి చిక్కుముడలకు సూచికే.

**అనువాదం : ఎ.సునీత**

## ప్రత్యేక సంపాదకుల పరిచయం

**ప్రొఫెసర్. కె. శ్రీనివాసులు** ఉస్మానియా యూనివర్సిటీలో అధ్యాపకులు, ప్రత్యేక ఆర్థిక మండలపై గురించి పరిశోధన చేసినారు.

**ఎన్. వసుధ** ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో, ఫ్యామిలీ, లేబర్ కోర్టులలో లాయరుగా పనిచేస్తున్నారు.

# 30 ఏళ్ళ చైనా ప్రత్యేక ఆర్థిక మండళ్ళు

■ యు-మేన్ యుంగ్, జో యన్నా లీ మరియు గోర్డాన్ కి

1949 వ సంవత్సరంలో విప్లవ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు దశాబ్దాల అనంతరం 1970 చివరి దశ నాటికి చైనా ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశం. వ్యవస్థాగత మార్పుల ఆవశ్యకత అత్యంత తీవ్రంగా ఉన్న స్థితి. దశాబ్ద కాలంపాటు సాగిన సాంస్కృతిక విప్లవం ఆర్థిక రంగాన్ని స్తబ్దతలోకి, ప్రజలను భౌతికపరంగా, భావపరంగా నిస్తేజంలోకి వదిలి పతనం చెందడం పూర్తయ్యింది. 30 సంవత్సరాలపాటు తమకు తాముగా ఇతరులతో సంబంధాలు లేకుండా ఒంటరితనాన్ని విధించుకున్న చైనా నాయకత్వానికి, మూసుకున్న తలుపులు తెరిచి ప్రపంచంతో ఆర్థిక సంబంధాలను పునరుద్దరించుకోవాలనే నిర్ణయానికి రావడం సాధారణమైన విషయమేమీ కాదు. అదే సమయంలో కొత్త ఆలోచనలు, అభిప్రాయాలు కూడా ముందుకు వచ్చాయి. చైనా బహిరంగ విధానానికి మరియు 1978లో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కణలకు సృష్టి కర్త అయిన డెంగ్ జియావో పింగ్, క్రమమైన సామాజిక మార్పు కోసం మౌలికంగా కొత్త విధానాన్ని సూచించాడు.

"తమ కష్టంతో మంచి ఫలితాలను సాధించిన కొంత మంది కార్మికులు, రైతులకు ప్రతిఫలాలు అందేలా వారి జీవన విధానం మరింత మెరుగుపరుచుకునే అవకాశం కల్పించాలి. నా దృష్టిలో కొన్ని ప్రాంతాలలో, వాణిజ్య సంస్థలను అనుమతించాలి. వాళ్ళు గొప్ప ఉత్పత్తిని సాధించడం ద్వారా తమ చుట్టూ ఉన్న ప్రజల పైన శక్తివంతమైన ప్రభావం చూపించి ఇతర ప్రాంతాలలోని ప్రజలను ఉత్తేజపరిచి మరిన్ని మంచి ఫలితాలను సాధించడానికి తోడ్పడతారు. వీళ్ళ అనుభవాలను వర్క్ యూనిట్స్ అనుసరిస్తాయి. ఆ విధంగా దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెంది అలలు అలలుగా ఉప్పొంగి ముందుకు పోతూ సాపేక్షికంగా ప్రజలందరూ బాగుంటారు". (డెంగ్ జియావో పింగ్).

డెంగ్ ఈ ప్రతిపాదనలు చేసిన తర్వాత కాలంలో చైనా ప్రభుత్వం కొన్ని ఆర్థిక సంస్కరణలను, విధాన నిర్ణయాలను చేసింది. నవంబర్ 1978లో అన్ హుయి ప్రావిన్స్‌లోని జియావోగాంగ్ అనే చిన్న గ్రామంలోని రైతులు "కాంట్రాక్ట్ రెస్పాన్స్‌బిలిటీ సిస్టం" (ఒప్పందపు బాధ్యత విధానం)ను ప్రప్రథమంగా ప్రవేశ పెట్టారు. ఇది అనంతర కాలంలో చైనాలో ప్రవేశపెట్టిన గ్రామీణ సంస్కరణలకు ఒక చోదక శక్తిగా పనిచేసిందని గుర్తించడం జరిగింది. ఆ మరుసటి నెలలో జరిగిన 11వ కాంగ్రెసు 3వ ప్లీనరీలో ఇతర దేశాలతో వ్యాపార వాణిజ్యాలు నిర్వహించేందుకు తమ ఆర్థిక వ్యవస్థ ద్వారాలు తెరిచే బహిరంగ విధానాన్ని ఆమోదిస్తూ చైనా కమ్యూనిస్టు పార్టీ నిర్ణయం తీసుకుంది. అంతేకాక 1979 జులై నెలలో గ్యాంగ్ డాంగ్ మరియు ఫుజియన్ ప్రావిన్సులలో ఇతర దేశాలతో వ్యాపార, వాణిజ్యం జరిపేందుకు "ప్రత్యేక విధానాలు మరియు వెసులుబాటు చర్యలు" అమలు జరపడంలో ఈ రెండు ప్రావిన్సులు చొరవ తీసుకుని మార్గదర్శకత్వం వహించాలని పార్టీ సెంట్రల్ కమిటి నిర్ణయించింది. 1980 ఆగస్టు మాసానికంతా గ్యాంగ్ డాంగ్ ప్రావిన్స్‌లోని షెన్‌జెన్ జుహాయి మరియు షాన్‌టౌలను ప్రత్యేక ఆర్థిక మండలాలుగా ప్రకటించడం, వీటి కొనసాగింపుగా 1980 అక్టోబరు నాటికి ఫుజియన్ ప్రావిన్సులోని జియామెన్‌ను కూడ ప్రత్యేక ఆర్థిక మండలిగా గుర్తించడం జరిగింది. సుదీర్ఘమైన మేధోపరమైన చర్చ తరువాత ఆ ప్రాంతాలకు ప్రత్యేక ఆర్థిక మండలిగా నామకరణం చేయడం జరిగింది. ప్రత్యేక ఆర్థిక మండలి అంటే కేవలం ఒకే రకమైన పని లేదా ఉత్పత్తి జరిగే కార్య క్షేత్రంగా కాకుండా పరస్పర సంబంధం కలిగిన ఆర్థిక, వాణిజ్య కార్యక్రమాలను నిర్వహించే ప్రాంతంగా నిర్వచించబడింది

### భిన్న అభివృద్ధి మార్గాలు :

ప్రత్యేక ఆర్థిక మండలాలను ఏర్పరచడం వెనుక ఉన్న ప్రధాన లక్ష్యాలు - విదేశీ పెట్టుబడులను నేరుగా ఆకర్షించడం, చైనా ఎగుమతులను విస్తరింపచేసుకోవడం, నూతన సాంకేతిక విజ్ఞానాన్ని కనుగొనే ప్రక్రియను వేగిరపరచడం. 1980లో ఏర్పాటు చేసిన 4 ప్రత్యేక ఆర్థిక మండలాలు ఒకదానితో ఒకటి పోలి ఉండి, విశాలమైన కార్యక్షేత్రం కలిగి ఉండి, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ఏర్పాటు చేయబడ్డాయి. ఆచరణ సాధ్యమైన నూతన ఆర్థిక విధానాలకు ఒక ప్రయోగాత్మక ప్రాంతంగా ప్రభుత్వం ప్రోత్సహించిన ఈ విధానం సత్ఫలితాలనిచ్చి సమర్థవంతమైనవని నిరూపించబడితే దేశవ్యాపితంగా మరింత విస్తృత స్థాయిలో అమలుపరచాలని చైనా ప్రభుత్వం భావించింది. ప్రపంచంతో దృఢమైన సంబంధాలతో పాటు పెట్టుబడిదారీ దేశాలతో వ్యాపార వాణిజ్య సంబంధాలను ఏర్పరచుకోవడం, చైనాలోని వివిధ ప్రాంతాలతో ప్రత్యేక ఆర్థిక మండలాలను అనుసంధానం చేయడం చైనా వ్యవస్థకు అత్యంత అవసరమని భావించారు. (...)

### ముగింపు - భవిష్యత్తు దృష్టికోణం :

చైనా గణతంత్ర ప్రజా ప్రభుత్వం అనిశ్చితంగానే అయినప్పటికీ ఒక చారిత్రాత్మక నిర్ణయంతో, మూడు దశాబ్దాలుగా అమలవుతున్న "రెండు కాళ్ళ మీద ప్రయాణం"(స్వశక్తి మీద ఆధారపడడం)ను వెనక్కు తీసుకుని, 1978లో విదేశీ వాణిజ్యానికి తమ ఆర్థిక వ్యవస్థ ద్వారాలు తెరవాలని, అదే సమయంలో నూతన విధానాలను పరిశీలించే నిమిత్తం 5 ప్రత్యేక ఆర్థిక మండలాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రయోగాత్మకమైనప్పటికీ ఆనాడు ప్రపంచంలోను, చైనాలోనూ ఉన్న పరిస్థితులను బట్టి అనుభవాలను బట్టి పై నిర్ణయం సరైనదేనని నిరూపించబడింది. ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా సంస్కరణలను చేపట్టి సెజ్‌లు స్థాపించిన మూడు దశాబ్దాల అనంతరం 2008లో పరిశీలిస్తే ఈ విధానాలు తాత్కాలికంగానే అయినా సఫలమయ్యాయని అనుభవం చూపింది. చైనా ఈనాడు ప్రపంచలోనే ఆర్థికంగా ఎంతో శక్తివంతమైన దేశం.

అయినప్పటికీ ప్రపంచ వ్యాపితంగా ప్రస్తుతం నెలకొని ఉన్న ఆర్థిక మాంద్యం ప్రభావం చైనాపై పడక పోలేదు. అమెరికా, యూరప్‌లలోని మాంద్యం వలన చైనా ఎగుమతులు తగ్గుముఖం పట్టాయి. చైనా ఎకానమి ద్వారాలు పూర్తిగా తెరవకపోవడం వలన రాబోయే సంవత్సరాలలో సంక్షోభాన్నించి పక్కకు తప్పుకొనే వీలుంది. చైనా ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేయడానికి నాయకత్వం ఇటీవల కాలంలో అనేక చర్యలను చేపట్టింది. అంతేకాక అత్యధిక విదేశీ ద్రవ్యనిధి కలిగి ఉండడం కూడా ప్రపంచ పరిణామాలను తట్టుకోగలిగే శక్తిని కల్పించాయి.

వివిధ కారణాలతో చైనా సెజ్‌లలోని వేల కర్మాగారాలు మూతపడ్డాయి. ఫలితంగా 30 ఏళ్ళుగా సెజ్‌ల అభివృద్ధికి ప్రధాన శక్తిగా పనిచేసిన వలస కార్మికులు నిరుద్యోగులయ్యారు. ఈ మాంద్యానికి గట్టిగా దెబ్బతిన్న ప్రాంతాలలో పెరల్ రివర్ డెల్టా ప్రాంతం ప్రధానమైనది. ఇక్కడ చాలా ఎక్కువ కర్మాగారాలను స్థాపించడం జరిగింది. ఇందులో అత్యధిక శాతం మూతపడడంతో మెజార్టీ కార్మికులు నిరుద్యోగులయ్యారు. గ్యాంగ్ డాంగ్ ప్రావిన్సులో పదిలక్షల పారిశ్రామిక సంస్థలుండగా అందులో దాదాపు 50 వేల సంస్థలు 2008 సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లోనే మూతపడి దాదాపు మూడు కోట్ల మంది కార్మికులు నిరుద్యోగులయ్యారు. వీరిలో అత్యధికులు తమ సొంత గ్రామాలకు తరలి వెళ్ళిపోయారు. వీరికి చెల్లించవలసిన ఆర్థిక రాయితీలు కూడ నిరాకరించబడ్డాయి. నిరుద్యోగం వల్ల కొనుగోలు శక్తి తగ్గి ఆయా గ్రామాల అభివృద్ధి కూడా కుంటుపడింది. కార్మికుల వలసల వల్ల వారి స్వగ్రామం, వారి గమ్య స్థానాలలో మార్పు వస్తుంది. కాని సెజ్‌లలో ఈ మార్పు యొక్క ప్రభావం ఆ మండలిలో జరుగుతున్న ఉత్పత్తి స్వభావం, వలస కార్మికుల సంఖ్యపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు షెన్‌జెన్ ప్రాంతంలోని సెజ్ ఆర్థికపరంగా, సాంకేతికపరంగా బలంగా ఉండడం వల్ల నూతన పరిస్థితులను తట్టుకోగలదు. గత ముప్ఫయి సంవత్సరాల

కాలంలో చైనా సాధించిన అద్భుతమైన ఆర్థిక అభివృద్ధి ఈ సెజ్‌లలో అనుసరించిన నూతన విధానాలు, ఆచరణ వల్లనే సాధ్యపడిందని చెప్పాలి. అంతేకాక మావో కాలం లోని పారిశ్రామిక అభివృద్ధి శేషం, అవస్థాపన యొక్క వారసత్వం కూడా ఈ అభివృద్ధికి తోడ్పడ్డాయని ఈమధ్య కాలంలో వచ్చిన ఒక రివ్యూలో వెల్లడించారు.

దేశంలోని అంతర్గత వాతావరణం, ప్రపంచ వ్యాప్త పరిస్థితులు ఈ రెండూ చైనాకు అనుకూలంగా ఉండడం అదృష్టవశాత్తు చైనాకు కలిసొచ్చిన అంశం. సుదీర్ఘకాలంపాటు కొనసాగిన సాంస్కృతిక విప్లవం పట్ల భ్రమలు కోల్పోయిన ప్రజల సంక్షేమం కోసం ఎటువంటి చర్యలు చెయ్యడానికైనా చైనా ప్రభుత్వం వెనుకాడలేదు. విపత్కర పరిస్థితి అవ్వడం వలన ప్రపంచీకరణ వేగవంతం అయ్యే సమయానికి చైనాలోని సెజ్‌లలో ఎగుమతి ధ్యేయంగా ఉత్పత్తి జరగడం చైనాకు కలిసి వచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఉత్పత్తి కేంద్రాల ద్వారా వాణిజ్యం ఎగుమతులు పెరిగి తద్వారా చైనాలో సమతుల్య అభివృద్ధి జరిగింది. ఆర్థిక, పట్టణ అభివృద్ధిలో షెన్‌జెన్ చైనాలోనే కాదు, ప్రపంచంలోనే రికార్డు సాధించింది.

ప్రారంభంలో కొన్ని ప్రాంతాలకే పరిమితమైన విధానాలు, వసతులు 1992 నాటికి చైనాలోని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించాయి. 2001లో ప్రపంచ వాణిజ్య సంస్థలో చైనా సభ్యత్వం పొందిన తర్వాత సెజ్‌లకున్న ప్రత్యేకతలు తగ్గి దేశంలోని అన్ని ప్రాంతాలకు ఒకే తరహా సూత్రాలను అన్వయించి సరళీకృత వాణిజ్యానికి, పెట్టుబడులకు ద్వారాలు తెరవడం జరిగింది. ఇప్పటి సెజ్‌లకున్న ప్రత్యేకతలు పాత విధానాల నుండి సంక్రమించినవే. అవి దేశం యొక్క అంతర్గత బలాన్ని ప్రతిబింబిస్తాయి. చైనాలో కొత్త విధానాలను ప్రచారంలోకి తీసుకురావడంలో, ఆచరించడంలో ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేయడంలో పెట్టుబడికి మార్కెట్‌ను కల్పించడంలో సెజ్‌ల పాత్రను తక్కువగా అంచనా వేయలేము.

ఆర్థిక అభివృద్ధి కొరకు నూతన మార్గాలను అన్వేషించడంలో, పరిపాలనలో సహకారాన్ని, సమన్వయాన్ని విస్తృత స్థాయిలో సాధించడంలో మిగతా సెజ్‌లకు షెన్‌జెన్ సెజ్ ఒక మంచి ఉదాహరణ. సరికొత్త ఆలోచనలు, సంస్థాగత పునర్ నిర్మాణం ద్వారా విదేశీ భాగస్వామ్యంతో వారి వారి ప్రాంతాలలో నిలకడైన అభివృద్ధిని సాధించడం ఎలాగో ఆలోచించాలి. గ్రేటర్ పర్ల్ నదీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయుటకు ఇటీవల ఆమోదం పొందిన ప్రణాళిక ఒక మంచి పరిణామం. సెజ్‌ల ద్వారా 1980లో శీఘ్రగతిన జరిగిన ఆర్థిక అభివృద్ధి పట్టణ ప్రాంతాల అభివృద్ధికి తోడ్పడగా, గ్రామీణ ప్రాంతంలో అభివృద్ధిని సాధించడానికి 2008లో చైనా నాయకత్వం కేంద్రీకరించింది.

అక్టోబరు 2008లో జరిగిన చైనా కమ్యూనిస్టు పార్టీ 17వ కాంగ్రెసు మూడవ ప్లీనంలో గ్రామీణ ప్రాంతంలోని భూములకు సంబంధించి కీలకమైన నిర్ణయాన్ని ప్రకటించింది. 1987 తరువాత చైనా పట్టణ ప్రాంత అభివృద్ధికి, షెన్‌జెన్ ప్రాంతంలోని భూ అభివృద్ధికి హక్కులు వేలం వేయగా ప్రస్తుతం ప్రకటించిన నూతన విధానం ద్వారా గ్రామీణ ప్రాంతంలోని భూములను సబ్ కాంట్రాక్ట్‌కి ఇవ్వడం, కౌలుకివ్వడం, మార్చుకోవడం వంటి పద్ధతులకు రైతులను అనుమతించటం ద్వారా గ్రామాలలో అభివృద్ధి సాధించవచ్చని భావించింది. ఈ విధానం వల్ల సెజ్‌ల ద్వారా జరిగిన అభివృద్ధికంటే ఎన్నోరెట్లు అధికంగా అభివృద్ధిని సాధించవచ్చు. గ్రామీణ ప్రాంతంలో ఇటీవల కాలంలో ప్రవేశపెట్టిన భూ సంస్కరణలను ప్రకటించడంలో చాలా జాప్యం జరిగిందని ఎవరైనా భావించవచ్చు. సమతుల్య జాతీయ అభివృద్ధి సమస్యను సమర్థవంతంగా పరిష్కరించడం ద్వారా 11వ పంచవర్ష ప్రణాళిక పునరుద్ఘాటించిన "సామరస్య సోషలిస్టు సమాజం" గమ్యానికి చేరుకోవడానికి పరిస్థితులు అంతిమంగా చైనాకు అనుకూలించవచ్చు.

ఈ లక్ష్యాన్ని సాధించడంలో సెజ్‌లు మరీ ముఖ్యంగా షెన్‌జెన్ తమ వంతు పాత్రను పోషించవలసిన అవసరం రావచ్చు. పురోగామి శక్తులుగా చైనా ఆర్థిక వ్యవస్థను అభివృద్ధిపరచడంతో ఆధునీకరించడంలో ఎదురయ్యే సామాజిక, రాజకీయ సమస్యలను పరిష్కరించడంలో షెన్‌జెన్, గ్యాంగ్ డాంగ్ ప్రావిన్సులు కీలకమైన పాత్ర పోషించవలసి రావచ్చు. రాజకీయ ప్రయోగశాలలుగా కూడా ఈ సెజ్‌లు పాత్ర పోషించవచ్చు. బహుళ పార్టీలు, ప్రజాస్వామిక మూలాల్లో మార్పులు ఇక్కడ ప్రవేశ పెట్టి తదనంతరం విస్తరించవచ్చు. షెన్‌జెన్ ప్రాంతపు మున్సిపాలిటి వెబ్‌సైట్‌లో "షెన్‌జెన్ భవిష్యత్తు సంస్కరణలు" పేరిట ఒక ముసాయిదా ప్రతిపాదన చేయబడింది. ఆ ముసాయిదాలో మేయర్ మరియు ఇతర పదవులకు అభ్యర్థులను నేరుగా ఎన్నుకోవాలనే సూచనలున్నాయి. ఇకపై షెన్‌జెన్ (బహుశా ఇతర సెజ్‌లు కూడ) ఆర్థిక సంస్కరణలకు మాత్రమే కాక, రాజకీయ, సామాజిక ప్రయోగశాలగా కూడా తన పాత్రను పోషించే అవకాశం ఉంది.

**అనువాదం : కె.సంధ్య**

**Excerpted from Eurasian Geography and Economics, 2009, 50 N0.2**

**pp 222-240**



# నిజాం బ్రాడ్ షీట్‌పై చర్చ

## లెటర్ టు ద ఎడిటర్


Anveshi
RESEARCH CENTRE FOR WOMEN'S STUDIES

సమకాలీన రాజకీయాలపై బ్రాడ్‌షీట్

**నిజాం పరిపాలన, ముస్లింలు**

**హైదరాబాద్ 'విమోచన' గురించి నిజాలు, కట్టుకథలు**

*సంచిక : 1(త్రైమాసికం)* *తెలుగు & ఇంగ్లీష్* *నవంబర్ 2010* *విరాళం : 10 రూ.*

విషయసూచిక

- ఎడిటోరియల్
- చరిత్ర, నిశ్శబ్దాలు
  ఎమ్.ఎ.మోయిద్
- నా శవ పేటికపై ఉత్సవాలా!
  ఎం.ఎ.మాజిద్
- హైదరాబాద్‌పై ఒక ముస్లిం దృక్కోణం
  హసనుద్దీన్ అహ్మద్
- ఆత్మ గౌరవాన్ని దెబ్బకొట్టవద్దు
  రఫత్‌సీమా, కనీజ్ ఫాతిమా
- అర్థసత్యాలు, అపోహాలు
  దివికుమార్
- నిజాలను నీరు గార్చే ప్రయత్నం
  శ్రీనివాస్ ఏశాల
- 'ఒకే నిజాం': రెండు స్ఫురణలు
  ఆర్. శ్రీవత్సన్

H.E.H. Mir Osman Ali Khan
Nizam of Hyderabad

**సంపాదకులు:** ఎమ్.ఎ.మోయిద్, ఎ. సునీత, ఆర్. శ్రీవత్సన్

కనీజ్ ఫాతిమా, ఎమ్.ఎ.మోయిద్, ఆర్.శ్రీవత్సన్ (ఇంగ్లీష్), ఎ. శ్రీనివాస్, ఎ. సునీత (తెలుగు)

షీలా ప్రసాద్, అయేషా ఫరూకీ, రమ మెల్కొటె, కె. సజయ, పి.మాధవి, బి.శ్యామసుందరి, సూశీ థారు, వీణా శత్రుఘ్న, డి. వసంత, కె.లలిత, ఎన్. వసుధ, గోగు శ్యామల, వి. ఉష

ఏ. శ్రీనివాస్, టి. శ్రీలక్ష్మి

2-2-18/49, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ, అంబర్‌పేట్, హైదరాబాదు -500013.

సర్,

2010 నవంబర్, సమకాలీన రాజకీయాలపై త్రైమాసిక బ్రాడ్‌షీట్ చదివిన తర్వాత, నా అభిప్రాయాల పంపుతున్నాను. హైదరాబాద్‌పై ఒక ముస్లిం ధృక్కోణం, ఆత్మగౌరవాన్ని దెబ్బకొట్టవద్దు, అర్థసత్యాలు, అపోహలు మరియు మీ ఎడిటోరియల్ చదివాక నాకు నిజంగా ఆశ్చర్యం వేసింది. నిజాలు కానివాటితో, పచ్చి అబద్దాలతో, అర్థ సత్యాలను కలిపి ఏదైనా నిరూపించ వచ్చని అనిపించింది. సౌత్ ఆఫ్రికాలో తెల్ల క్రిస్టియన్‌లు చాలా సార్లు ప్రవాహంగా గెలుపొంది, అక్కడి స్థానికులను బానిసలుగా మార్చారు మరియు మత మార్పిడులు చేశారు. స్థానికులకు సొంత రాజ్యాలు, రాజులు, సమాజాలు ఉండేవి, అలాగే సొంత విశ్వాసాలు, నమ్మకాలుండేవి. వీళ్ళ పైన గెలుపొందిన వాళ్ళు తొంభై శాతం పైగా స్థానికులను బలవంతంగా లేదా ఆశలు చూయించి మతమార్పిడులు చేశారు. 300-400 సంవత్సరాల పాలన తర్వాత 9% జనాభా ఉన్న తెల్ల యూరోపియన్ క్రిస్టియన్‌లు తమ అధికారాన్ని వదులుకోవలిసి వచ్చింది, 1994లో నల్ల జాతీయులు అధికారంలోకి వచ్చారు. హింస, టెర్రరిజంతో కలిసిన దశాబ్దాల పోరాటం తర్వాతే నల్లజాతీయులకు అధికారం వచ్చింది.

గతంలో హైదరాబాద్‌లోకాని, భారత దేశంలో కాని అధికారంలో ఉన్న ముస్లింల పరిపాలనకు సౌత్ ఆఫ్రికాలోని వైట్ క్రిస్టియన్‌ల పాలనకు వ్యత్యాసం ఉందా? సౌత్ ఆఫ్రికాను గెలిచి యూరోపియన్‌లు ఎలాగయితే స్థిరపడ్డారో, ఇండియాలో కూడ ఇస్లాం ఆక్రమణదారులు వారి సైన్యం అలాగే వచ్చారు. అందువల్ల ఇండియాలోని కొన్ని భాగాల్లోని ముస్లింల పాలకులు, సౌత్ ఆఫ్రికాలోని వైట్ యూరోపియన్‌ల లాగానే ఉన్నారు.

సౌత్ ఆఫ్రికా దేశాన్ని శతాబ్దాలు పాలించి దోపిడి చేసిన తర్వాత వాళ్ళు రిజర్వేషన్స్ కావాలని అడగలేదు. ఇండియాలో నిజంగా చదువుకున్న, సంస్కృతి, నాగరికత ఉన్నవాళ్ళు అధికారం కోల్పోయిన కొన్ని సంవత్సరాలలోనే వెనుకబడి ఉన్నారనేది నమ్మలేకుండా ఉంది.

ఐక్యరాజ్య సమితిలో హైదరాబాద్ రాజ్యం యూనియన్‌లో కలవడంపై చర్చ జరిగిందని అసత్యాన్ని చేర్చారు. ఇది పూర్తిగా అబద్ధం. నిజాం ఇస్లామిక్ దేశమైన సిరియా ద్వారా సెక్యూరిటి కౌన్సిల్‌కు సమస్యను తెలియజేయటం కోసం ప్రయత్నించాడు. ఐక్యరాజ్య సమితిలో ఈ విషయంపై చర్చ జరగలేదు,జోక్యం కూడా చేసుకోలేదు,

హైదరాబాద్ ఇండియాలో కలిసే విషయంలో, 500 సంస్థానాల చేరే దానిలో వ్యత్యాసం ఏమిటని అడగవచ్చు. ఇది పూర్తిగా డిఫరెంట్. ఎలాంటి సైన్యాన్ని అక్కడికి పంపే అవసరం రాలేదు, కొంత మంది చాలా సంతోషించారు, కొంత మందిని అడగవలిసి వచ్చింది కాని ఒక్క గుండు పేల్చనవసరం రాలేదు. జునాఘడ్, కాశ్మీర్‌లలోనే ప్రాబ్లం ఎదురయ్యాయి. నిజాం ఒక అభిప్రాయానికి రాకపోవడం వల్ల హైదరాబాద్ విషయంలో స్టాండ్ స్టిల్ అగ్రిమెంట్ వచ్చింది. ఇండియా దీనిని సహృదయంతో ఇచ్చారు. మిగిలిన సంస్థానాలన్ని స్వచ్ఛందంగా ఇండియాలో కలిశాయి. కావున లిబరేషన్ డే జరుపుకోవటం లేదు. అందుకే హిందూ వ్యతిరేక నిజాం నుండి కమ్యూనల్ రజాకార్ల నుండి విముక్తి పొందిన ఇక్కడి ప్రజలు లిబరేషన్‌డే జరుపుకొంటున్నారు.

నిజాం పాలనలో మత సహనం ఉంది, ప్రజలంతా సుఖంగా ఉన్నారని అనుకోవడం సత్యం కాదు. ముస్లింలు వారి అనుయాయిలు సంతోషంగానే ఉన్నారు. అపుడు అణిచివేత, బానిసత్వం ఉంది కాబట్టే ప్రజలు సాయుధ పోరాటంలో చేరారు. స్థానిక భాషలు అధికార భాష కాదు, పది శాతం ప్రజలు మాట్లాడే భాష ఉర్దూ మీడియంనే ఆయన బలవంతంగా అమలు పరచారు. బ్రిటిష్ వాళ్ళు ఇంగ్లీషును బలవంతంగా ప్రవేశ పెట్టడానికి దీనికి ఏమి తేడా ఉంది? పాలకుల విశ్వాసాలకు అనుకూలంగా ఉన్న 10% మందికి 90% ఉద్యోగాలు ఇచ్చారు. 90% జనాభా ఉన్న వాళ్ళకు ఎలాంటి అవకాశాలు లేవు. హిందూ మరియు ముస్లిం విశ్వసాలు పాటించే ప్రజల పట్ల సమన్యాయం పాటించినట్లు అగుపిస్తుందా? అలాగే, నిజాం తన సొంత భూములను ఎలాంటి నష్టపరిహారం తీసుకోకుండా ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చినట్లు చెప్పబడింది కదా. ఈ భూములను నిజాం కొన్నాడా? ఈ భూములపై వచ్చే రెవిన్యూ ఆదాయం హైదరాబాద్ స్టేట్‌కి వెళ్ళకుండా నిజాం స్వంతానికి వెళ్ళేవి.

హైకోర్టు ప్రాంగణంలో విశాల హృదయంతో గుడిని కూలగొట్టలేదని చెప్పారు, ఒక్క హైదరాబాద్‌లోనే కాదు ఇండియా మెత్తంలో వందల గుడులు నేలమట్టంగా కూల్చారు .రాముడు మరియు కృష్ణుడు జన్మించాడని కోట్లాది ప్రజలు విశ్వసించే స్థలానికి అతి దగ్గరలో మసీదు ఎలా ఉంటుంది?

లిబరేషన్ సందర్భంలో పెద్ద ఎత్తున ముస్లింల ఊచకోత జరిగిందని చెప్పబడింది. ఇది పూర్తిగా అబద్ధం. ఇండియన్ ఆర్మీని అడ్డుకొన్న నిజాం సైన్యం, రజాకార్లు యుద్ధంలో చనిపోయారు. మానభంగాలు చేసి, అపహరించి, మత మార్పిడులకు పాల్పడిన రజాకార్లను ప్రజలు ప్రతీకారంగా చంపి ఉండవచ్చు. అడవి జంతువు ప్రవర్తనకు తిరిగి అడవి జంతువు చర్యే వచ్చింది, ఖచ్చింతంగా తప్పు జరిగింది. పెరూ, సౌత్ ఆఫ్రికాలోలాగా 'నిజాలు-పునరేకీకరణ' (ట్రూత్స్ అండ్ రికన్సిలియేషన్) జరిగినట్లుగా ఇండియాలో కూడ జరగవలిసి ఉండింది.

ఇండియా నుండి నరికిన అంగాలైన ఇస్లామిక్ రాజ్యాలలో హిందువులను, సిక్కులను, బుద్ధిస్టులను పిండిపిప్పి చేసి పంపించారు, ఇండియాలో మాత్రం పది శాతం ఉన్న ముస్లిం జనాభా 15-20%నికి పెరిగింది.వాళ్ళు ఇండియాలో అణిచివేయబడి ఉంటే ఇంత పెరుగుదల ఉండేది కాదు. అయినప్పటికి, గతంలో హిందూ వ్యతిరేకంగా ఉన్నారని గుర్తించకుండా, కొత్త చరిత్రను తయారు చేస్తూ అబద్ధాలను సృష్టిస్తూ నిజాలను తొక్కిపెడుతున్నారు,

చివరగా, ప్రతీకార మత రాజకీయ ఆలోచనలను పెంపొందిండం ఆరోగ్యకరం కాదు. రాజులు, నవాబులు కత్తి పట్టుకొని పాలించే కాలం పోయింది. అల్జీరియా, ఈజిప్ట్, సిరియా మరియు యెమన్‌లాంటి ముస్లిం దేశాలలోని ప్రజలు కూడా వారి నియంతృత్వ పాలకులకు వ్యతిరేకంగా నిలబడుతున్నారు. గతాన్ని గుర్తుచేసి పొగడటం బదులు అన్ని రకాల విశ్వాసాలను నమ్మే వాళ్ళు అన్ని భాషలు మాట్లాడే వాళ్ళు ఈ దేశాన్ని మాతృదేశంగా భావించాలి. ఎవరూ తమభాష మతం ఇతరుల కంటే గొప్పదని భావించరాదు. ప్రజాస్వామ్యం సమూహాలకు హక్కులు ఇవ్వదు, వ్యక్తులకే ఇస్తుంది. సహనంగా ఉండటమంటే మైనార్టీల పట్ల గౌరవంగా ఉండటం, మరియు మిగిలిన వారి విశ్వాసాలపై అసహనంగా ఉండటం కాదు.

**సంతకం: టి.హెచ్. చౌదరి**

**అనువాదం : శ్రీనివాస్ & శ్రీవత్సన్**

# హైదరాబాద్ 1948 సెప్టంబర్ 17 ముందు తరువాత

■ కేశవరావ్ జాదవ్

1948 సెప్టంబర్ 17న గత హైదరాబాద్ స్టేట్ ఇండియన్ యూనియన్‌లో కలిసి 60 ఏండ్లు దాటిపోయింది. అయినప్పటికి, హిందూ, ముస్లిం మతవాదులు మరియు కమ్యూనిస్టులు ఆరోజుకు ముందు వెనుక జరిగిన సంఘటనలోని తమ పాత్ర గురించి కఠోరమైన అరుపులతో హైదరాబాద్ చరిత్రని మరగుపరుస్తున్నారు. చరిత్రకారులు తమకు అనుకూలమైన భావజాలం వైపుకు చరిత్రను మలిచి నీచంగా దిగజారుతున్నారు, వాళ్ళ రాజకీయ సహచరులు ఎంత గొప్పగా ఉందని పొగిడినా లేదా గౌరవించినా ఇది నీచమైనదే.

ఏడవ చివరి నిజాం అయిన మీర్ ఉస్మాన్‌అలీఖాన్ (1911–1948) పాలనకు గుర్తుగా రాజకీయంగా, పరిపాలనా పరంగా తీసుకొచ్చిన విస్తృత స్థాయిలో మార్పులు కనబడతాయి. ఎత్తు పల్లాలు ప్రాంతమైన దక్కన్‌లో చెరువుల నిర్మాణం ద్వారా వ్యవసాయానికి కృషి చేశారు. తుంగభద్ర పాజెక్టు, కృష్ణా నదిపై నందికొండ ప్రాజెక్టు, గోదానదిపై గోదావరి వ్యాలి ప్రాజెక్టు, నిజాం సాగర్ ప్రజెక్టుల నిర్మాణం కొరకు పనులు ప్రారంభించారు. ఇండియన్ యూనియన్‌లో చేరడం, ఆంధ్రప్రదేశ్ అవతరణ జరగడంతో వచ్చిన రాజకీయ మార్పుల కారణంగా కృష్ణా ప్రాజెక్టు పూర్తిగా మారిపోయింది, గోదావరి ప్రాజెక్టు ఆగిపోయింది. నల్గొండ, మహబూబ్‌నగర్ కరువు ప్రాంతాల కోసం రూపొందించిన కృష్ణా ప్రాజక్టు డిజైన్ మార్చిన ఆంధ్ర పాలకులు స్వార్థంతో అప్పటికే సుభిక్షంగా ఉన్న గుంటూరు, కృష్ణా జిల్లాలకు తరలించి నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలను కరువు ప్రాంతంగా వదిలేశారు.

ఆధునిక ఉస్మానియా యూనివర్సిటీని స్థాపించిన నిజాం అన్ని స్థాయిల్లో ఉర్దూ మాధ్యమం ద్వారా భోదించాలనే ముందు అడుగు నిర్ణయాన్ని తీసుకొన్నాడు. మెజార్టీగా తెలుగు, మరాఠీ, కన్నడ మట్లాడే వాళ్ళు ఉన్నందున దీనికి వ్యతిరేకంగా కొంత అసంతృప్తి ఉండేది. అయినా ఇవాళ వెనక్కి తిరిగి చూస్తే ఉర్దూ దక్కనీ భాష నుంచే వచ్చింది కదా. ఈ భాష (దక్కని) కూడా తెలుగు, కన్నడ, మరాఠీ, హిందూస్తానీ అంశాలతో కూడినదే. ఖచ్చితంగా ఇది విదేశీ భాష కాదు, కేవలం ముస్లింలకు సంబంధించిన భాష కూడా కాదు. ఆధునిక భారత దేశంలో మొట్ట మెదటి సారి స్థానిక భాషలో విశ్వ విద్యాలయం ఉండాలనే ఆలోచనకు, ధైర్యానికి మనం నిజాంను గౌరవించాలి. రాజకీయంగా సాంస్కృతికంగా బ్రిటిష్ వాళ్ళ ప్రభావంతో ఉన్న ఆంధ్ర అగ్రవర్ణ పాలకులు నిజాం చేసిన మంచి పనిని అర్థం చేసుకోవడంలో విఫలం అయినారు.

నిజాం, రాజధానిలో ఒక వ్యవసాయ కాలేజిని, మెడికల్ కాలేజిని, మూడు సైన్స్ కాలేజీలను, ఒక ఫైన్ ఆర్ట్స్ కాలేజీని, ఆర్ట్స్ అండ్ కామర్స్ కాలేజీని, మూడు జిల్లా హెడ్ క్వార్టర్లలో ఔరంగాబాద్, గుల్‌బర్గా, వరంగల్‌లో ఆర్ట్స్ అండ్ కామర్సు కాలేజీలను ఏర్పాటు చేశాడు. ఒక పెద్ద లైబ్రరీని, ట్రాన్స్‌లేషన్ డిపార్ట్‌మెంట్‌ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత ఈ డిపార్ట్‌మెంట్లన్నీ హైజాక్ చేయబడ్డాయి లేదా నాశనం చేయబడ్డాయి. ఫలితంగా తెలంగాణా విద్యలో వెనుకబడింది.

బహుశా ప్రపంచంలోనే మొట్టమెదటి సారి ఉచిత వైద్య సంస్థలని, సేవలని అందించాడు. విక్టోరియా మెటర్నిటి హాస్పిటల్‌ని, కోఠీ హాస్పిటల్‌ని, మరియు ఉస్మానియా హాస్పిటల్‌ని, ప్రతి జిల్లాలో కనీసం ఒక హాస్పిటల్ ఉండేలా ఏర్పాటు చేశాడు. ఇవన్నీ పేద, మధ్య తరగతి వాళ్ళ అవసరాలు తీర్చేవి. ఆంధ్రపాలకులు ఈ సంస్థలన్నింటినీ పూర్తిగా నాశనం చేసి, అయిదు నక్షత్రాల హాస్పిటల్‌లని ఏర్పాటు చేయడం అక్కడికే వెళ్ళడంతో పేద మధ్యతరగతిని గాలికి వదిలేశారు. ఆధునిక హైకోర్టుని నిర్మించి ప్రజలకు న్యాయం అందేలా నిజాం మరో ముందడుగు వేశాడు. హైదరాబాద్ నగరవాసులకు ప్రాథమిక సౌకర్యాల కల్పన కోసమని డ్రైనేజి వ్యవస్థని, మంచినీటి సరఫరాని ఏర్పాటు చేశాడు.

1940 వరకు, బహదూర్ యార్ జంగ్ ఆధ్వర్యంలో మజ్లిస్–ఇత్తేహద్–వుల్–ముస్లిమీన్ (ఎమ్.ఐ.ఎమ్) మొదలు పెట్టి 'అనల్‌మాలిక్' –మేము (ముస్లిమ్స్) పాలకులం అనే స్లోగన్ ఇచ్చినా; మెత్తం ప్రపంచాన్ని వేదిక్ ధర్మగా మార్చే ఉద్దేశ్యంతో ఆర్యసమాజ్ మొదలు అయినా హైదరాబాద్ ప్రశాంతంగానే ఉంది. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ చురుకుగా కార్యక్రమాలు మెదలుపెట్టింది, సోషలిస్ట్, కమూనిస్టు మూవ్‌మెంట్‌లు ఉనికిలోకి వచ్చాయి. ఇంకా రెండు ఉద్యమాలు కూడా వచ్చాయి, స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ముల్కి ఉద్యమం, అమానవీయమైన భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా కొమరం భీం నాయకత్వంలో గోండుల పోరాటాలు వచ్చాయి. నిజాం వెంటనే రెస్పాండ్ అయ్యాడు. జర్మనీ ఆంత్రపాలజిస్టు అయిన హైమెన్‌డార్ఫ్‌ను గోండుల సమస్యకు పరిష్కారాన్ని సూచించమని కోరాడు, మరియు స్థానికులకే ఉద్యోగాలు వచ్చేలా ముల్కి నిబంధనలు రూపొందించాడు. సుప్రీం కోర్టు అప్‌హెల్డ్ చేసినా ఆంధ్ర పాలకులు ముల్కి నిబంధనలు రద్దు చేశారు.

అయినా కానీ, హైదరాబాద్ రాజ్యంలో రాజకీయ అస్థిరత 1940లో ముందుకు వచ్చి 1948 వరకు ఉంది. ఈ పీరియడ్‌లో జాతీయ రాజకీయాల ప్రభావం హైదరాబాద్ పై పెద్ద ఎత్తున పడింది. 1940లో భారత రాజకీయాలలో కారు మబ్బులు కనబడ్డాయి. కమ్యూనిస్టుల మద్దతుతో ముస్లింలీగ్ మత ప్రాతిపాదికన దేశ విభజనకు డిమాండు చేసింది. 1940–46లో బెంగాల్, బీహార్, పంజాబ్‌లో పెద్ద ఎత్తున మత కల్లోలాలు జరిగాయి. ప్రపంచంలోనే అతి పెద్ద మానవ వలస జరిగింది, గాంధీ హత్యకు గురి అయ్యాడు. హైదరాబాద్‌లో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఇండియన్ యూనియన్‌లో కలవాలని సత్యాగ్రహం మెదలుపెట్టింది. భాధ్యతాయుతమైన ప్రజాస్వామ్య ప్రభుత్వం కావాలని సోషలిస్ట్ అనుబంధ హైదరాబాద్ విద్యార్థి సంఘం మరియు కమ్యూనిస్టు అనుబంధ ఆల్ హైదరాబాద్ స్టుడెంట్స్ ఫెడరేషన్ క్విట్ కాలేజీ ఉద్యమాన్ని 1947లో మెదలు పెట్టింది. ఇంకో వైపున మత మౌఢ్య కాశీం రజ్వీ నాయకత్వంలో ఎమ్.ఐ.ఎమ్ రజాకార్ (సేవకులు) అనే కమ్యూనల్ క్రిమినల్ సంస్థని మెదలుపెట్టింది. హైదరాబాద్ సంరక్షణ కోసం ఈ రజాకారులు యూనిఫాంలు వేసుకొని తుపాకులు ధరించారు. ఆ సమయంలోనే సోషలిస్టులు, కమూనిస్టులు సాయుధ పోరాటాన్ని భూస్వాములకు, రజాకార్లకు వ్యతిరేకంగా మెదలు పెట్టారు.

**అనువాదం : శ్రీనివాస్ & శ్రీవత్సన్**

